www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 21 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ ఫాల్గుణ బహుళ సప్తమి
01-07 ఏప్రిల్ 2024
వెల : ₹20/-



## ఉచితాలే ఓట్లు రాల్చే తాయిలాలు



# సంఘే శక్తిః కలౌ యుగే

హిందువులకు మాత్రం భారతదేశం ఒక్కటే ఉంది.
ఇది ఎప్పటికీ గుర్తుంచుకోవలసిన సత్యం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# అయోధ్యలో వైభవంగా 'రంగోత్సవం'

అయోధ్య రామజన్మభూమిలో బాలరాముని ప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన తొలి 'రంగోత్సవం' వర్ణమయ శోభితంగా జరిగింది. తొలి 'రంగ్‌భరి ఏకాదశి'తో రంగోత్సవం ప్రారంభమైంది. ఆలయం ముందు కళ్లుచెదిరే రంగోలి, రంగు రంగుల పూలతో అలంకరణ చేశారు. ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ రంగోత్సవం సందర్భంగా రామునికి నివేదించే కచోరి, గుజియా, ఖీర్ వంటి పదార్థాలతో పాటు గులాల్‌ను కూడా సమర్పించారు. తొలి రంగోత్సవం సందర్భంగా ఆలయంలోపల భక్తులపై గులాల్‌ను చల్లడం విశేషం. ఆలయం బయట కూడా భక్తులు రంగులు చల్లుకుని వసంతోత్సవాన్ని జరుపుకున్నారు.






# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..

జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..

ఐదు సం.రాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

సం. చందా రూ.850/-
http://payit.cc/S18970

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో
స్కాన్ చేయండి. లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

విడి ప్రతి
రూ.20/-




తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను
రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు)
ద్వారా అందుకోవడానికి
పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- +
మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/- )

వెల : రూ.1474/-
https://payit.cc/S32796




**Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,Hyderabad,
IFSC : UTIB0002157,PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013

శుభకార్యాలకు 'జాగృతి' సంచికను బహుమతిగా ఇవ్వవచ్చును

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్ 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ




ముఖపత్ర కథనం

**సంఘే శక్తిః కలౌ యుగే**

6లో

ఆర్థికంగా దివాళా అంచుకు చేరిన కేరళ ప్రభుత్వం ఆ వాస్తవం నుంచి ప్రజలను ఏమార్చడానికి దేశంలో రాజ్యాంగపరమైన ఒక అవాంఛనీయ వాతావరణం సృష్టించే ఆలోచనకు వచ్చినట్టే ఉంది. భారత రాజ్యాంగ అధిపతి రాష్ట్రపతి. వారి ఒక నిర్ణయాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కేరళ వామపక్ష ప్రభుత్వం భారత అత్యున్నత న్యాయస్థానం -సుప్రీంకోర్టును అభ్యర్థిస్తున్నది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌లకు వ్యతిరేకంగా కేరళ దాఖలు చేసిన వ్యాజ్యంలో కీలకాంశం ఇదే. మార్చి 23న ఈ వ్యాజ్యం సుప్రీంకోర్టు ఎదుటికి వచ్చింది.

శాసనసభ ఆమోదించిన వాటిలో ఓ నాలుగు బిల్లులను ఎలాంటి కారణం చెప్పకుండానే రాష్ట్రపతి నిలిపివేశారన్నది కేరళ ఆరోపణ. రాజ్యాంగంలోని 14, 200, 201 అధికరణాలను రాష్ట్రపతి ఉల్లంఘించారన్నది ప్రభుత్వ వాదన. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నడుమ అతి సున్నితమైన అధికార సమతౌల్యాన్ని రాష్ట్రపతి ఈ నిర్ణయం లేదా చర్య భగ్నం చేస్తున్నదని గగ్గోలు పెడుతున్నది. బిల్లులను గవర్నర్ నిలిపి ఉంచగలిగే కాలం, వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపే కాలం వంటి అంశాలను కూడా ప్రభుత్వం ప్రశ్నించింది. రాష్ట్రాల పరిధిలోని అంశాలకు సంబంధించిన బిల్లులను కూడా నిలిపి ఉంచవలసిందిగా రాష్ట్రపతికి సలహా ఇస్తే అది సమాఖ్య విధానానికి చేటేనని కూడా ఆ రాష్ట్రం వాదిస్తున్నది. రెండేళ్లుగా ఏడు బిల్లులు రాష్ట్రపతి వద్ద అనుమతికి నోచుకోకుండా ఉండిపోయాయనీ,ఆ బిల్లులలో ఏ ఒక్కటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలను నిర్దేశించేవి కూడా కాదనీ ఆ రాష్ట్రం వాదన. ఏడు బిల్లులను నవంబర్ 2023న రాష్ట్రపతి నిర్ణయానికి పంపించారు. వాటిలో విశ్వవిద్యాలయాల చట్టాలు (సవరణ) (నం.2), కేరళ కో ఆపరేటివ్ సొసైటీస్ (సవరణ) బిల్లు 2022, విశ్వవిద్యాలయాల చట్టాలు (సవరణ) (నం.3) 2022. ఈ నాలుగింటిని మాత్రం ఆమోదించడం లేదని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 23, 29 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వానికి

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ ఫాల్గుణ బహుళ సప్తమి**

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000

సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

## లోపలి పేజీలలో...

జాతీయం
**కేజ్రీ కథలో అసలు విషాదం!**
12లో





అంతర్జాతీయం
**తీరు మారిన యుద్ధాలు**
20లో

జలగండం
**నగరాలలో నీటి సంక్షోభానికి కారణం ఎవరు?**
32లో



# జాగృతి

## సంపాదకీయం

# అరాచకం కోసం ఆరాటం

తెలియచేసింది. తమ శాసనసభ ఆమోదించిన బిల్లులను ఎలాంటి కారణం వెల్లడించకుండా ఆపివేయడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కేరళ తన పిటిషన్‌లో కోరింది.

రాష్ట్రపతి కొన్ని బిల్లులను నిలిపివేయడం గతంలోనూ ఉన్నది కాని, దానిని కోర్టులో సవాలు చేయడం చరిత్రలో ఇదే తొలిసారి అని బీజేపీ నేత, కేంద్రమంత్రి వి. మురళీధరన్ విమర్శించారు. అయినా కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సీపీఎం నాయకుడు రాధాకృష్ణన్ కలసి ఈ కేసును ఫైల్ చేశారని అంటూ కేంద్రమంత్రి, ఒక ఐఏఎస్ అధికారి రాజకీయ నాయకుడితో కలసి వేసిన ఈ వ్యాజ్యానికి చట్టబద్ధత ఎక్కడిదని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వాన్ని, కేరళ గవర్నర్‌ను, గవర్నర్ అదనపు కార్యదర్శిని కూడా ఈ కేసులో పార్టీలుగా చేసింది రాష్ట్రం.

ఇండీ భాగస్వామి సీపీఎం మీద మరొక భాగస్వామి కాంగ్రెస్ పార్టీ నాయకుడు శశి థరూర్ చక్కని వ్యాఖ్య చేశారు. 'ఆ కేసును పూర్తిగా అధ్యయనం చేయలేదు కాని, ఇది కచ్చితంగా అసాధారణమైన సందర్భమే. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి సర్వోన్నతాధికారి. అలాగే (బిల్లులకు) ఆమోదం తెలియచేయడానికి, నిరాకరించడానికి లేదా జాప్యం చేయడానికి రాష్ట్రపతికి పూర్తి అధికారాలు ఉన్నాయి. రాష్ట్రపతి దగ్గరకు వెళ్లిన కొన్ని బిల్లులు 15 సంవత్సరాల పాటు ఆమోదం పొందకుండా ఉండిపోయాయి. కాబట్టి సుప్రీంకోర్టు దీని మీద ఏం చెబుతుందో మనం వేచి చూడాలి. నాకు తెలిసినంతవరకు ఎన్నికలు జరగబోతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి ఒక వ్యాజ్యం వేయడం వెనుక రాజకీయ కారణాలే ప్రధానంగా ఉంటాయి' అన్నారాయన. ఇదే సమయంలో 'మనమంతా సమాఖ్య విధానానికి బద్ధులమే. ఏ రాష్ట్రం మీదనైనా కేంద్రం తన అధికారాన్ని రుద్దడానికి మనం వ్యతిరేకమే'నని భాగస్వామికి కోపం రాకుండా జాగ్రత్త పడ్డారు శశి థరూర్.

ప్రభుత్వ అధికారుల ఆదేశాలు అనర్హమైనవిగా ప్రకటిస్తూ లోకాయుక్త వెలువరించిన నిర్ణయాలను సమీక్షించే అధికారం తమకు ఉండాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ బిల్లుకు ఈ ఫిబ్రవరిలోనే రాష్ట్రపతి ఆమోదం తెలియచేశారు. అంటే ఆ రాష్ట్ర గవర్నర్ పంపించిన ప్రతి బిల్లును రాష్ట్రపతి తొక్కి పెట్టి ఉంచారని అనలేం.

సీపీఎం, డీఎంకే ప్రభుత్వాలు నడిపిస్తున్న కేరళ, తమిళనాడు ప్రభుత్వాల వైఖరిలో రోజురోజుకూ కేంద్ర వ్యతిరేకత బలపడుతున్న దాఖలాలే ఎక్కువ. ఈ రెండు ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా కాకుండా, వాటిని ఏర్పాటు చేసిన రాజకీయ పక్షాల కోసమే నడుస్తున్నాయి. ఆ రెండు పార్టీలూ వ్యక్తుల కనుసన్నలలో నడిచేవే. బంగారం దిగుమతి వ్యవహారంలో కేరళ ముఖ్యమంత్రి ప్రమేయం ప్రత్యక్షంగా లేకపోతే పరోక్షంగానే అయినా ఉన్నమాట నిజమేనని వార్తలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వ్యవహారంలో సీపీఎం జోక్యం కూడా అలాంటిదే. వాటిని తమవారితో నింపేసి, సీపీఎం అనుబంధ ఎస్ఎఫ్ఐ అడ్డాలుగా మార్చాలన్న కోరికతో సీపీఎం తహతహ లాడిపోతోంది. గవర్నర్‌తో వివాదమంతా ఇదే. కేరళ విశ్వవిద్యాలయాల వీసీల వ్యవహారం, నియామకాల తీరు పూర్తిగా అసంబద్ధం. వాటినే గవర్నర్ వ్యతిరేకించి, నిలిపివేశారు. ఆ పనే రాష్ట్రపతి కూడా చేశారు. ఆ అక్రమ వ్యవహారాలకే అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వారిచేత, అత్యుతన్నత న్యాయస్థానం ద్వారా ఒత్తిడి తెచ్చి ఆమోదింప చేయాలన్నదే సీపీఎం ప్రభుత్వం దురాశ. దేశ అత్యున్నత వ్యవస్థలను ఇలా ఉపయోగించుకోవాలని చూస్తున్న సీపీఎం తెంపరి వ్యవస్థకు అత్యున్నత న్యాయస్థానం నుంచి చెంపదెబ్బ తప్పదనే అనిపిస్తున్నది. ★

01 ఏప్రిల్ 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**అలంకారం**

– దర్భా లక్ష్మీ అన్నపూర్ణ





బీఆర్ఎస్ మెడకు ట్యాపింగ్ ఉచ్చు (తెలంగాణ) – 14
డ్రగ్స్‌కు అడ్డా విశాఖ... (ఆంధ్రప్రదేశ్) – 16
గొంగడి మారకున్నా గోత్రాలు మారాయి కదా? (చర్చ) – 24
నిత్యసేవల సత్యవాణి (మహిళ) – 26
ఉచితాలే ఓట్లు రాల్చే తాయిలాలు (మ్యానిఫెస్టో) – 28
రాజకీయ చదరంగంలో ఎత్తులకు పైఎత్తులు (వ్యూహం) – 36
దేశవాళీ క్రికెట్లో ముంబై 'ఘరానా'...! (క్రీడ) – 43
సినిమాల రీ-రిలీజ్ వరమా!? శాపమా!? (సినిమా) – 50

జనవరి 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రపంచం మొత్తం పండుగలా జరుపుకుంది. కానీ భారతదేశంలో అదే రోజు తలపెట్టిన రామ శోభాయాత్రల మీద, ఇతర ఉత్సవాల మీద 15 చోట్ల దాడులు జరిగాయి. అందులో ముంబై నగరంలోని మీరా రోడ్ ఘటనను మరీ తీవ్రంగా పరిగణించవలసినది. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, కర్ణాటక, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లలో ఈ దారుణాలు జరిగాయి. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రావలసిందని కోరితే 'సగౌరవంగా' తిరస్కరించింది కాంగ్రెస్. జైశ్రీరామ్ నినాదం కడుపు నింపుతుందా? 24 గంటలు 'భారతమాతా! భారతమాతా!' అవే నినాదాలేమిటి? అంటాడు రాహుల్ గాంధీ. మోదీ, యోగీ పాలనల తరువాత అయోధ్య మళ్లీ మాదే అంటారు కొందరు ముస్లిం మతోన్మాదులు. మార్చి 17న ముంబై శివాజీ పార్క్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఆ పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీ అన్నమాటను ఇక్కడ ఒకసారి గుర్తు చేసుకోవాలి. 'హిందూయిజంలో ఒక మాట ఉంది, శక్తి అని. మనం ఆ శక్తికి వ్యతిరేకంగా పోరాడతాం. మోదీ మీద పోరాటం అంటే అది వ్యక్తిగతం కాదు. ఆయన ఒక శక్తి కోసం పనిచేస్తారు. ఆ శక్తికి మోదీ ఒక ముసుగు.' అని ప్రకటించారు రాహుల్. కాంగ్రెస్ నేత చేసిన ఈ వ్యాఖ్యలనే ప్రధాని మోదీ తెలంగాణలోని జగిత్యాల సభలో దుయ్యబట్టారు.

నిరుడు సెప్టెంబర్‌లో డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ హిందూ ధర్మాన్ని డెంగ్యూతో పోల్చాడు. దానిని నిర్మూలించడమే పరిష్కారం అన్నాడు. ఈ మార్చి ఆరంభంలో అదే పార్టీ నాయకుడు ఎ. రాజా భారత్ ఒక దేశమే కాదన్నాడు. రాముడు మాకు శత్రువు అన్నాడు. శ్రీరాముడినే కాదు, భారతమాతాకీ జై వంటి నినాదాలని తమిళనాడు ఏనాడూ అంగీకరించదని అన్నాడు.

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ అనే ప్రదేశంలో దళిత వర్గాలకు (అంతా హిందువులు) చెందిన అనేక మంది మహిళలను షేక్ షాజహాన్

# సంఘ



అనేవాడు చెరబడితే ఈ దేశంలో ఒక్క మానవ హక్కుల సంఘం నోరెత్తలేదు. ఒక్క హక్కుల కార్యకర్త అక్కడికి వెళ్లలేదు. అలాంటి నీచుడిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శాసనసభ సాక్షిగా వెనకేసుకొచ్చారు.

'370 అధికరణాన్ని రద్దు చేసినా మౌనండి ఉన్న నాయకులు సెక్యులరిస్టులు ఎందుకవుతారు?'– అసదుద్దీన్ ఒవైసీ. సెక్యులరిజం అంటే ముస్లిం భారత్‌ను తయారు చేయడమేనని ఒవైసీ సోదరుల నిశ్చితాభిప్రాయం. ఆ అధికరణం ఉన్నంతకాలం కశ్మీర్‌లో ఏం జరిగిందో తెలుసు. దానిని అడ్డం పెట్టుకుని అడ్డంగా బలిసిన ముస్లిం ఛాందసవాదం, ఉగ్రవాదం కశ్మీరీ పండిత్‌లను అక్కడ నుంచి ఏ ఉద్దేశంతో తరిమివేశాయో, ఆ సందర్భంలో ఎలాంటి నినాదాలు ఇచ్చాయో, అక్కడి గోడల నిండా ఏం రాశాయో తెలుసు.

కర్ణాటకలో తాము అధికారంలోకి వస్తే అంతకు ముందు ఉన్న బీజేపీ ప్రవేశపెట్టిన మతాంతరీకరణ నిరోధక చట్టాన్ని రద్దు చేస్తామని చెప్పింది కాంగ్రెస్. హిజాబ్ మళ్లీ తెస్తామన్నారు. యథేచ్ఛగా గోవధ చేసుకోనిస్తామని అన్నారు. వాళ్ల దృష్టిలో ఇవన్నీ సెక్యులరిజానికి గీటురాళ్లు. కోటి రూపాయల ఆదాయం దాటిన హిందూ దేవాలయాల మీద పన్ను విధించడానికి బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును శాసనమండలి నిరాకరించింది. ఇలాంటి పన్ను ఇతర మతాల ప్రార్థనామందిరాల మీద కూడా విధించ గలరా? అంటూ ఆ రాష్ట్ర గవర్నర్ కూడా నిలదీశారు. భంగపడినా మళ్లీ తీసుకువస్తామని శపథం చేసింది కన్నడ కాంగ్రెస్. బెంగళూరు మహానగరంలో, ఐటీ హబ్‌లో అజాన్ సమయంలో తన దుకాణంలో హనుమాన్ చాలీసా వింటున్నందుకు ముస్లిం గూండాలు వచ్చి హిందూ యువకుడి మీద దాడి చేశారు. ఆంజనేయస్వామి బొమ్మతో ఉన్న జెండాను ఎగరవేస్తే పోలీసులు వచ్చి దింపేశారు.

# శక్తిః కలౌయుగే



అలనాటి బీజేపీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ వ్యాఖ్యలతో ఉన్న ఒక మెసేజ్‌ను సామాజిక మాధ్య మాలలో మరొకరికి పంపినందుకు ఉదయ్‌పూర్‌లో ఇద్దరు ముస్లిం మతోన్మాదులు ఒక దర్జీ గొంతు కోశారు.

గోధ్రా అల్లర్ల గురించి ప్రపంచమంతా చాటి వచ్చే వాళ్లు, అసలు రగడకు దారి తీసిన కారణాలను మాత్రం దాచి పెడుతున్నారు. అయోధ్య నుంచి వస్తున్న కరసేవకులను గోధ్రా వద్ద సజీవ దహనం చేశారు. తరువాత మాత్రమే బాధితుల తరపు సమాజం భగ్గుమంది.

ఇలా చెప్పుకుంటూ వెళితే కొల్లేరు చాంతాడు కూడా నివ్వెరపోతుంది. అక్షరాలా వందల దుర్ఘట నలు జరిగాయి. ఆ ఘటనలన్నీ మైనారిటీలుగా హోదాను అనుభవిస్తున్న మతాలలో కొందరు హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మాత్రమే పరిగణిస్తున్నారు. తాము ఏం వ్యాఖ్యానించినా ప్రశ్నించే పని పెట్టుకోవద్దని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ధోరణి ప్రబలడానికి కారణం– సెక్యులరిజం పేరుతో సాగుతున్న ఒక విధ్వంసం. మైనారిటీ ప్రజల మతోన్మాదం కంటే మెజారిటీ మతాల మతోన్మాదం ప్రమాదం అనే అత్యంత నీచమైన వాదన. సెక్యులరిజం అంటే కాంగ్రెస్, కమ్యూనిస్టులు, చాలా ప్రాంతీయ పార్టీలకు ఓట్లు తెచ్చిపెట్టే సూత్రం. అధికారం అప్పగించే మార్గం. కానీ సెక్యులరిజం, అది తెచ్చిపెడుతున్న పరిణామాలు భారతదేశాన్ని ఒక ప్రమాదపు అంచుకు నెడుతున్నాయన్నది పచ్చి నిజం. అందుకే హిందువును మేల్కొల్పక తప్పలేదు. ఇప్పుడు మేల్కొనవలసిన అవసరం నుంచి హిందు వులు తప్పించుకోవడం సాధ్యం కాదని చెప్పినా తప్పుకాదు. హిందూ సమాజంలో వస్తున్న ఈ మార్పు భారత రాజకీయాలను నిర్దేశించడం అనివార్యమే.

ఆగస్ట్ 15, 1947న మత ప్రాదికన భారత్ రెండు ముక్కలయింది. చరిత్ర గమనంలో హిందూ సమాజం ఎదుర్కొన్న నష్టాలకు అది పరాకాష్ట. మత ప్రమేయంలేని, హిందూ ఆధిక్యం ఉన్న భారతదేశం లోనే కాదు, ముస్లిం రిపబ్లిక్‌గా ప్రకటించుకున్న పాకిస్తాన్‌లో (తరువాత బంగ్లాదేశ్‌లో కూడా అదే పరిస్థితి) కూడా హిందువులే నష్టపోవడం, వంచనకు గురికావడం ఒక వైచిత్రి. ఇలా చరిత్ర శాపగ్రస్థులుగా మిగిలిపోయిన బయటి హిందువులకు న్యాయం చేయాలన్న చిన్న ప్రయత్నానికి కూడా ఇవాళ్టి

# హిందూ వ్యతిరేకతే

చరిత్రలో హిందువులు ఎన్ని దారుణమైన పరిణామాలు చూశారో, ఎన్ని చేదు జ్ఞాపకాలు మింగారో మన చరిత్రకారులు కాకపోయినా, విల్ డ్యూరాంట్ వంటి పాశ్చాత్య చరిత్రకారులు చక్కగా చెప్పారు. ఆ ఘర్షణలలో హిందూ సమాజం కునారిల్లి పోయింది. కానీ ఇక్కడి చరిత్రకారులు మాత్రం ఆ ఘర్షణను, హిందూ సమాజం పడిన అవమానాలను చరిత్రపుటలలో చేర్చడానికి నిరాకరించారు. అందుకు వారు చెబుతున్న కారణం, ఆ ఘర్షణలను, రక్త పాతాన్ని విద్యార్థులకు వెల్లడిస్తే మత సామరస్యం దెబ్బతింటుందట. అంటే హిందు వుల అవమానాలు, దురాక్రమణదారులను ఎదిరించిన భారతీయుల సాహసాలు అన్నీ మరుగున ఉండిపోవాలి. చరిత్ర అంతా హిందువులు, ముస్లింలు సయోధ్యతోనే ఉన్నారని బొంకాలి. వాస్తవ చరిత్ర అదే అయితే అదే రాయవచ్చు. కానీ కాదు. అయోధ్య, కాశీ, మధురలలో బయటపడిన శిథిలాలు అందుకు సాక్ష్యం చెబుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ప్రథమ ప్రధాని, విద్యామంత్రి వంటి వారు హిందువులు అణగిమణిగి ఉండవలసిన వర్గంగానే పరిగణించారు. హిందూ జీవన విధానం పలచబడి పోవాలన్న ప్రయత్నమే ఎక్కువగా కనిపిస్తుంది.

భారతదేశంలో తమిళ ప్రాంతానికి లేదా మద్రాసు ప్రెసిడెన్సీకి ఎంతో ప్రత్యేకత ఉంది. కానీ అక్కడ స్వాతంత్ర్యానికి ముందు జస్టిస్ పార్టీ పేరుతో సాగిన వేర్పాటుధోరణులు స్వతంత్ర భారతదేశంలో కూడా కొనసాగాయి. అవే ద్రవిడ రాజకీయాలు. రాముడి విగ్రహంతో సాగుతున్న ఊరేగింపుల మీద చెప్పులు విసిరిన ఘనత అక్కడి ద్రవిడ ఉద్యమానిది. దాని అధినాయకుడు రామస్వామి నాయకర్ వ్యాఖ్యలు, విధానాలు వికారం కలిగిస్తాయి. ఇప్పటికీ ఆ నీచత్వాన్ని తలకెత్తుకు మోస్తున్నది డీఎంకే. రామస్వామినాయకర్ ఆనాడు చేసిన వేర్పాటువాద రాజకీయాలను కూడా డీఎంకే సాగదీయాలని చూస్తున్నది. రాముడు దక్షిణ భారతానికి చెందినవాడు కాదు అనడం, హిందీ వ్యతిరేకత, ఆఖరికి 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలని అంశాలు అన్నీ కూడా దేశ వ్యతిరేకతను ప్రబోధించేవే. అసలు సనాతన ధర్మాన్ని దేశం నుంచి నిర్మూలించడమే తక్షణ కర్తవ్యమని ఆ పార్టీ ఇటీవలయ పిలుపునిచ్చింది.

ఆర్యులు, ద్రావిడులు అన్న శుష్క సిద్ధాంతాన్ని అడ్డం పెట్టుకుని భారతదేశాన్ని మరొక విభజనకు గురి చేయాలని (ఉత్తర భారతం, దక్షిణ భారతం) కూడా కుట్రలు సాగాయి. తెల్లగా ఉండేవారంతా ఆర్యులట. నల్లగా ఉన్నవారంతా ద్రావిడులట. ఆర్యులు ఇక్కడికి వచ్చి మూలవాసులను తరిమివేశారట.

సోమనాథ్ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆ ఆలయం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ హాజరు కాదలిచారు. ఆయన వెళ్లకుండా అడ్డుకోవడానికి నెహ్రూ చేయని ప్రయత్నం లేదు. అయినా రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ విభేదాలు ఆ పెద్దలిద్దరి మధ్య చిరకాలం కొనసాగాయి.


సోమనాథ్ ఆలయం


సావర్కర్

‘హిందుత్వ’ పేరుతో ఒక పుస్తకం రాసినందుకు, హిందూ మహాసభకు నాయకత్వం వహించినందుకు వినాయక్ దామోదర్ సావర్కర్‌ను ఈనాటికీ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఉదారవాదులు పరమ నీచంగా చిత్రిస్తూ ఉంటారు. ఆ పేరుతో సావర్కర్ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన నిరుపమాన త్యాగాలను మరుగుపరిచే యత్నం చేస్తున్నారు. మణిశంకర్ అయ్యర్ అనే రాజకీయ దళారి కూడా సావర్కర్‌ను విమర్శించడమే ఈ దేశంలో వింత. కానీ గతంలో ఆ పార్టీ నాయకురాలు ఇందిరాగాంధీ సావర్కర్ త్యాగాన్ని శ్లాఘించి, నాణెం విడుదల చేశారు. అయినా ఇప్పుడు ఆయనను దూషిస్తే సెక్యులర్ వీరతాళ్లు దండిగా పడతాయి కాబట్టి పరమ నీచంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నిందలు వేస్తుంటారు. ఇందులో అగ్రతాంబూలం రాహుల్ గాంధీదే కూడా.

గాంధీజీ హత్యలో సావర్కర్‌ను ఇరికించడం,

భారతదేశంలో ప్రతికూలత ఎదురవుతున్నది. పౌరసత్వ సవరణ చట్టం పూర్వాపరాలు అందుకు సంబంధించినవే. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్‌లలో మత వివక్షను ఎదుర్కొంటున్న పిడికెడు హిందువులకు, మరొక ఐదు మైనారిటీ మతాల వారికి ప్రస్తుత భారత ప్రభుత్వం ఆశ్రయం ఇవ్వదలిచింది. ఈ ఆలోచన ఈ ఒక్క ప్రభుత్వానిది కూడా కాదు. గాంధీజీ, నెహ్రూల కాలం నుంచి ఉంది.

అయోధ్య, రాముడు పుట్టిన పుణ్యక్షేత్రమని హిందువుల ప్రగాఢ విశ్వాసం. మధుర కృష్ణ భగవానుడు నడయాడిన స్థలం. కాశీ పరమ పవిత్రస్థలం. ఈ మూడు ముస్లింలు వదులుకుని సహృదయత చాటుకోవాలని కోరింది హిందూ సమాజం. కానీ ముస్లిం సమాజం అందుకు సిద్ధపడడం లేదు. నిజానికి ఆ వర్గాన్ని హిందూ సమాజానికి వ్యతిరేకంగా నిలిపి ఉంచుతున్నది సెక్యులరిస్టులు, ఉదారవాదులే. అయోధ్య వివాదం మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పు ఈ విషయాన్ని ప్రతిబింబిస్తుంది కూడా. చరిత్రకారులు చేసిన దగాను కూడా ఆ తీర్పులో అత్యున్నత న్యాయస్థానం అభిశంసించింది. అయోధ్య, మధుర, కాశీ, భోజశాల– వరసగా హిందూ ఆనవాళ్లతో బయటపడుతున్నాయి. అయినా ప్రతి మసీదులో శివలింగాలను వెదికే ప్రయత్నం వద్దని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ పెద్ద మనసుతో ప్రకటించారు. దీనికి కూడా ముస్లిం సమాజం నుంచి సరైన స్పందన రాలేదు. ఇదే క్రమంలో మరొక వాదన కూడా ఇటీవల బలపడుతున్నది. ముస్లిం దురాక్రమణదారులు ఈ దేశంలో దాదాపు ముప్పయ్ నుంచి నలభయ్ వేల ఆలయాలను ధ్వంసం చేశారు, మసీదులుగా మార్చారు, వాటన్నిటినీ న్యాయపోరాటంతో తిరిగి తీసుకోవాలి అన్న నినాదంతో ఒక వర్గం ఇప్పుడు బలపడుతున్నది. ఇదంతా గడచిన నాలుగు దశాబ్దాలుగా భారతీయ సమాజం చూస్తున్న పరిణామం. ఈ పరిణామంతోనే భారత రాజకీయాలు కనీవినీ ఎరుగని ఒక పెద్ద మలుపు దగ్గరకు చేరాయి. 2014, 2019 లోక్‌సభ ఎన్నికలు ఆ విషయాన్ని రుజువు చేస్తాయి. దేశ రాజకీయ దృక్పథంలో, దృశ్యంలో ఒక విభజన రేఖ అవతరించింది. ఎప్పుడో హిందూ మహాసభ, భారతీయ జనసంఘ్ కాలం నాటి 'హిందూత్వ' రాజకీయాలు అనే భావన తెరపైకి వచ్చి నిలిచింది. స్థూలంగా

# ధ్యేయంగా...

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించడం రెండూ కూడా హిందూత్వ కోణం నుంచి చూడవలసినవే. తరువాత ఆర్‌ఎస్‌ఎస్‌ను రెండుసార్లు నిషేధించారు.

అయ్యప్ప దేవాలయంలోకి మహిళలను అనుమతించాలంటూ కొందరు మహిళలు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఇది పూర్తిగా హిందువుల మనోభావాలకు సంబంధించిన అంశమే అయినా న్యాయస్థానం వారికి అనుకూలంగా తీర్పును ఇచ్చింది. దీనిని అడ్డుకోవాలని మహిళలు తీవ్ర ప్రయత్నం చేశారు. కేరళ సీపీఎం ప్రభుత్వ పోలీసుల చేతిలో దారుణ హింసకు గురయ్యారు. ఇంతకీ అయ్యప్ప ఆలయంలోకి వెళ్లడానికి స్త్రీలను అనుమతించాలని కోరుతూ కోర్టుకు వెళ్లిన మహిళలెవ్వరూ ఆ దేవాలయం ప్రత్యేకత గురించి, అక్కడి సంప్రదాయాల గురించి తెలిసినవారే కాదు. హిందూ ధర్మం మీద కక్ష కట్టిన ఎన్‌జీవోల తరఫున పనిచేసే వారు మాత్రమే. వీరినే ఆనాడు చాలామంది ఒక ప్రశ్న అడిగారు. హిందూ ధర్మంలో మహిళలకు ప్రవేశంలేని ఆలయాలు ఒకటి రెండు మాత్రమే. కానీ అసలు ఈ భూమి మీద ఉన్న ఏ మసీదులోను స్త్రీలకు ప్రార్థన అవకాశం లేదు. వేరే స్త్రీలు కాదు, ఆ మతంలోని స్త్రీలకే ప్రవేశం లేదు. ఆ విషయం గురించి మీకెందుకు పట్టదు? దీనికి ఇప్పటికీ సమాధానం లేదు. అయ్యప్ప ఆలయంలోకి మహిళలను అనుమతించాలని పట్టుపట్టిన మహిళామణులు జ్ఞానవాపి కట్టడంలో శృంగార గౌరి పూజల కోసం కొందరు మహిళలే కోర్టుకు వెళితే మాత్రం వారికి మద్దతుగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు.



కర్ణాటక ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం మైసూరు నవాబు టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలు ఆరంభించింది. టిప్పు చరిత్ర మతవివక్షతో మలినమైనది. అతడు మేల్కొటే అనే గ్రామంలో ప్రవేశించే ఒకే రోజున వేలాది మంది శ్రీవైష్ణవులను హత్య చేశాడు. కానీ ఒక మొండి పట్టుదలతో కాంగ్రెస్ ప్రభుత్వం అతడి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నది.

హిందూ దేవీదేవతల మీద అవాకులు చెవాకులు పేలేవాళ్ల సంఖ్య తక్కువేమీ కాదు. ఇందుకు తాజా ఉదాహరణ ఒక ప్రొఫెసర్ సీతమ్మను రాముడు విఫణిలో పెట్టి అమ్మేశాడని సోషల్ మీడియా పోస్టులో పెట్టాడు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరిగిన తరువాత, దేశమంతటా ఒక చైతన్యం వెల్లివిరిసిన తరువాత పుణేలో ప్రదర్శించిన ఒక నాటికలో సీతమ్మ చేత పొగతాగించారు. ఎంఎఫ్ హుసేన్ చిత్రకారుడు తన కారు మీద సరస్వతి అమ్మ వారి బొమ్మను నగ్నంగా చిత్రించాడు. స్వామిప్రసాద్ మౌర్య అనే ఉత్తరప్రదేశ్ రాజకీయ నాయకుడు రామచరిత్ మానస్‌ను దగ్ధం చేయించాడు. అందులో వివక్షను ప్రేరేపించే అంశాలు ఉన్నాయని ఆ మూర్ఖుడి వాదన. ఇక


టిప్పు సుల్తాన్

భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో హిందూ దేవుళ్ల మీద, పండుగల మీద, జీవన విధానం మీద ఎన్ని వేల కథలు, కార్టూన్లు, రచనలు, సినిమాలు వచ్చి ఉంటాయో చెప్పడం కూడా కష్టం. కానీ వాస్తవంగా హిందువులు బాధితులుగా ఉన్న కశ్మీర్ లోయ ఘోరాలు, కేరళ హిందూ యువతుల అపహరణాలు, నిజాం రాజ్యంలో రజాకార్ అరాచకాలు ఇతివృత్తాలుగా చలనచిత్రాలుగా వస్తే ఉదారవాదులు విపరీతంగా బురద చిమ్ముతారు. అయోధ్యలో వివాదాస్పద కట్టడం కూలిన తరువాత బంగ్లాదేశ్‌లో అనేకమంది హిందువులను ఊచకోత కోశారు. ఆ అంశాలే ఇతివృత్తంగా తస్లిమా నస్రీన్ 'లజ్జ' పేరుతో నవల రాశారు. దీనితో ఆమె భారతదేశానికి వచ్చి తలదాచుకోవలసి వచ్చింది. తస్లిమాకు మద్దతుగా ఒక్క మహిళా సంఘం, హక్కుల సంఘం కూడా ప్రకటన చేయలేదు. వీటిని సాధారణంగా కమ్యూనిస్టులే దొంగపేర్లతో నడుపుతూ ఉంటారు.

కొందరు క్రైస్తవ మిషనరీలు, ముస్లిం మతోన్మాదులు కూడా ప్రత్యేక దేశం నినాదాలు చేస్తున్నారు. మరొక పాకిస్తాన్ కావాలని వాళ్లు, పాకిస్తాన్ ఇచ్చినట్టే మాకూ ఒక స్వతంత్ర రాజ్యం కావాలని వీళ్లు నినాదాలు చేస్తూ ఉంటారు. ★





చెప్పాలంటే ఒక వైపు హిందుత్వ రాజకీయాలు, మరొకవైపు హిందూయేతర రాజకీయాలు. 'హిందుత్వ రాజకీయాలు' అన్న పేరును నిజానికి హిందుత్వ రాజకీయ శిబిరం ప్రకటించుకోలేదు. ఈ పేరును ప్రాచుర్యంలోకి తెచ్చినది హిందూయేతర రాజకీయ శిబిరమే. అయినా హిందుత్వ రాజకీయాల పేరుతో ఇవాళ కనీవినీ ఎరుగని రీతిలో దాడి జరుగుతున్నది. హిందూ వ్యతిరేక విమర్శ ఇంత తీవ్రస్థాయిలో మున్నెన్నడూ లేదు. అయితే ఒకటి నిజం, హిందూ శిబిరం ధ్యేయం హిందూ సమాజం హక్కులు, వారి ఆత్మగౌరవం. హిందూయేతర రాజకీయ శిబిరానికి ఆయువుపట్టు మాత్రం ఓటు బ్యాంక్ రాజకీయాలే. ఇక్కడ చాలామంది మేధావులు, ఒక వర్గం మీడియా, ఉదారవాదులు, సెక్యులరిస్టులు కలసికట్టుగా విస్మరిస్తున్న అంశం– ఆరు దశాబ్దాలుగా హిందూ వ్యతిరేక శిబిరం లేదా ముస్లిం ఓటు బ్యాంకు స్పష్టంగా అవతరించినప్పుడు, దాని ఫలితాలు సుస్పష్టంగా కనిపిస్తున్నప్పుడు హిందూ సమాజం ఎంతకాలం మౌనంగా ఉండగలదు? ఒక ఓటు బ్యాంకుగా అవతరించకుండా మౌన ప్రేక్షకపాత్రకు అది పరిమితం కావాలని ఎవరైనా ఎలా అనుకో గలరు? నిజానికి దీనిని హిందూ ఓటు బ్యాంక్ అనడం కంటే భారతీయ ఓటు బ్యాంక్ అనాలి. అంటే భారతీయతకు సానుకూలమైన ఓటు. ఇలాంటి ఓటర్లలో హిందువులు కూడా భాగం. ఈనాడు భారతీయతను గౌరవిస్తున్న హిందూయేతరులు దేశంలో పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

సెక్యులరిజం చాటున భారత సార్వభౌమాధికారానికి జరుగుతున్న చేటు, నిజానికి వెన్నుపోటు హిందూయేతర రాజకీయ శిబిరం వైఖరి పుణ్యమే. ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్న బీజేపీ హిందువుల పార్టీ అని ఈ శిబిరం విమర్శిస్తూ ఉంటుంది. బీజేపీ నిజంగా హిందువుల పార్టీయే అయితే ఎన్నికలలో ఓడించి సెక్యులర్ ప్రభుత్వం స్థాపించవచ్చు కదా! అది జరగడం లేదు. తాము సెక్యులరిస్టులమనీ, సమన్యాయం, పురోభివృద్ధి ధ్యేయంగా ఉన్నవారమనీ



ఈ శిబిరం చెప్పుకుంటూ ఉంటుంది. ఇది వాగాడంబరమని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు చూపించవచ్చు. భారత పార్లమెంటు మీద దాడి చేసిన వారిని, భారత ఆర్థిక రాజధానిలో రక్తపాతం సృష్టించిన వారిని జేఎన్‌యు వంటి విశ్వవిద్యాలయాలలో ఆకాశానికి ఎత్తుతూ ఉంటే సెక్యులరిస్టులు ఎందుకు మౌనం దాలుస్తారో అర్థం కాదు. జేఎన్‌యు భారత వ్యతిరేకతను ఖండించినా అది బీజేపీకి లబ్ధి చేకూరుస్తుందని ఈ దేశంలో సెక్యులరిస్టులు నమ్ముతున్నట్టు కనిపిస్తుంది. భారత్‌ను ముక్కలు ముక్కలు చేస్తామని అక్కడ విద్యార్థులు, పరిశోధకుల పేరిట చలామణి అవుతున్న మతోన్మాదులు, ఉగ్రవాదుల మాటలను సెక్యులరిస్టులు ఏనాడూ ఖండించలేదు. పేదరికం కారణంగా ఇస్లాం ఫండమెంటలిజం విస్తరించిందని మొదట వీరు వాదించారు. అది శుద్ధ తప్పని తేలింది. అలీగడ్ ముస్లిం విశ్వవిద్యాలయం నుంచి, జామియా మిలియా నుంచి పరిశోధక విద్యార్థులు కశ్మీర్ ఉగ్రవాదంలోకి దిగారు. దీనితో మాట మారింది. మొత్తం ముస్లిం సమాజాన్ని అవమానించడం సరికాదన్న నినాదం పట్టుకొచ్చారు. పుల్వామాలో ఉగ్రవాదులు దాడి చేస్తే మొత్తం పాకిస్తాన్‌ను నిందించడమేమిటన్న వాదన ఇలాంటిదే. కానీ 'హిందూ ఉగ్రవాదం' అంటూ కాంగ్రెస్ ఒక మాటను తీసుకువచ్చింది. మతమంటే ఏనాడూ తీవ్రంగా పరిగణించని మెజారిటీ సమాజాన్ని అలా అవమానించడం ఈ శిబిరం చేస్తున్న పెద్ద తప్పిదం. ఇవాళ భారతీయ జనతా పార్టీ మీద అక్కసుతో, భారతీయతను, భారతీయులను కూడా ఆ శిబిరం విమర్శించడం సర్వసాధారణంగా మారిపోయింది. భారతీయ జనతా పార్టీని రాజకీయంగా విమర్శించే హక్కు ఆ శిబిరానికి ఉంది. బీజేపీ ప్రభుత్వ విధానాలను ఖండించే హక్కు కూడా ఉంది. కానీ బీజేపీని లక్ష్యంగా చేసుకుని ఆ పేరుతో భారతీయతను విమర్శించే అధికారం లేదు. ఇలాంటి ధోరణిలోని అనౌచిత్యాన్ని గుర్తించడం మొదలు కావడంతోనే హిందూ రాజకీయ ఐక్యతకు, తదనుగుణంగా హిందూ ఓటు బ్యాంకు రాజకీయాలకు సోపానాలు పడినాయని గుర్తించవలసి ఉంటుంది. హిందూయిజంలోని శక్తిని మేం ఎదుర్కొంటామని రాహుల్ అనడం వెనుక, అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కాబోమని చెప్పడం వెనుక, హిందూ దేవాలయాల మీద పన్ను విధించే ఆలోచన అయినా హిందూ వ్యతిరేకమే. 'ఎవరైనా కాంగ్రెస్ వాడు నీ దగ్గరకు వచ్చి వాళ్లకి ఓటు వేయమని అడిగితే ఒక్కటే విషయం అడుగు. రామమందిరం వివాదంలో వ్యతిరేకంగా వాదించడానికి 24 మంది న్యాయవాదులను ఎందుకు నియమించారు అని!' అంటారు ప్రముఖ బాలీవుడ్ నటుడు నానా పటేకర్. అవును, హిందూ సమాజం ఇప్పుడు ప్రశ్నిస్తున్నది. నిలదీస్తున్నది. నిజమే, ఆ అంశం గురించి ప్రశ్నించమని పటేకర్ కోరుతున్నారు. కానీ ఒక్క కాంగ్రెస్ నేతనే కాదు, ప్రతి సెక్యులర్ పార్టీ నేతకు ఆ ప్రశ్న వేయాలి. ఈ దేశంలో తమకూ హక్కులు ఉన్నాయని హిందువులు గుర్తించాలి. లేకపోతే సాధించేందుకు ఇకనైనా నడుం కట్టాలి. హిందువు లకు హక్కులు ఉన్నాయని, వాటిని కాపాడతామని ఎన్నికల బరిలోని అన్ని పార్టీల నాయకుల చేత ప్రతిజ్ఞ చేయించాలి.

ముస్లింలకు ప్రపంచంలో చాలా దేశాలు ఉన్నాయి. కొన్ని కొత్త దేశాలను కూడా వాళ్లు సృష్టించుకునే పనిలో ఉన్నారు. క్రైస్తవులకు కూడా ఎన్నో దేశాలు ఉన్నాయి. కానీ హిందువులకు మాత్రం భారతదేశం ఒక్కటే ఉంది. ఇది ఎప్పటికీ గుర్తుంచుకోవలసిన సత్యం. ప్రపంచంలోని ఏ హిందువుకైనా ఇదే జన్మభూమి. ఇక ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన వారి సంగతి సరేసరి. కాబట్టి భారతదేశాన్ని, భారతీయ భావనను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రధానంగా హిందువులు మీదే ఉన్నది. అందుకు వారు కలసికట్టుగా సాగాలి. అందుకు అవసరమైన రాజకీయ చింతనను అనుసరించాలి. శుష్క సిద్ధాంతాలనీ, ఇతర ప్రలోభాలనీ దూరంగా ఉంచాలి. సంఘే శక్తి కలౌయుగే (కలియుగంలో ఐక్యతను కలిగి ఉండడమే శక్తి). ★

## సెక్యులరిజం ఒక వేరుపురుగు


డేవిడ్ ఫ్రాలే

సెక్యులరిజం భారతీయ మూలాలను హరిస్తున్న వేరుపురుగు. ఇది భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుతుందన్న మాట పెద్ద భ్రమ. ఇక్కడ సెక్యులరిజం అంటే భారత వ్యతిరేకత. స్థూలంగా చెప్పాలంటే పచ్చి హిందూద్వేషానికి ఒక రాజకీయ ముసుగు. 1976లో రాజ్యాంగంలో చొరబడిన ఈ పదం 1947 నుంచే భారతీయ మూలాలను హరించడం మొదలు పెట్టింది. భారత్ సెక్యులర్ దేశమంటే డేవిడ్ ఫ్రాలే (అమెరికాకు చెందిన సంస్కృత పండితుడు, వాసుదేవశాస్త్రి అని పేరు మార్చుకున్నారు) అంగీకరించరు. ఇది హిందూ వ్యతిరేక దేశమనే ఆయన ఘంటాపథంగా అంటున్నారు. భారత్‌లో మెజారిటీ ప్రజలను దోపిడీ చేస్తున్న తీరులో ప్రపంచంలో మరెక్కడా మెజారిటీ ప్రజలు దోపిడీకి గురికావడం లేదని కూడా ఆయన రాస్తారు. 80 శాతానికి పైగా హిందువులు ఈ దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులనే చాలామంది అనుభవం. హిందువులకు కూడా హక్కులు ఉంటాయని గుర్తించాలని చాలామంది ఇవాళ కూడా చెబుతూ ఉంటారు.

ఇక్కడ సెక్యులరిజం అంటే హిందువుల హక్కులను నిరోధించడమే. వారి పండుగలను అడ్డుకోవడమే. వారి ఆచార వ్యవహారాలను అపహాస్యం చేయడమే. భారత్‌లో హిందూ దేవాలయాల మీద ప్రభుత్వ ఆధిపత్యం ఉంటుంది. కానీ మసీదుల కేసి, చర్చ్‌ల వైపు చూసే దమ్ము ధైర్యం వాటికి ఉండదు. చాలా చర్చ్‌ల భూములు లీజ్‌లోనివి. ఆ లీజ్ పూర్తయి దశాబ్దాలు గడుస్తున్నది. స్వాధీనం చేసుకునే ప్రయత్నమే లేదు. కానీ హిందూ దేవాలయాల మీద పన్నులు విధిస్తారు. వాటి భూములు వేలం వేయాలని కమ్యూనిస్టులు గొంతు చించుకుంటారు. దీపావళి జరుపుకుంటేనే ఇక్కడ వాయుకాలుష్యం, పర్యావరణ కాలుష్యం సంభవిస్తాయి. హోలీ రంగులు ప్రమాదకరం. కానీ ప్రతి జనవరి 1వ తేదీకి ప్రపంచమంతటా తగలబెట్టే బాణసంచా గురించి వీరెవరూ నోరెత్తరు. కొన్ని కొన్ని హిందూ ఆలయాల దగ్గర కనిపించే బలులు ఉదారవాదులకి అమానుషంగా కనిపిస్తాయి. ముస్లింల పండుగలలో తెగిపడే వేలాది జంతువుల తలలు వారికి కనిపించవు. కోర్టులు కూడా హిందువుల పండుగలంటే వెంటనే స్పందించి, కట్టడికి ఆదేశాలు ఇస్తాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వాల సంగతి చెప్పవలసిన అవసరమే ఉండదు. హిందువుల పండుగ, మైనారిటీల పండుగ ఒకే సమయంలో వస్తే హిందువుల పండుగల మీద నిషేధం విధించిన వాతావరణం ఇప్పుడు కూడా పశ్చిమ బెంగాల్‌లో ఉంది. కర్ణాటకలో దేవాలయాల పరిస్థితి ఘోరం. తమిళనాడులో హిందూ దేవాలయాల ముందే ఈవీ రామస్వామి నాయకర్ విగ్రహాలు ఉంటాయి. వాటికింద హిందూత్వాన్ని, ఆచారాలని కించపరిచే వ్యాఖ్యలు ఉంటాయి. దీనిని ప్రశ్నిస్తే హిందువులలో అసహనం పెరిగిపోయిందన్న ప్రచారం చేయడానికి ఒకవర్గం మీడియా సదా సిద్ధంగా ఉంటుంది. హిందూ అన్న పేరుతో ఉన్న పత్రికలు కూడా హేతుబద్ధం కాని విమర్శలను చేయడం రివాజుగా మారింది. ★




**నిజానికి, అరవింద్ కేజ్రీవాల్ ఎప్పటి నుంచో అదే కోరుకుంటున్నారు. అరెస్ట్ చేయండి .. అరెస్ట్ చేయండని... అడుగుతూనే ఉన్నారు. ఏకంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చునే ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, విచారణ సంస్థలను అదే డిమాండ్ చేశారు. డిమాండ్ చేయడమే కాదు సవాలు విసిరారు. అయినా, కేంద్ర ప్రభుత్వం సరే... విచారణ సంస్థలు కూడా తొందర పడలేదు. విచారణ క్రతువును శాస్త్రోక్తంగా కావించి, చివరికి ఆయన కోరిక తీర్చింది. ఈడీ ఆయన్ని అరెస్ట్ చేసింది. ఎందుకు, ఏమిటనేది, అందరికీ తెలిసిన విషయమే కాబట్టి ఆ వివరాలోకి వెళ్లడం లేదు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసుతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ 'అరవింద్ కేజ్రీవాల్'ను మార్చి 21న ఈడీ అరెస్ట్ చేసింది.**

కేజ్రీవాల్ అరెస్ట్'కు ముందు తర్వాత జరిగిన పరిణామాలను గమనిస్తే, ఢిల్లీ లిక్కర్ వ్యవహారం కేసును వర్తమాన చరిత్రలో ఒక రాజకీయ సంచలనంగా చెప్పుకోవచ్చు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం వెలుగు చూసినప్పటి నుంచి, ముఖ్యంగా ఈ కేసులో అరెస్టుల పర్వం మొదలైనప్పటి నుంచి, అరవింద్ కేజ్రీవాల్ ఈ కేసులో ఏదో ఒక రోజు, 'నేను సైతం' అరెస్ట్‌కాక తప్పదనే నిర్ణయానికి వచ్చారు. అందుకే, ముహూర్తం కంటే ముందు నుంచే, అదొక ఎత్తుగడగా అరెస్ట్ చేయండని అడుగుతూ వచ్చారు. అయితే అదే సమయంలో, అదే కేజ్రీవాల్,ఈడీ విచారణకు హాజరయ్యేందుకు మాత్రం ఎందుకో వెనకడుగు వేశారు. భయపడిపోయారు. విచారణను తప్పించుకునేందుకు చివరి క్షణం వరకు ప్రయత్నించారు. విచారణకు హాజరయ్యేది లేదని మొండికేశారు. మొరాయించారు. ఒకటికి తొమ్మిదిసార్లు ఈడీ సమన్లు జారీ చేసినా, విచారణకు హాజరు కాలేదు. ఏదో ఒక సాకున తప్పించుకున్నారు. చివరకు, ఢిల్లీ హైకోర్టు రక్షణ కోరారు. అరెస్ట్ చేయకుండా ఈడీని ఆదేశించాలని కోర్టును వేడుకున్నారు. అయితే, కోర్టు, అది కుదరదని తేల్చి చెప్పడంతో.. దారులన్నీ మూసుకు పోయి... గత్యంతరం లేని పరిస్థితిలో అరెస్ట్‌కు తలవంచారు. అలా, కేజ్రీవాల్ వల్లించే నీతుల వ్రతం చెడినా ఫలితం లేకుండా పోయింది. కాగల కార్యాన్ని గంధర్వులే కానిచ్చారు అన్నట్లు.. కేజ్రీవాల్ కోరికను ఈడీనే కానిచ్చింది.



**రాజనాల బాలకృష్ణ**
సీనియర్ జర్నలిస్ట్

**తొలి ముఖ్యమంత్రి**

అదే రోజు, కోర్టు క్లియరెన్సు ఇవ్వడంతో ఈడీ ముఖ్యమంత్రి అధికార నివాసం తలుపులు తట్టింది. అక్కడే, విచారించి, అరెస్ట్ చేసి, సగౌరవంగా వెంట పెట్టుకు పోయింది. నిజానికి పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదేమో, కానీ కేజ్రీవాల్ ఈడీ విచారణను తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, సమన్లను సవాలు చేయడం ద్వారా ఆయన మెడకు ఆయనే ఉచ్చు బిగించుకున్నారని, ఒకప్పటి సహచరులు అంటున్నారు. ఈడీ విచారణ పట్ల ప్రదర్శించిన సహాయ నిరాకరణ దృక్పథం ఆయన మెడకు తాడై చుట్టుకుందని, ఆ కారణంగా ఆయనకు బెయిల్ రాకపోవచ్చని అంటున్నారు. అలాగే, ఆయన ప్రవచించిన రాజకీయ నిజాయతీని ప్రజా కోర్టులో దోషిగా నిలబెట్టింది. అంతే కాకుండా, విచారణను తప్పించుకునేందుకు ఆయన ఎంచుకున్న మార్గం, అందుకు దారితీసిన పరిస్థితులు కేజ్రీవాల్ ఇమేజ్‌ని కూడా భయంకరంగా దెబ్బ తీశాయని అంటున్నారు.

అందుకే, అన్నాహజారే అంతటి పెద్దమనిషి, "అది (కేజ్రీవాల్ అరెస్ట్) ఆయన స్వయంకృతం' అని తేల్చి చెప్పారు. చేసుకున్న వారికి చేసుకున్నంత అని తేల్చేశారు. అంతే కాదు, అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఆందోళనను నిచ్చెనగా చేసుకుని, రాజకీయ అరంగేట్రం చేసిన కేజ్రీవాల్, చివరకు అవినీతికి కేరాఫ్ అడ్రెస్‌గా నిలిచిన మొన్నటి లాలూ, నిన్నటి హేమంత్ సోరెన్ కంటే ఇంకొక మెట్టు దిగజారారని , కేజ్రీవాల్ ఒకప్పటి అనుచరులు, సహచరులు అంటున్నారు. ఆవేదన వ్యక్త ం చేస్తున్నారు. ముఖ్యంగా, అరెస్ట్ అనివార్యమని తెలిసిన తర్వాత కూడా ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకపోవడం, ముఖ్యమంత్రిగా అరెస్ట్ కావడం, మరింత తలవంపులు తెచ్చి పెట్టిందని అంటున్నారు. ఆ విధంగా అవినీతి కేసులో అరెస్ట్ అయిన తొలి ముఖ్యమంత్రిగా చరిత్ర పుటల్లో చేరడం కేజ్రీవాల్‌కే కాదు, అన్నా హజారేకు, ఆయన సారథ్యంలో సాగిన అవినీతి వ్యతిరేక ఆందోళనకు కూడా అవమానం, తలవంపులు అంటున్నారు.

**విషాద కోణం**

ఢిల్లీ లిక్కర్ పాలసీ వ్యవహారంలో కేజ్రీవాల్ అరెస్ట్ కావడం, ఒకటైతే, ఆయన ఆత్మకథలో అసలైన విషాద కోణం మరొకటి ఉంది. అంతిమంగా ఈ కేసు ఏమవుతుంది?ఏ తీరం చేరుతుంది? అనే కోణంలో చాలా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. లోకసభ ఎన్నికల ముందు చోటు చేసుకున్న ఈ పరిణామం ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయంలోనూ ఇటు మీడియాలో అటు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవంక, అవినీతి వ్యతిరేక ఆందోళనకు 'ఐకాన్'గా కేజ్రీవాల్' అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం, అరెస్ట్ కావడం (కొందరు దీన్నే మహాపతనం అంటున్నారు) గురించి కూడా లోతైన చర్చలు, విశ్లేషణలు వినవస్తున్నాయి.

**కేజ్రీ కథలో.. అసలు విషాదం**

"ఒకప్పుడు అరవింద్ కేజ్రీవాల్ నోటి నుంచి వచ్చిన మాటల్లో వ్యక్తమైన ఆందోళనకు ఇప్పుడు ఆయనే సజీవ ప్రతిరూపంగా, నిలిచారు. ఒక విధంగా, శకునం చెప్పిన పిల్లి కుడితిలో పడింది అన్నట్లుగా, ఒకప్పుడు నీతిసూత్రాలు వల్లెవేసిన అరవింద్ కేజ్రీవాల్' పోయిపోయి అవినీతి ఊబిలో



# అసలు విషాదం !

కూరుకు పోయారు. ఆయనే అవినీతిని బయటపెట్టి అవినీతిపరుడని వర్ణించిన కూటమిలో చేరిపో యారు. జైలు పాలయ్యారు. ఇదే కేజ్రీ కథలో అసలు విషాదం"... అంటున్నారు ఒకప్పుడు కేజ్రీవాల్ వెంట నడిచిన, నడిపించిన సామాజిక రాజకీయ కార్యకర్తలు. అరవింద్ కేజ్రీవాల్,తమ రాజకీయ ఆకాంక్షలకు వేదికగా చేసుకున్న,'ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్' వేదిక నిర్మాత, గాంధేయవాది, సామాజిక కార్యకర్త అన్నా హాజారే మొదలు, కవి, ప్రవక్త, సామాజిక, రాజకీయ కార్యకర్త, విశ్లేషకులు కుమార విశ్వాస్, జర్నలిస్ట్ అశుతోష్ వరకు కేజ్రీవాల్ మాజీ సహచరులు అందరి నోట వినిపిస్తున్న మాట అదొక్కటే.

ఎవరు ఎన్ని మాటల్లో చెప్పినా, ఎవరు ఏ కోణంలో విశ్లేషించినా అరవింద్ కేజ్రీవాల్ తమ విశ్వాసాలకు వ్యతిరేకంగా రాజకీయ మార్గం ఎంచుకోవడంతోనే ఆయన నైతిక పతనం మొదలైంది. ఇక అక్కడి నుంచి జారుడుమెట్ల వెంట జారి.. జారి దిగజారి పోయారు. చివరకు, అవినీతి ఊబిలో కూరుకుపోయారనేదే అందరి మాటల సారాంశంగా వుంది. కేజ్రీవాల్ ఒక్కడి కారణంగా, అన్నా సారథ్యంలో నిర్మాణమైన ఒక మహోద్యమం నీరుకారి పోయింది. ఆ ఒక్కడి కారణంగా, ఉద్యోగాలువదులుకుని ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులు నిందలు మోయవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తమవుతోంది. అలాగే, ఇందిరా గాంధీ, 1975లో తమ ప్రధాని పదవిని కాపాడుకునేందుకు దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన నేపథ్యంలో సర్వోదయ నేత జయప్రకాష్ నారాయణ్ సారథ్యంలో నిర్మాణమైన సంపూర్ణ క్రాంతి ఉద్యమం, లాలుయాదవ్ వంటి కొద్దిమంది అవినీతి పోకడల కారణంగా నీరు కారిపోయిన విధంగా, అన్నాహాజారే నిర్మించిన అవినీతి వ్యతిరేక ఆందోళన కేజ్రీవాల్' కారణంగా నిర్వీర్యమై పోవడమే కాకుండా, తాజాపరిణామాలనేపథ్యంలో మరో ఉద్య మానికి అవకాశమే లేకుండా చేసిందని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.

**అప్పుడేమన్నారు..?**

2014కు ముందు సోనియా, మన్మోహన్, రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో, భూమ్యాకాశాలే హద్దుగా, రోజుకో స్కామ్, పూటకో అవినీతి వ్యవహారం వెలుగు చూస్తున్నరోజుల్లో, అన్నా హజారే, ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్' వేదికగా అవినీతి వ్యతిరేక దేశవ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుట్టారు.

ఈ అవినీతి వ్యతిరేక ఆందోళనలో అరవింద్ కేజ్రీవాల్ కీలకపాత్ర పోషించారు. ఆందోళనకు అన్నా ఆత్మ అయితే, అన్నా ఆత్మ, దేహం రెండూ తానే అన్నట్లుగా కేజ్రీవాల్ వ్యవహరించారు. ఇండియన్ రెవిన్యూ సర్వీస్‌లో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకుని, అన్నాతో చేతులు కలిపారు. ఆ విధంగా ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచారు. వందలు కాదు వేల సంఖ్యలో యువత కేజ్రీవాల్‌ను ఆదర్శంగా తీసుకున్నారు. ఉద్యోగాలు వదులుకుని అన్నా, ఆయన బాటలో ఆందోళనలో పాల్గొన్నారు.

అదే సమయంలో, అన్నాహజారేతో అవినీతి వ్యతిరేక వేదికను పంచుకున్న సందర్భంలో కుర్చీ మహిమ గురించి, అరవింద్ కేజ్రీవాల్ చక్కని ప్రవచనం వినిపించారు. కుర్చీ చాలా డేంజర్ గురూ.. అంటూ పాఠాలు చెప్పారు. అప్పట్లో, ఒక సందర్భంలో అరవింద్ కేజ్రీవాల్, "*ఏ కుర్సీ కే అందర్ కుచ్ న కుచ్ సమస్యా హయ్, జో ఇస్ కుర్సీ కే ఉపర్ బైట్‌తా హై వోయీ గడబడ్ హెూజాతా హై, తో కయీ ఐసాతో నహీ, ఇస్ ఆందోళన్ సే జబ్ కుచ్ వికల్ప్ నికలేగా, ఔర్ జబ్‌వో లోగ్' జాకే ఉస్ కుర్సీ పర్ బైఠేంగే కహి వో లోగ్ భ్రష్ట్ హెూ జాయ్, కహి వో నా గడ్బిడ్ కరనే లగే, ఏ భారీ చింతా హమరే మన్ మే హై. హమారా మన్ మే బహుత్ డర్ హై, కహి ఐసా న హెూగే, ఇస్ ఆందోళన్ సే, జబ్ రాజనీతిక్ వికల్ప్ కడారహెూ, కహీ ఉసమే సే భ్రష్టాచార్ కో జన్మ దేనేకి కుచ్ ప్రవృతి నికలే, ఔర్ ఐసే గలత్ లోగ్ నికలే, ఇస్కే బారే మే ఆప్ లోగోం కా క్యా కహనా హై, కీ జో లోగ్ సత్తా మే జాయే వో భ్రష్టాచార్ న కరే, ఇస్కా క్యా సమాధాన్ హై, ఇస్కే బారే మే భీ ఆప్ ఆప్కీ రాయి దేతో అచ్ఛా రహేగా ..* అంటూ.. ఈ కుర్చీ ఏదైతే ఉందో, అది చాలా ప్రమాద కరమైనది. ఈ కుర్చీలో కూర్చున్న వారు గడబిడకు గురవుతారు. ఒక వేళ రేపు ఒక ఈ ఆందోళన (ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్) విజయవంతమై, ఉద్యమ కారులు వెళ్లి ఇదే కుర్చీలో కూర్చుంటే, వీరు కూడా గడబిడకు గురై, అవినీతికి అలవాటు పడితే, ఏమిటి పరిస్థితి? అంటూ ఆందోళన వ్యక్త పరిచారు. అలాంటి పరిస్థితి వస్తే ఏమి చేయాలో ఆలోచించాలని అన్నా సాక్షిగా పిలుపునిచ్చారు. కేజ్రీవాల్ చేసిన ఈ ప్రసంగం అదే వేదికపై ఉన్న అన్నా సహా అందరినీ అబ్బుర పరిచింది. ఆనంద పరవశులను చేసింది.

అయితే, అప్పుడు ఆ వేదికపై ఉన్న అన్నా సహా ఇతర నేతలు, కేజ్రీవాల్ అద్భుత భాషణం విన్న వేలది మంది సామాన్యులు, అదే కేజ్రీవాల్' ఇలా 180 డిగ్రీలు తిరిగి పూర్తి వ్యతిరేక రూపంలో, అవినీతి మరకల మయంగా కనిపిస్తారని ఊహించారో లేదో కానీ, కేజ్రీవాల్ ఇప్పుడు దేశం ముందు అవినీతి ముద్ర వేసుకున్న మరో లాలు, మరో జయలలితలా నిలిచారు. ఇదే అసలు విషాదం అంటున్నారు.★

**తెలంగాణలో ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ హాట్ టాపిక్ అయ్యింది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ పెద్దలు, ముఖ్యులు అనుసరించిన పద్ధతులు, విచ్చల విడిగా ప్రవర్తించిన తీరు ఇప్పుడు ఆ పార్టీ మెడకే చుట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని పరిశీలిస్తే.. అధికారం తమకే శాశ్వతం అని, దానికి తమను ఎవరూ దూరం చేయలేరన్న అత్యుత్సాహం, అతి ఆలోచన ఎంతగా గూడుకట్టుకొని ఉందో అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఓ రకంగా ప్రజాస్వామ్యాన్నే పరిహాసం చేసే స్థాయిలో సెల్ ఫోన్ ట్యాపింగ్ లు చేయించిన విధానం తెలుసుకొని దర్యాప్తు అధికారులే విస్తుపోతున్నారు. ఇక, ఈ అరాచకపు ఆనవాళ్లు తెలుసుకుంటున్న ప్రస్తుత ప్రభుత్వ పెద్దల స్పందన ఊహించని రీతిలో ఉంది.**

# బీఆర్ఎస్ మెడకు ట్యా



ప్రభాకర్‌రావు, ప్రణీత్ రావు

రాజకీయ ప్రత్యర్థుల రహస్యాలు తెలుసుకోవాలన్న కుతూహలం ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. వాళ్ల వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విపక్షాల నాయకుల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలను గ్రహించాలని, వాటికి తాము పై ఎత్తులు వేసేందుకు ఆ సమాచారం పనికొస్తుందని అనుకుంటారు. ప్రభుత్వంలో కొనసాగుతున్న వారూ ఆ తరహాలో ఆలోచిస్తారు. కానీ, దొంగచాటుగా సంభాషణలు వినడం, ప్రత్యర్థుల దినచర్యల గురించి అనైతిక పద్ధతుల్లో తెలుసుకోవడంలాంటివి సరికావు. అదీ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటైన మన దేశంలో ఇది ఏ మాత్రం సమంజసం కాదు. కానీ, భారత రాష్ట్రసమితి పార్టీ అధిష్టానం, కీలక నేతలు వ్యవహరించిన తీరు అసమంజసంగా ఉందన్న ఆనవాళ్లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

**అనైతికతకు ఆనవాళ్లు**

తమ సామాజిక వర్గానికి చెందిన ఓ కిందిస్థాయి పోలీసు అధికారిని వాహకంగా ఉపయోగించుకొని ఆయనకు అనైతికంగా, అడ్డదారుల్లో పోస్టింగులు, ప్రమోషన్లు ఇచ్చారు. అత్యున్నత స్థాయి అధికారులకు ఇవ్వాల్సిన బాధ్యతలు అప్పగించారు. అంతే.. ప్రభుత్వ పెద్దలే తన వెనక ఉన్నారన్న భరోసాతో ప్రభుత్వంలోని పెద్దలు,ఇతర ముఖ్యులు చెప్పినట్టల్లా చేశాడు.వారి అవసరాలకోసం, వాళ్లకు గిట్టని, కంట్లో నలుసుగా మారిన వారి సెల్‌ఫోన్లు ట్యాపింగ్ చేశాడు. సినిమా ప్రముఖులు, సినీ హీరోయిన్లు సెల్ ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్లు వివరాలు బయటకు వస్తున్నాయి.

**మూలిగే నక్కపై తాటిపండు పడిందా? :**

వాస్తవానికి బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ప్రస్తుతం కడు దయనీయంగా ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా తయారయ్యింది పార్టీ పరిస్థితి. ఇప్పుడేమో లోక్ సభ ఎన్నికలు ముంచుకొచ్చాయి. ఐదునెలలు కాకముందే లోక్ సభ ఎన్నికలు కూడా రావడం ఆ పార్టీకి కనీసం సర్దుకునే పరిస్థితిని కూడా దూరం చేసింది. దీనికి తోడు.. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత పదేళ్లలో ఒకరకంగా నియంతృత్వ పోకడలు ప్రదర్శించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఆయన కుటుంబ సభ్యులు, పార్టీలో కీలకంగా వ్యవహరించే ఆయన బంధువులు కూడా ఆయనలానే వ్యవహరించారన్నది నిర్వివాదాంశం. ఆ పరిస్థితులను తట్టుకొని అనివార్యంగా ఇన్నాళ్లు ఆ పార్టీలో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు అధికారం చేజారినప్పటి నుంచి పక్కచూపులు చూస్తున్నారు. ఇతర పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు సందర్భం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు ఇప్పటికే పార్టీ మారిపోయారు. ఇక, లోక్ సభ పోరులో నిలబడేందుకు అభ్యర్థులను వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో ఇప్పుడు సెల్ ఫోన్ ట్యాపింగ్ బండారం బయట పడటం పార్టీకి, దాని అధినేత కేసీఆర్‌కు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లుగా తయారయ్యింది.

**కేసీఆర్‌కు తలబొప్పి**

ఇప్పటికే ఎన్నికల్లో సమస్యలు ఎదుర్కోబోతున్న గులాబీ బాస్ కేసీఆర్.. ట్యాపింగ్ ఆధారాలు బయటపడుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. రోజులుగడుస్తున్న కొద్దీ సెల్ ఫోన్ ట్యాపింగ్ సంచలనాలు బయటపడుతున్నాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్‌ల వ్యవహారం ఇప్పుడు కొత్త మలుపులు తిరిగింది. ఈ వ్యవహారం వెనక బీఆర్ఎస్ కీలక నేత ఒకరు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అయితే, ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు పోలీసు అధికారులను అరెస్టు చేశారు. ట్యాపింగ్ వ్యవహారం నడిపించిన డీఎస్పీ ప్రణీత్ రావును మొదట అరెస్టు చేసి, విచారణలో ఆయన నుంచి సేకరించిన వివరాలతో మరో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను కూడా కటకటాల్లోకి పంపించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కీలక నేతతో పాటు మరో నాయకుడు కూడా ఉన్నట్లు గుర్తించారు.

**పక్కా పకడ్బందీగా...**

ముగ్గురు పోలీసు అధికారుల అరెస్ట్‌ల అనంతరం అధికారులు, సూత్రధారులపై దృష్టి సారించారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు ఈ కేసులో కీలక నిందితుడని పోలీసులు మొదటి నుంచి అనుమానించినా, అదనపు ఎస్పీల అరెస్టు తర్వాతే దానిని రూఢీ చేసుకున్నారు.విపక్ష

సుజాత గోపగోని, 6302164068

నేతలు, అధికారులు, ఇతరుల ఫోన్లను ట్యాపింగ్ చేయడానికి ప్రభాకర్‌రావు ఆదేశాలే కారణమని భుజంగరావు, తిరుపతన్న వాంగ్మూలమిచ్చినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనక బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత ఉన్నట్లు, ఆయన చెప్పిన నంబర్లను ట్యాప్ చేసినట్లు ఎఎస్పీలు అంగీకరించినట్లు స్పష్టం చేశారు. ఆ నేత ఇచ్చే నంబర్లను వీరిద్దరూ ప్రణీత్‌రావుకు చేరవేసేవారు. ఆయన ఇచ్చే ఔట్‌పుట్‌ను ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తిరిగి బీఆర్ఎస్ నేతకు అందజేసేవారు. అప్పట్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న రాధాకిషన్‌రావు ఇచ్చిన నంబర్లన్నీ ట్యాప్ చేసినట్లు ఒప్పుకొన్నారు. వాటి ఔట్‌పుట్‌ను కూడా ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తిరిగి రాధాకిషన్ రావుకు పంపేవారు. ఎన్నికల సమయంలో

# పింగ్ ఉచ్చు



తిరుపతన్న, భుజంగరావు,

వందలాది మంది రాజకీయ నేతలు, వారి కుటుంబసభ్యుల ఫోన్లను ట్యాప్ చేశామని, రాజకీయ నేతలు కదలికలు, నిధుల సమీకరణపై దృష్టి పెట్టామని ప్రణీత్‌రావు వెల్లడించాడు. వ్యాపార వేత్తలతో పాటు సమాజంలో పేరు ఉన్న వారి ఫోన్లను కూడా టాప్ చేశామన్నారు. పోలీసులు రిమాండ్ రిపోర్టులో ఈ వివరాలను పొందుపరిచారు. ప్రైవేటు వ్యక్తులపై ఫోన్‌లు ట్యాపింగ్ చేసి వారికి సంబంధించిన ప్రొఫైల్ తయారు చేసినట్లు, అందుకు సంబంధించిన సాక్ష్యాలను నాశనం చేసినట్లు తిరుపతన్న, భుజంగరావు విచారణలో అంగీకరించారు. ఈ కేసులో మరో కీలక నిందితుడు, ఐన్యూస్ యజమాని శ్రవణ్‌కుమార్‌రావు, ప్రభాకర్ రావు, రాధాకిషన్‌రావు విదేశాల్లో ఉన్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఆ ముగ్గురిపై లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. ప్రణీత్‌రావు వాంగ్మూలం మేరకు నల్లగొండలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్, వరంగల్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను కూడా దర్యాప్తు అధికారులు విచారించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కు చెందిన డబ్బులను వీరిద్దరే వాహనాల్లో తరలించారని విచారణలో తేలింది.

**స్పెషల్ అరేంజ్ మెంట్స్ :**

2018లో ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్ హోదాలో చేరిన ప్రణీత్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కోసం 2 గదులు, 17 కంప్యూటర్లతో పాటు, ప్రత్యేక అధికారాలు కట్టబెట్టినట్లు సమాచారం. విదేశాల నుంచి తెచ్చిన అధునాతన టెక్నాలజీని ఇందుకోసం వాడినట్లు గుర్తించారు. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన సోదరుల ఇళ్ల పరిసర ప్రాంతాల్లో ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. సుమారు 2 కి.మీ. పరిధిలోని ప్రైవేట్ కమర్షియల్ బిల్డింగ్స్‌లో అత్యాధునిక టెక్నాలజీతో ఈ పరికరాలు అమర్చినట్లు స్పెషల్ టీమ్ గుర్తించినట్టు తెలిసింది.

**ఆనవాళ్లు దొరక్కుండా...**

ప్రభుత్వం మారిన తర్వాత ట్యాపింగ్ సంబంధించిన మెయిన్ డివైజ్‌ని పూర్తిగా ధ్వంసం చేసినట్లు, 17 కంప్యూటర్లలో హార్డ్ డిస్క్‌లన్నిటిని ధ్వంసం చేసి మూసీ నదిలో పడేసినట్లు ప్రణీత్ రావు చెప్పారు. రెండు లాకర్ రూములలో ఉన్న డాక్యుమెంట్లు అన్నిటిని తగలబెట్టామని కూడా విచారణలో వెల్లడించాడు.

**తీగలాగితే.. కదులుతున్న డొంకలు :**

అయితే, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన ముగ్గురు కీలక నిందితులు ప్రభాకర్‌రావు చెప్పడంతో ఆయనను కూడా పాత్రధారిగా దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఇక సూత్రధారులు ఎవరనేది తెలియాలంటే ప్రభాకర్‌రెడ్డి అరెస్టు కావాల్సిందేనని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో 'ఐన్యూస్' యజమాని శ్రవణ్‌కుమార్‌రావు పాత్ర కీలకమని దర్యాప్తు అధికారులు తేల్చారు. ఆయన ఫోన్ ట్యాపింగ్ కోసం తన సంస్థలో ప్రత్యేకంగా సర్వర్ రూమ్ ఏర్పాటు చేసి, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రణీత్‌రావుకు అందజేసేవాడని గుర్తించారు. శ్రవణ్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులు.. రెండు ల్యాప్‌టాప్‌లు, 4 ట్యాబ్‌లు, 5 పెన్‌డ్రైవ్‌లు, ఒక హార్డ్‌డిస్క్, ఒక డీవీఆర్ ని సీజ్ చేసి ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. పోలీసులు. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. చెడిపోయిన ట్యాపింగ్ డివైజ్‌ను రీట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు దొరికిన ఆధారాలతో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును ఏ1 గా చేర్చారు పోలీసులు. ఈ కేసులో ఏ1 గా ప్రభాకర్ రావు, ఏ2 గా ప్రణీత్ రావు, ఏ3గా భుజంగరావు, ఏ5గా తిరుపతన్న, ఏ6 గా మరో వ్యక్తి పేరును చేర్చారు పోలీసులు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావే కీలక సూత్రధారి అని.. ఆయన కనుసన్నల్లోనే ట్యాపింగ్ జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

**నవ్విపోదురు గాక...!**

అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులు కూడా తాము అప్పటి ఇంటిలెజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల ప్రకారమే తాము చాలామంది ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు అంగీకరించటం సంచలనం కాగా, అమెరికా నుంచి ప్రభాకరరావు చేసిన వ్యాఖ్య మరింత విచిత్రంగా ఉంది. ఆయన టెలిఫోన్లో ఇక్కడి అధికారులతో మాట్లాడుతూ, 'ఇప్పుడు మీరు ఎలా పనిచేస్తున్నారో అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు అలానే చేశాం'అని చెప్పటం విచిత్రంగా ఉంది. అంటే పదేళ్ళ బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెలిఫోన్ ట్యాపింగులన్నీ అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే చేయించినట్లు ప్రభాకరరావు అంగీకరించినట్లు అర్థవుతోంది. మరి ప్రతిపక్షాల నేతలతో పాటు అనుమానాస్పదంగా ఉన్న స్వపక్షం నేతల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్దలంటే కేసీయార్, కేటీయార్, హరీష్ రావు, కవితతో పాటు మరికొంత మంది మాత్రమే అని అందరికీ తెలుసు. వీరిలో ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపింది ఎవరనే విషయం అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులు, లేదా దేశానికి తిరిగొచ్చిన తర్వాత ప్రభాకరరావు చెబితే కాని తెలీదు.

**బీఆర్ఎస్ భవిష్యత్తు? :**

టెలిఫోన్ ట్యాపింగ్ అంశం లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పెద్ద మైనస్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. ప్రతిపక్షాల నేతల ఫోన్ల ట్యాపింగ్‌ను పక్కనపెట్టేస్తే అనుమానంగా ఉన్న సొంతపార్టీ నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేయించారని బయటపడటం పార్టీలో సంచలనంగా మారింది. అయితే, ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయనే విషయాలు పూర్తిగా బయటపడలేదు. అవికూడా బయటపడితే ముందు బీఆర్ఎస్‌లో తర్వాత ప్రభుత్వంలో గందర గోళమైపోవటం ఖాయం.

ఒకవైపు కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల లీకేజీలు, అవినీతి. మరో వైపు ఔటర్ రింగ్ రోడ్డు కుంభకోణం, ఈ ఫార్ములా రేసులో అవినీతి, ధరణిలో భూ అక్రమాలు, ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కవిత అరెస్టు లాంటి వివాదాల్లో పార్టీలోని కీలకనేతలు బాగా తగులుకున్నారు. వీటన్నింటి మీద టెలిఫోన్ ట్యాపింగ్ అంశం తీవ్రమైందనే చెప్పాలి. మరి రాబోయే ఎన్నికల్లో ఏమవుతుందో చూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# డ్రగ్స్‌కు అడ్డా విశాఖ...

**ప్రశాంతతకు మారుపేరుగా, అందాల నగరంగా పేరున్న విశాఖ అక్రమాలకు, మాదకద్రవ్యాలకు అడ్డాగా మారుతోంది. ఇప్పటివరకు గంజాయికి పుట్టినిల్లుగా చెప్పుకునే నగరం డ్రగ్స్‌కు కేంద్రంగా మారుతోంది. ఇలాంటి వాటిని నిరోధించవలసిన వారే, మాదకద్రవ్య వ్యాపారులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని ఆరోపణలు రావడమే విచారకరం.**

ఆసియాలోనే అందాల నగరంగా పేరున్న విశాఖ ఇప్పుడు అంతర్జాతీయ మత్తు పదార్థాలకు కేంద్రంగా మారింది. నగర శివారు ప్రాంతాలు డ్రగ్స్ కేంద్రాలుగా మారిపోయాయి. అనేక ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం వచ్చే యువత డ్రగ్స్ బారిన పడి కొట్టుమిట్టాడుతున్నారు. చీకటి పడితే... యువత రోడ్ల పక్కనే మాదక ద్రవ్యాలు తీసుకుంటూ మత్తు యువత మత్తులో మునిగి తేలిపోతున్న సంఘటనలు అనేకం నిత్యం కని పిస్తూనే ఉన్నాయి. డ్రగ్స్ మత్తులో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపు తుండటంతో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. తమ పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారిపోతోందని అనేక మంది తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

డ్రగ్స్ మాఫియా కోట్లాది రూపాయలు వ్యాపారాలు చేసుకుంటూ యువత జీవితాలను విచ్ఛిన్నం చేస్తోంది. దీనిని నియంత్రించాల్సిన పాలకులే డ్రగ్స్ వ్యాపార సంధాన కర్తలుగా మారడం సమాజానికి తీరని అన్యాయమే. విశాఖ రవాణాకు అనువైన ప్రదేశం కావడంతో వాయు, జల, రోడ్డు మార్గాల గుండా తరలిస్తున్న డ్రగ్స్ చిల్లర కొట్టుల్లో సైతం విచ్చలవిడిగా లభిస్తున్నాయి. అందుకు తాజాగా విశాఖ పోర్టులో భారీ డ్రగ్స్ కంటైనర్ లభ్యం కావడమే నిదర్శనం. ఈ డ్రగ్స్ కంటైనర్ వెనుక రాజకీయ నేతల ప్రమేయం ఉందని పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకోవడం తప్ప డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నించకపోవడం బాధాకరం.



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**
**ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ**

**కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదు**

విశాఖపట్నం లాసన్స్ కాలనీలోని సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్సు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వ్యాపార అవసరాల కోసం 'డ్రై ఈస్ట్'ను ఆర్డర్ చేసింది. అందులో డ్రగ్స్ కలిపి బ్రెజిల్ నుంచి విశాఖపట్నానికి రవాణా చేసినట్టు ఇంటర్‌పోల్ నుంచి సమాచారం రావడంతో సీబీఐ అధికారులు అప్రమత్తమయ్యారు. మార్చి 16న విశాఖ పోర్టుకు చేరుకున్న కంటైనర్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణులు సరకు తెప్పించుకున్న ఆక్వా కంపెనీ ప్రతినిధులను పిలిపించి వారి సమక్షంలోనే కంటెయినర్ (నంబర్ ఎస్ఈఆర్ యూ 437538) తెరిచారు. అందులో డ్రై ఈస్ట్ తో పాటు డ్రగ్స్ కూడా ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆక్వా సంస్థ ప్రతినిధులను ప్రశ్నించగా, తాము ఆక్వాకల్చర్ వ్యాపారం చేస్తున్నామని, తొలిసారిగా దీన్ని తెప్పించు కున్నామని అంటున్నారు. సుమారు 25 వేల కిలోల 'డ్రై ఈస్ట్' కలిపి ఉన్న కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఇన్ యాక్టివ్ డ్రై ఈస్ట్‌లో నార్కోటిక్స్ డ్రగ్స్‌ను కలిపినట్టు నిర్ధారించారు. డ్రగ్స్ వచ్చిన కంటైనర్‌ను విశాఖలో ఆక్వా ఎగుమతులు, దిగుమతులు చేపట్టే 'సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పేరిట బుక్ చేసినట్టు సీబీఐ అధికారులు తేల్చారు. ఆ కంపెనీ ప్రతినిధులతోపాటు మరికొందరిపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఇందులో అంతర్జాతీయ స్థాయి డ్రగ్స్ ముఠా ప్రమేయం ఉన్నట్టు అనుమాని స్తున్నారు. దర్యాప్తులో మిగిలిన వివరాలను రాబట్టాల్సి ఉందని సీబీఐ అధికారులు తెలిపారు.

**రాజకీయ ప్రకంపనలు**

విశాఖ పోర్టులో భారీగా పట్టుబడిన డ్రగ్స్ వ్యవహారం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎన్నికల సమయం కూడా కావడంతో తెదేపా, బీజేపీ, వైసీపీలు పెద్ద ఎత్తున పరస్పర విమర్శలకు దిగు తున్నాయి. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డ్రగ్స్ వ్యవహారంతో రాజకీయ పార్టీల పేర్లు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ వ్యవహా



రంలో కీలకంగా ఉన్న సంధ్య ఆక్వా పరిశ్రమలో సీబీఐ దాడులు జరిగాయి. కాకినాడలోని ఆ సంస్థ కార్యాలయంలో కూడా తనిఖీలు కొనసాగాయి. పట్టుబడిన సరకుకు ఉన్నతాధికారుల సమక్షంలో మరోసారి పరీక్షలు నిర్వహించడానికి సీబీఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**డ్రగ్స్ వెనుక ఎవరు...?**

సంధ్య ఆక్వాలో సీబీఐ తనిఖీలు ఇంకా కొనసాగుతుండగానే ఈ రాకెట్ వెనుక ఉన్నదెవరు? అన్న అంశం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. డ్రగ్స్ పట్టుబడిన విషయం బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే సంధ్య ఆక్వాతో వైసీపీ నాయకత్వానికి ఉన్న సంబంధాలపై తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి లోకేష్‌లు ఆరోపణలు చేశారు. సంధ్య ఆక్వా యజమానులు

వైసీపీ నాయకులుగా చలామణిలో ఉన్న విషయాన్ని దినపత్రికల్లో ఇచ్చిన ప్రకటనలను తెదేపా చూపించి విమర్శించింది.

ఆ తరువాత కాసేపటికే వైసీపీ కూడా ఇదేరకమైన ఆరోపణలు చేసింది. సంధ్య ఆక్వాకు చెందిన కోటయ్య చౌదరికి ఆ కేసులో నేతలకు సన్నిహిత సంబంధాలున్నాయని ఆ పార్టీ పేర్కొంది. సంధ్య అక్వా ఎండీ, ఎన్‌టీఆర్ కుటుంబ దూరపు బంధువు కావడంతో చంద్రబాబునాయుడి కుటుంబానికి కూడా సంబంధాలు ఉండటం వల్ల వారికి సంధ్య ఆక్వాతో సంబంధాలున్నాయని వైసీపీ అరోపించింది. ఈ మేరకు కొన్ని ఫోటోలను కూడా వైసీపీ తన పేస్‌బుక్, ట్విటర్ ఖాతాల్లో పెట్టింది. ఈ పరస్పర విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. తెదేపా, వైసీపీ బృందాలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేసుకున్నారు.



**విలువ ఎంత...?**

విశాఖ పోర్టులో పట్టుబడిన 25 వేల కిలోల డ్రగ్స్‌ను కొకైన్‌గా సీబీఐ అధికారులు నిర్ధారణ చేసి, ఆ మేరకు రిపోర్టులో కూడా పొందుపరిచారు. దీని విలువను అధికారికంగా ప్రకటించలేదు. అయితే, సుమారుగా రూ.50 వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం విశాఖ కంటైనర్ టెర్మినల్ జెఎన్ బక్షి అనే ముంబాయి సంస్థ అధీనంలో ఉంది. ఆ సంస్థకు, సంధ్య ఆక్వాకు మధ్య ఉన్న సంబంధాలేమిటో వెలుగులోకి రాలేదు. కంటైనర్‌ను స్కాన్‌చేసి లోపలి సరుకును నిర్ధారించాల్సి ఉండగా, ప్రైవేటు వ్యక్తుల అధీనంలో ఉండటంలో అది సాధ్యం కావడం లేదని చెబుతున్నారు.

దేశంలో ప్రైవేటు పోర్టులు డ్రగ్స్‌కు అడ్డాలుగా మారుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం అదాని ముంద్రా పోర్టు నుండి 25 వేల కోట్ల రూపాయల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. విశాఖ పోర్టులో ఈ తరహా వ్యవహారాలు దేశ రక్షణకు హానికరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**గంజాయి సరఫరా**

ఇటీవలి కాలంలో సాగర మార్గంలో డ్రగ్స్ విశాఖకు రావడం ఇదే తొలిసారి. అయితే... ఇప్పటికే రోడ్డు, రైలు మార్గాల్లో వస్తున్న గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు విశాఖ నగరాన్ని చుట్టుముట్టేశాయి. తరచూ తనిఖీల్లో బయటపడుతున్న గంజాయే దీనికి రుజువు. ఇటీవల దాదాపు 700 కిలోల వరకూ గంజాయి పోలీసులకు చిక్కడం గమనార్హం. భారీ కంటైనర్ లారీలో తీసుకువెళ్తున్న దాదాపు 386 కిలోల గంజాయి కొద్దిరోజుల క్రితం. బయటపడింది. శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు తనిఖీ చేస్తుండగా తప్పించుకునేందుకు వేగంగా వచ్చిన లారీని వెంటాడి ఎట్టకేలకు ఆనందపురం వద్ద పట్టుకున్నారు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాల్లో డ్రగ్స్ పట్టుకుంటే, దాని రవాణా మూలాలు విశాఖలో బయటపడుతుండటం విశేషం.

**ప్రధానంగా కోల్‌కతా, కేరళ, హైదరాబాద్, ఢిల్లీ, రాజస్థాన్, హరియాణా, బిహార్ వంటి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు విశాఖకు వస్తున్నారని సమాచారం. గుట్టుగా ఇక్కడే ఉండి ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి.. విశాఖ తెచ్చి.. తరువాత ఆయా ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. నియంత్రణకు నగర శివారులో చెక్ పోస్టులు ఏర్పాటుచేసినా.. వీటి అక్రమ రవాణా మాత్రం తగ్గుముఖం పట్టలేదు.**

**గోవా నుంచి దిగుమతి:**

ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి పంట తగ్గినా... ఒడిశా నుంచి పెద్ద ఎత్తున నగరానికి దిగుమతి అవుతోందంటున్నారు. జాతీయ రహదారితో పాటు ఏజెన్సీ మార్గాల మీదుగా తెచ్చేస్తున్నారు. ప్రధానంగా కోల్‌కతా, కేరళ, హైదరాబాద్, ఢిల్లీ, రాజస్థాన్, హరియాణా, బిహార్ వంటి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు విశాఖకు వస్తున్నారని సమాచారం. గుట్టుగా ఇక్కడే ఉండి ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి.. విశాఖ తెచ్చి.. తరువాత ఆయా ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. నియంత్రణకు నగర శివారులో చెక్ పోస్టులు ఏర్పాటుచేసినా.. వీటి అక్రమ రవాణా మాత్రం తగ్గుముఖం పట్టలేదు. ఇటీవల కాలంలో పెద్ద మొత్తంలో గంజాయి పోలీసులు తనిఖీల్లో లభిస్తున్నా కేవలం సమాచారం ఉన్నంత వరకే వీటిని స్వాధీనం చేసుకోగలుగుతున్నారు. సమాచారం అందని సరకు మాత్రం జిల్లా సరిహద్దులు దాటి వెళ్లిపోతోంది. గంజాయిని కొన్ని పార్సిళ్ల కేంద్రాల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్న తీరు ఇటీవల బయటపడింది. గోవా నుంచి రహస్యంగా డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. సమాచారం అందిన మేరకు పోలీసులు ఆయా ముఠాలను పట్టుకుంటున్నారు. మత్తుకలిగించే ఇంజక్షన్ల విక్రయాలు కూడా నగరంలో జోరుగా సాగుతున్నాయి. ఒడిశా, కోల్‌కతాల నుంచి దిగుమతి చేసుకునియువతకు విక్రయిస్తున్నారు. బానిసలుగా మారిన వారే.. తర్వాత వ్యాపారులుగా మారి విక్రయిస్తున్నారు. యువతను మత్తులో ముంచి తమ స్వార్ధ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలని కొన్ని రాజకీయ పార్టీలు డ్రగ్స్‌ను విచ్చలవిడిగా ప్రోత్సహించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి. ★




18

# మన ఆదర్శం శ్రీరామచంద్రుడు

శ్రీరాముడు మాయామానుష విగ్రహుడు. శ్రీకృష్ణునివలె లీలామానుషుడు కాదు. ఆయన ధర్మ రక్షణకు, మానవుడు పాటించవలసిన నీతి నియమముల దర్శనకు, రాజ్యపాలనాధి క్రమ ప్రదర్శనకు భూమిపై అవతరించి సాక్షాత్తు మనలో ఒక మానవుడుగా మానవులలో మహోత్తమ ఆదర్శముగా దీపించినాడు. పెక్కుసార్లు 'నేను రాముడనే దశరథ రాజపుత్రుడనగు రాఘవుడనే దైవ ప్రసక్తి నాకేల (ఇది దైవంను అవహేళనచేయుట ఎంత మాత్రము కాదు)' అని స్వయంగా చెప్పాడు. ఆయన జీవితమంత మనము నమ్మజాలని, మనలను సంభ్రమపరచు లీలాదికముచేగాక మనకు అతి సన్నిహితములైన, సాహసాద్భుతాది గుణ సందీప్తములు, అతి సహజములు, అనుసర ణీయములైన సంఘటనలతో నిండి ఉన్నది. శ్రీరాముని ప్రధానలక్ష్యము ధర్మసంరక్షణ. ఈ ఆశయమే రామాయణంలోని ప్రతి ఘట్టములోను ప్రత్యక్షమౌతుంది. ఆయన రంగస్థలికి వచ్చేసరికి వైదికధర్మాన్ని నశింపచేయుడానికి రాక్షసులు విజృంభించారు. యజ్ఞయాగాదులు చేసుకునే ఆస్కారంలేక ఋషులు, మునులు తల్లడిల్లుతున్నారు. పవిత్రమైన స్త్రీమూర్తి పతీత్వం భగ్నమయ్యే నైత్యానికి సమాజం దిగజారింది. మానవులే కాకుండా దేవతలు కూడా జయించలేనంతటి మహాశక్తితో రాక్షసులు విరుచుకుపడ్డారు. నాటి లంకాధిపతి దానవత్వానికి ప్రతిరూపం. రాక్షసుడయ్యీ విపరీతమైన తపశ్శక్తితో ఎట్టి మహాశక్తులను సాధించాడో ఆతని చరిత్ర సాక్ష్యం. పంచభూతాలను, నవగ్రహాలను పిడికిలిలో బిగించగలిగినంత శక్తిసంపాదించాడు. అతడికి అసాధ్యం లోకమందేదీ లేదు. ఏమిచేస్తే అతడిని ఎవరు కాదనగలరు? దీనినంతటిని వాడు అధర్మం కోసం వినియోగించాడు. కనుకనే ధర్మ సంరక్షణ అగత్యమయ్యింది.

పుట్టిన నాటి నుండి తన జీవితాన్ని శ్రీరామ చంద్రుడు దీనికే అంకితం చేశాడు. ప్రతి దానిని పరీక్షించడానికి ధర్మాధర్మ విచక్షణనే గీటురాయి చేశాడు. బాల్యంలో విశ్వామిత్రయాగ సంరక్షణార్థమై వెడుతూ మార్గమధ్యంలో తాటక తమ్ము తాకినపుడు ఏ సంకోచమూ లేకుండా శ్రీరామునిచే దాన్ని వధింపచేసినదీ ధర్మరక్షా దీక్షయే. మారీచ, సుబాహుని అప్పుడే అంతమొందించడం ఇందుకేగదా జరిగినది? శివచాపభంగము, రావణగర్వభంగము, సీతాకల్యాణము, పరశురామ పరాభవము ఇత్యాదులన్నీ ఈ కార్యనిర్వహణలోని అంశాలే.

మరొక ప్రక్కనుంచి చూస్తే మానవత్వంలోని మహోన్నత ప్రమాణాలు మనకు అగుపిస్తాయి. ఈయన చరిత్రలో కైకేయికిచ్చిన వరముల ప్రకారం రామవనవాసం ఆజ్ఞాపితమయింది. దశరథుని ముఖతః. అది పితృ వాక్యము. మీదుమిక్కిలి రాజాజ్ఞ. తత్పాలనకై కానలకు బయలుదేరే రాముణ్ణి మళ్ళీ ఆ దశరథుడే మమకారంతో తన్ను వీడిపోవద్దని బ్రతిమాలుకుంటాడు. పుత్రప్రేమతో దుఃఖిస్తాడు. వేలాది ప్రజలు రాముడిని అయోధ్యలోనే ఉండిపొమ్మని వేడుకుంటారు. అయినా సరే.. లక్ష్మణ సీతాసమేతుడై రథాన్ని అధిరోహించిన రాముడు రథాన్ని వేగంగా అయోధ్యను దాటించి తీసుకు వెళ్లవలసిందిగా సుమంత్రుని ఆజ్ఞాపిస్తాడు. అయితే తన కట్టెదుటి కరుణరసభరిత సన్నివేశం చూస్తూ సుమంత్రుడు గుర్రాలను అదలించలేకపోతాడు. కర్తవ్య నిర్వహణను కఠోర వ్రతంగా స్వీకరించగలిగిన ఆదర్శమూర్తి గనుకనే వెంటనే శ్రీరాముడు పగ్గాలను తానేపూని రథం నడుపుకొంటూ పోతాడు. భరతుడు తన్ను అయోధ్యకు తరలి రమ్మని బ్రతిమాలుతూంటే "తమ్ముడూ! భావనకన్న కర్తవ్యము గొప్పది సుమా! రామువంటి కొడుకు భరత సౌమిత్రులవంటి తమ్ములు, సీతవంటి భార్య లేరు లేరంచు జనులు తలలూపవలదే" అని ఎంతకీ అతడు కదలకపోతే తుదకు తన చిహ్నంగా పాదుకలనిచ్చి అతని కోర్కె చెల్లిస్తాడు. ఇక రావణుడు సీతాపహరణ యత్నంలో భాగంగా మాయాలేడికి కమ్మని మారీచుడిని కోరినప్పుడు అతను రాముడి పరాక్రమాన్ని వివరిస్తాడు. కౌశిక రక్షణ సమయంలో శ్రీరామ శరాఘాతం గుతలర్తుకు వస్తుంది. **– శండిల**

**'జాగృతి' 01-04-1955 నుంచి**

ఆధ్యాత్మికం

సప్త చిరంజీవులు

## శరణాగతికి ఆద్యుడు విభీషణుడు



సనకసనందనాదుల శాపకారణంగా వైకుంఠ ద్వార పాలకులు జయ విజయులు, రెండవ జన్మగా త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగా కైకసి విశ్వావసు దంపతులకు జన్మించారు. తన సంతానమంతా దుర్మార్గులేనా? అని విచారిస్తున్న అర్ధాంగికి కనిష్ఠపుత్రుడు సుగుణమూర్తి అవుతాడని విశ్వావసు చెబుతాడు. అతడే విభీషణుడు. పరమ భాగవతోత్త ముడు. సాత్త్విక ప్రవృత్తి కలవాడు. దయార్ద్రహృదయుడు, ధర్మానువర్తి. శైలూషుడనే గంధర్వుని పుత్రిక సరమను వివాహ మాడాడు. 'లంకలో పుట్టిన వారంత రాక్షసప్రవృత్తి కలవారు కాదు' అనేందుకు నిలువెత్తు నిదర్శనం. వానర సోదరులు వాలిసుగ్రీవుల మాదిరిగానే దానవ సోదరులైన రావణ విభీషణుల్లో వరుసగా తామస, సాత్త్విక గుణాలు ఉన్నాయి. అన్న రావణుడు అహంకార పూరిత దుష్కృత్యాలను నివారించేందుకు విఫలయత్నం చేశాడు. 'పరదారాపహరణం అనుచితం, అధర్మం. పాపమని' అని ధైర్యంగా హితవు చెప్పాడు. రాముడితో సమరం అంత సులువైన వ్యవహారం కాదు. రాక్షసులందరి శ్రేయస్సు దృష్ట్యా కూడా యుద్ధం సమర్థనీయం కాదు' అని అన్న రావణుడికి నచ్చచెప్పేప్రయత్నం చేశాడు. ఆయన అన్నకు రుచించలేదు. ఆగ్రహించాడు. తన మాటలను పెడచెవిన పెట్టి, అవమానించిన అన్నను 'ప్రాతికూలస్య వర్జనమ్' అన్న పెద్దల మాటను అనుసరించి రాముని శరణువేడాడు. రాక్షస వంశానికి చెంది సంపూర్ణ శరణాగతి పొందిన వాడు. శ్రీరామచంద్రుని సర్వలోక శరణ్యత్వాన్ని, ధార్మిక

# భగవాన్ శ్రీకృష్ణ

18




మన రాష్ట్రజీవన చిత్రంమీద, ఒక్క రాముని విడిచి, శ్రీకృష్ణుని చరితా ప్రభావం కనిపించినంతగా ఇంకెవ్వరి ప్రభావమూ కన్పించదు. రామకృష్ణులిద్దర్ని మనం అవతారమూర్తులని భావించి పూజించాం. మన విద్వాంసులు శ్రీకృష్ణుని చరిత్రను సంపూర్ణంగా సంశోధించారు. మహాకవులు ప్రబంధాలను అల్లారు. భక్తులు 'నవవిధ' భక్తిని అనుసరించి ఆయనను ఆరాధించారు. 'ప్రాపంచిక లజ్జ'ను కూడా త్యజించి సాధ్వి మీరాబాయి... 'గిరిధరుడె తప్ప నాకుదిక్కెరుపరులు' అని ఆలపిస్తే, మహాకవి మారదాస్. "కేల్విదల్చి యబలననిగిన్కపోవు. నిన్ను హృదయమున్వీడు నాడెన్నుదాన" అంటూ సఖ్య భావంతో అనేక విధాల తాదాత్మ్యతను ప్రదర్శించాడు. ''బ్రహ్మసత్యం జగన్మిధ్య'' అను సిద్ధాంతాన్ని ప్రపంచమంతటా చాటిన పరమజ్ఞాని శ్రీమదాద్య శంకరభగవత్ పాదతీర్థులు.

**'పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీ జఠరేశయనమ్**
**ఇహసంసారే ఖలుదుస్తారే**
**కృపయాపారే పాహిమురారే**
**భజగోవిందం భజగోవిందం**
**గోవిందం భజమూఢమతే'**

అని అపారమైన ఈ సంసారంలో కేవలం 'ఏక మేవ సారం' శ్రీకృష్ణుని 'భజన' యే యని అంటే, అటు

**సుఖదుఃఖే సమేకృత్వా**
**లాభలాభౌ జయాజయౌ**
**తతో యుద్ధా మయుజ్య**
**స్వనైవం పాపమవాప్స్యసి**

అనే సందేశాన్ని విని అర్జునుడిలాంటి అనేక వీరులు శత్రుసైన్యాలను సంపూర్ణంగా తుత్తు నియలు చేసి తమ పరాక్రమము, అనంత కర్మమయ జీవనము, సమన్వయించుకొని పెద్ద పెద్ద సామ్రాజ్యాలను నిర్మించారు. సుశ్రీ విభూషితులైనారు కూడా. ఈ తీరుగా జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలలోనేగాక ప్రతి ఒక్క జీవిత రంగంలో శ్రీకృష్ణుడే మనకు సర్వవిధ ఆధారుడై ఉన్నాడు.

రాష్ట్రజీవనంలో ఇంత ప్రముఖ స్థానాన్ని ఏ వ్యక్తి సహజంగా సంపాదించు కోలేదు. కొంతకాలం వరకు యావద్రాష్ట్రాన్ని తన అడుగుజాడల్లో నడిపించు కోవచ్చు. లేదా, రాష్ట్రంలోని ఒక వర్గానికి స్ఫూర్తి ప్రదాతలుగా సర్వ కాలాలకుగాను గణింపబడవచ్చు. కాని యావద్రాష్ట్రానికి యుగ యుగాల పర్యంతం స్ఫూర్తిని ఇవ్వగలగడం కొన్ని విశేష గుణా లుంటేగానీ సంభవం కాదు. ఏ రాష్ట్రమైనా సరే ఎవరో ఒక వ్యక్తిని ఆదర్శంగా మన్నించి పూజించడం గానీ, అర్చించడం గానీ, చేయదు. ఏ వ్యక్తిలో తమ ఆత్మ ప్రతిబింబం సాక్షాత్కారం అవుతుందో అలాంటి వ్యక్తే పూజలు అందు కుంటాడు.

మన కల్యాణాన్ని భావిస్తూ సంచరించే వారిని శ్రద్ధాప్రేమాదులతో మన్నిస్తాం. రాష్ట్ర హితంకోసం సర్వస్వార్పణము చేయగలిగేవారే రాష్ట్రంలో మన్నింపు పొందుతారు. అలాంటి వ్యక్తి రాష్ట్రాత్మను సాక్షాత్కారము చేసికోగలిగినప్పుడే, అతని జీవనము నుంచి వెలువడ్డ స్వరం కనుసన్నల్లో సంపూర్ణరాష్ట్రం వర్తిస్తుంది. హృదయం మీద అధికారం సంపాదించిన వాడు జీవన సర్వస్వం అధికారికాగలుగుతాడు. రాష్ట్రహృదయాన్ని తన కైవశం చేసికొని రాష్ట్రాన్ని తనలో లీనం చేసికొని ప్రకాశించిన మహాపురుషుల్లో శ్రీకృష్ణుడు ప్రథమగణ్యుడు. అందుకనే అతనిని మనం యుగ యుగాలనుంచి పూజిస్తున్నాం. ఆయన జన్మదినం నాడు ఈనాటికి కూడా మనం భగవాన్ శ్రీకృష్ణుని పూజిస్తాం.

ఈనాడు కూడా భారత వర్షంలో నాలుగు మూలలా జరుపుకుంటాం. కవులు ఆయనను వర్ణించి ఆత్మసుఖాన్ని పొందుతారు. తత్త్వజ్ఞులు ఆయనకు ధన్యవాదాలు అర్పించి తమ తత్త్వప్రతిపాదనలను చేస్తారు. శ్రీకృష్ణుని నామోచ్చరణ చేస్తూ,అనేక మంది భజన, గానములను చేస్తూ, శరీరాన్ని విస్మరించి పులకింతులవుతారు. ఇవన్నీ ఉన్నా రాష్ట్రం పతనోన్ముఖం కావడానికి కారణం ఒక్కటే. తత్త్వాన్ని విస్మరించి బాహ్యరూపాన్ని గ్రహించడం. దాన్నే పట్టుకు కూర్చున్నాము.

**'జాగృతి'**

**31-08-1956 సంచిక నుంచి**

త్వాన్ని అర్థం చేసుకున్నాడు. 'దుష్ట స్వభావం గల అన్నను త్యజించి, ధర్మమూర్తి శ్రీరాముడిని ఆశ్రయించి, ఒక నియంత పాలనకు ముగింపు పలికి ధర్మసంస్థాపనకు తన వంతు కృషి చేశాడు.

తనను శరణుకోరిన విభీషణుడి గురించి శ్రీరాముడు కపివీరుల మనోగతాలను కోరినప్పుడు 'ఉజ్వలనీతివేత్త, పరమ యదార్థవాది, పక్షపాత రహితుడు, సత్వగుణ సంపన్నుడు, మహాభిమానుడు' అని హనుమ వివరిస్తాడు. అప్పటి వరకు విభీషణుడి వ్యక్తిత్వం ఎరిగిన వారు రామదండులో హనుమ ఒక్కడే. ఆయన సీతాన్వేషణ సమయంలో లంకాపురిలో మేఘనాథుని బ్రహ్మాస్త్రానికి కట్టుబడి రావణుడి కొలువుకు చేరతాడు. హనుమ వధకు ఆజ్ఞాపించిన రావణుడికి వ్యతిరేకంగా, హనుమకు అనుకూలంగా వాదించాడు విభీషణుడు. 'సజ్జన రాజులు దూతను చంపరు. దూత వధ ఎంత మాత్రమూ తగదు. ఇది పౌరుషవంతులకు పాపహేతువు. అతను నీ శత్రువు పంపగా వచ్చిన వాడే కానీ నీకు శత్రువు కాదు. దూత వధతో నీ శాస్త్ర విజ్ఞానం పరాక్రమం వ్యర్థమే అవుతాయి. దూత సజ్జనుడైనా, దుర్జనుడైనా ఒకరి సందేశం తెలిపేందుకు వచ్చినవాడు. పరతంత్రుడు. శాస్త్ర విజ్ఞానంలోకాని, పరాక్రమంలో కానీ ఈ వానరుడు నీకు సమానుడు కాదు.అదీగాక, అతనిని వధిస్తే ఇక్కడి నీ పరాక్రమం, నీ వైభవప్రాభవ సమాచారాన్ని అక్కడ ఎవరు నివేదిస్తారు? సర్వం ఎరిగిన నీవు మంచి చెడులు విచారించి దూతకు తగిన దండన విధించు' అని సమయస్ఫూర్తితో హితవు పలికిన తీరును హనుమ వివరిస్తాడు.

**– రామచంద్ర రామానుజ**

## వివేకానంద సూక్తిశతి

**What queer humility is this to say,**
**I know nothing, I am nothing!**
**This is pseudo renuciation**
**and mock modesty,**
**I tell you, off with such**
**a self debasing spirit!**

**నాకు తెలియదనుచు నాకేమిరాదని**
**ఆత్మపంచనేల అదియుతప్పు**
**చేతనైనపనులు చేసిచూపించుము**
**వినుడి స్వామి సద్వివేక వాణి !!**





బండిరాజుల శంకర్

**మూడవ ప్రపంచ యుద్ధం జరుగబోతోందా? లేక అది నూతన రూపంలో ఎప్పుడో ప్రారంభమై కొనసాగుతోందా? ప్రారంభమైపోయింది అంటే ఆశ్చర్యంగా ఉంది కదూ? ఎందుకంటే, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలలోలాగా దేశాలు రెండు బృందాలుగా కూటములు కట్టి కొట్లాడటం లేదు ఇప్పుడు. తమ దేశాలలో యుద్ధం జరుగకుండా మరొక క్షేత్రాన్ని ఎంచుకుని, వారిని రెచ్చగొట్టడం ద్వారా తమకు నచ్చని మరొక దేశంపై యుద్ధానికి పురిగొల్పవచ్చు. మీడియాలో ప్రతికూల వార్తలతో ఒక దేశం ఇమేజ్‌ను ఛిద్రం చేయడం, మతపరమైన, వర్గపరమైన, కులపరమైన బలహీనతలను రెచ్చగొట్టడం, అధికారంలో ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని స్వచ్ఛంద సంస్థల సాయంతో తిరుగుబాట్లను ప్లాన్ చేసి ఆ ప్రభుత్వాన్ని పడగొట్టడం నేటి యుద్ధ తంత్రాలు. ఉక్రెన్ యుద్ధం అటువంటిదే. రష్యా మీద ఉన్న అక్కసును తీర్చుకునేందుకు ఉక్రెన్‌ను రెచ్చగొట్టి దానిని యుద్ధ క్షేత్రం చేసుకొని, అమెరికా సహా ఐరోపా దేశాలన్నీ కూడా ఆయుధాలను సమకూ రుస్తూ యుద్ధం చేయిస్తున్నాయి. అలా చేయడం ద్వారా ఏ నష్టాన్ని అయితే నివారించాలని అవి భావించాయో వాటిని అవి ఇప్పుడు అనుభవిస్తున్నాయి.**




ఒక దేశ సైన్యాన్ని బలహీన పరిచేందుకు రకరకాల వ్యూహాలను అనుసరించడం సర్వ సాధారణం. మనం చరిత్రలో చూసినట్టు సైన్యమంతా ఒకే చోట మోహరించి యుద్ధం చేయడం లేదు. సైన్యం మోహరించి పోరాటం చేస్తున్న ఒక ప్రాంతంలోనే కాకుండా మరొక దిక్కున హఠాత్తుగా ఏర్పడే పరిణామాల కారణంగా రెండు లేదా మూడు దిక్కులా చేసే పోరాటాన్నే టూ ఫ్రంట్‌వార్, త్రీఫ్రంట్ వార్ అంటారు. ఇందులో సైన్యం తన మానవ వనరులు సహా అన్ని వనరులను రెండు లేదా మూడు దిక్కులా పంచాల్సి వస్తుంది. ఈ సరళి ప్రపంచ యుద్ధాల సమయం నుంచే ప్రారంభమైంది. తాజాగా, ఆధునీకరించిన పద్ధతి రెజీమ్ ఛేంజ్ ఆపరేషన్లు అనుసరిస్తున్నారు. అంటే ఉన్న ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు స్థానిక మానవహక్కుల సంస్థలను, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలను రెచ్చగొట్టి తమకు నచ్చని ప్రభుత్వాన్ని కూలగొట్టి, తమ చేతిలో కీలుబొమ్మగా ఉండేందుకు అంగీకరించే వారితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, లబ్ధి పొందడం.

తాజాగా, పాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధం కేవలం ఆ రెండు దేశాల మధ్య పరస్పర భావవైరుధ్యాల కారణంగా జరుగుతున్నాయంటే నమ్మలేం. నిజమే, రెండూ ఇస్లామిక్ దేశాలు అయినప్పటికీ, వారి మధ్య ద్యురాండ్ రేఖ సహా అనేక విషయాలలో తీవ్రమైన విభేదాలున్నాయి. అయితే, ఇక్కడ జరుగుతున్నది కూడా ప్రత్యక్ష యుద్ధమేం కాదు. స్వయంగా పాకిస్తానే పెంచి పోషించిన తెహ్రెక్ ఎ తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి)ని అడ్డుపెట్టుకొని ఆఫ్ఘనిస్తాన్ ఇవాళ పాక్‌పై యుద్ధం చేస్తున్నది. అసలు తమ ప్రమేయం ఉందన్న విషయాన్ని అంగీకరించడానికి అది సిద్ధంగా లేదు. ఇక ఆఫ్ఘన్ల వెనుక ఎవరున్నారన్న విషయం బహిరంగ సత్యమే. ఇక గ్లోబల్ సౌత్‌గా ప్రపంచానికి తెలిసిన ఆఫ్రికా ఖండంలో జరుగుతున్న అంతర్యుద్ధాలు, పరస్పర యుద్ధాల వెనుక ఉన్నది కూడా అమెరికా, ఐరోపా శక్తులే.

**ఇరాన్ పట్ల వ్యతిరేకత**

పొరుగుదేశమైన పాకిస్తాన్ నిన్నటి వరకూ హిందువులతో తమకు సమస్య అన్న పాకిస్తాన్ నేడు ఒకవైపు ఇరాన్ మరొకవైపు ఆఫ్ఘన్ నుంచి దాడులతో అంతర్గత, బహిర్గత సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ఆర్థికంగా కుంగిపోయిన పాక్‌లో ప్రస్తుతం బెలూచిస్తాన్ మొదలు కొని పాక్ ఆక్రమిత కశ్మీర్ వరకూ నిరసనలు, ప్రదర్శనలే కాదు దాడులు కూడా జరుగుతున్నాయి. సందట్లో సడేమియా అన్నట్టుగా ఇరాన్ బెలూచిస్తాన్ తీవ్రవాదులు తమ దేశంలో అశాంతిని సృష్టిస్తున్నారంటూ చడీచప్పుడూ కాకుండా బెలూచిస్తాన్‌లోని జైష్-అల్-అదల్ సంస్థకు చెందిన కొన్ని ఇరాన్ వ్యతిరేక తీవ్రవాద శిబిరాలపై సర్జికల్ స్ట్రైక్స్ చేసేసింది. ఇందుకు బదులుగా పాక్ కూడా ఇరాన్‌లో కొన్ని ప్రాంతాలపై క్షిపణులను ప్రయోగించడంతో, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత నెలకొన్నది. ఇరాన్‌లో 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు ఇరు దేశాలూ కూడా అమెరికాతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడమే కాదు, నాటో తీరులో ఏర్పరచిన సెంట్రల్ ట్రీటీ ఆర్గనైజేషన్ (సెంటో)లో చేరాయి. వాస్తవానికి భారత్‌పై యుద్ధానికి పాక్‌కు ఆయుధాలను కూడా ఇరాన్ సరఫరా చేసింది. కానీ, ఆయతుల్లా ఖొమైనీ నేతృత్వంలో అతివాద షియా పాలన ఏర్పడడంతో, సున్నీ మెజారిటీగా ఉన్న పాక్‌కు సమస్యలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో పాక్ సైనిక నియంత జియా ఉల్ హక్ నేతృత్వంలో తీవ్రమైన మత ప్రభావానికి గురవుతోంది. ఖొమైనీ చేతిలోకి పగ్గాలు వెళ్లిన మరుక్షణమే అది అమెరికాకు శత్రువు అయింది. దానితో అమెరికా పాక్‌ను మరింత చంకనెక్కిం చుకుంది. పాక్ విశ్వసనీయతను ఇరాన్ అనుమానించడం ప్రారంభించింది. ఇందుకు తోడుగా, చైనా, రష్యాలతో ఇరాన్ స్నేహం అమెరికాను తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ మూడు దేశాలు బ్రిక్స్ వంటి కూటమిలో ఉండి, తమ మధ్య ద్వైపాక్షిక వ్యాపారాన్ని పెంచుకోవడం వల్ల అమెరికా ఆధిపత్యం నిర్వీర్యం అవుతుందని అది, దాని మిత్రులు భీతిల్లుతున్నారు. ఆర్థిక ఆంక్షలు సహా, ఏ ఆంక్షలను లెక్క చేయకుండా వారు తమ దారి మార్చుకొని వ్యాపారాలు చేసుకుంటున్న తీరు దాని అహాన్ని దెబ్బకొడుతోంది. ఈ పరిస్థితుల నడుమ దానికి అటు ఇరాన్‌ను, ఇటు భారత్‌ను నియంత్రించేందుకు పాకిస్తాన్ ఒక్కటే మార్గం. అందుకే అక్కడ జరిగే దారుణాల గురించి పాశ్చాత్య మీడియాలో భారత్ గురించి వచ్చినంతగా ప్రతికూల కథనాలు వెలువడవు.

**టీటీపీ దాడులకుతాలిబన్ ప్రోత్సాహం?**

ఇదిలా ఉండగా, టీటీపీని అడ్డం పెట్టుకొని, ఆఫ్ఘన్‌లు తమ దేశంలో చిచ్చుపెడుతోందని మొసలి కన్నీరు పెడుతోంది పాకిస్తాన్. హిల్లరీ క్లింటన్ పెరట్లో పాములను పెంచితే అవి పక్కవారినే కాదు మనను కూడా ఏదో ఒకరోజు కాటువేస్తాయన్న మాటలను టీటీపీ తీవ్రవాదులు రుజువు చేస్తున్నారు. ఎందుకంటే, పష్తూన్లు అధికంగా ఉన్న ప్రాంతాలైన తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో కరడుగట్టిన సున్నీ ఇస్లామిస్టులను ప్రోత్సహించింది పాకిస్తానే. అక్కడ పష్తూన్ జాతీయ వాదాన్ని అణచివేసేందుకు ఈ పని చేసింది. ప్రస్తుతం పష్తూన్లు అధికంగా ఉండే ఖైబర్



# ...రిన యుద్ధాలు

**డి. అరుణ**

ఫక్తూన్వా ప్రాంతం వెంట దాడులు విపరీతంగా జరుగుతున్నాయి. తమపై దాడులు జరుపుతున్నది టీటీపీ తీవ్రవాదులేనని పాకిస్తాన్ ఆరోపిస్తోంది. కాగా, ఆఫ్ఘనిస్తాన్ 1980వ దశకంలో సోవియట్ నియంత్రణలో ఉన్న సమయంలో తాలిబన్ సృష్టికి ఈ వ్యూహం తోడ్పడింది. పాక్ స్వంత విధానాలే టీటీపీ సృష్టికి కూడా దోహదం చేయడమే కాదు, తాలిబన్ తిరిగి రాకతో వారు మరింత దుస్సాహసంతో వ్యవహరించేలా చేస్తున్నాయి. తీవ్రవాదంపై యుద్ధ సమయంలో 2007లో తాను సృష్టించి, పెంచి పోషించిన సంస్థే అయినప్పటికీ పాక్ ఆ సంస్థను తర్వాత నిషేధించింది. టీటీపీ ఇప్పుడు తమను తాము తాలిబన్ విస్తరణగా భావించుకుంటూ, అమెరికా ప్రభావం నుంచి పాక్‌ను తప్పించి, ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరచడమే తమ లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తోంది. ఇది పాక్‌కు రుచించడం లేదు. ఆఫ్ఘన్‌లో ఉన్నది కూడా ముస్లిం అందునా, సున్నీ ముస్లిం ప్రభుత్వమే కనుక మింగలేక కక్కలేక అన్నట్టుగా ఉంది పాక్ పని. అమెరికా ఆఫ్ఘన్‌ను హఠాత్తుగా వెళ్లిన సందర్భంలో ఏర్పడిన తాలిబన్ ప్రభుత్వంతో నాటి ఇమ్రాన్ ప్రభుత్వం, ఐఎస్ఐ బహిరంగంగానే చుట్టరికం కలుపుకుని, హర్షాన్ని వ్యక్తం చేశాయి. ఇప్పుడు పరిస్థితి తిరగబడడంతో ఏంచేయాలో తెలియక అల్లాడుతోంది.

హిందువులతో కలిసి ఉండలేమని, ముస్లింల కోసమే ప్రత్యేకంగా దేశం కావాలని పట్టుబట్టి భారత్‌ను విభజించి మరీ ఏర్పడిన పాక్‌లో ఇప్పుడు టీటీపీ ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపిస్తానంటుంటే వణికిపోవడమేమిటో వారికే తెలియాలి.

**చేతులు దులుపుకుంటున్న తాలిబన్**

గత రెండేళ్లగా టీటీపీని అదుపు చేయవలసిందిగా ఆఫ్ఘన్ తాలిబన్‌ను ఇస్లామాబాద్ కోరుతున్నప్పటికీ, వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని అది మీ అంతర్గత సమస్య అంటూ తాలిబన్ తప్పించుకుంటూ వస్తోంది. టీటీపీ దళాలు పాక్ సైన్యం తమకు ఇచ్చిన శిక్షణను వారిపైననే ఉపయోగించి, దళాలపై దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా ఆఫ్ఘన్ సరిహద్దులలో ఉన్న వాయవ్య ప్రాంతాలకు సమీపంలో ఈ దాడులను చేస్తున్నది. ఇటీవలే, ఆత్మాహుతి దళానికి చెందిన ఒక తీవ్రవాది పేలుడు పదార్ధాలతో నిండిన ట్రక్కుతో నార్త్ వజీరిస్తాన్ జిల్లాలో ఒక సైనిక చెక్ పాయింట్‌లోకి దూసుకుపోవడంతో అనేకమంది పాక్ సైనికులు మరణించారు. కానీ, ఈ దాడి తాము చేశామంటూ జైష్-ఎ-ఫుర్సాన్-ఎ మహమ్మద్ గ్రూప్ ప్రకటించుకుంది. అయితే, ఈ దళంలో అధికంగా ఉన్నది టీటీపీ సభ్యులేనని పాక్ సైనిక అధికారులు అంటున్నారు.

దీనితో విసిగిపోయిన పాక్ ఆఫ్ఘనిస్తాన్‌లో వైమానిక దాడులు చేసింది. అందులో నలుగురు పిల్లలు సహా ఎనిమిదిమంది మరణించడంతో ఆఫ్ఘన్ ప్రభుత్వం నిప్పులు కక్కుతోంది. తక్షణమే సరిహద్దుల వెంట ఉన్న పాకిస్తానీ దళాలపై తాలిబన్ ప్రభుత్వం కాల్పులు జరిపింది. ఇరుపక్షాలూ కూడా తమ తమ వాదనలకు కట్టుబడి ఉండి ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నాయి. తీవ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందంటూ తాలిబన్లపై పాక్ నిందలు వేస్తుండగా, వారితో తమకే సంబంధం లేదని, తన భూభాగంపై నియంత్రణ లేకపోవడం, అసమర్ధత, ఇతర సమస్యలకు ఆఫ్ఘనిస్తాన్‌ను నిందించడం పాక్‌కు సరికాదని, ఇలాగే వ్యవహరిస్తే పాక్ నియంత్రణలో ఉండని తీవ్ర దుష్పరిణామాలు సంభవించే అవకాశం ఉందని తాలిబన్ హెచ్చరించింది.

**చైనా ఆస్తుల ధ్వంసం ద్వారా పరోక్ష యుద్ధం**

ఇదిలా ఉండగా, బెలూచిస్తాన్‌లో చైనా అధీనంలో ఉన్న గ్వాదర్ పోర్టు అథారిటీ కాంప్లెక్స్‌పై అత్యంత తాజాగా దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు కొందరు హఠాత్తుగా అందులోకి ప్రవేశించి ప్రారంభించిన కాల్పులలో చైనీయులతో సహ పలువురు మరణించారు. ఈ దాడికి బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత తీసుకున్నది. ఆ ప్రాంతంలో దశాబ్దాలుగా చెలరేగుతున్న అసంతృప్తిని అటు పాక్ ప్రభుత్వాలు కానీ, ఐఎస్ఐ కానీ పట్టించుకోకపోవడమే నేటి పరిస్థితికి కారణమని చెప్పవచ్చు.

చైనా -పాకిస్తాన్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక చైనా పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్ (సిపిఇసి)లో భాగం గ్వాదర్ పోర్టు. సహజ వనరులు, ఖనిజాలతో సుసంపన్నమైన బెలూచిస్తాన్‌లో తన బెల్ట్ అండ్ రోడ్ చొరవ కింద చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. అయితే, అక్కడ దశాబ్దాలుగా కొనసాగుతున్న తిరుగుబాటు కార్యకలాపాలను తక్కువగా అంచనా వేసింది. సహజవాయువు, బొగ్గు, ఇతర ఖనిజాలు అత్యధికంగా ఉన్న బెలూచిస్తాన్ అత్యంత తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతం. అక్కడ నీటికొరత నుంచి మొదలుపెడితే ఏ ఒక్క ప్రాథమిక సదుపాయం కనిపించదు. అందుకే, బెలూచీలు పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. తమ సంస్కృతిని

గ్వాదర్ పోర్టు అథారిటీ కార్యాలయం



ధ్వంసం చేసి, తమ వనరులను దోచుకొని, తమ కుటుంబ సభ్యులను మాయం చేసే పాక్ సైన్యాన్ని, పాక్ ప్రభుత్వాన్నీ బెలూచీలు ద్వేషిస్తున్నారు.

ముఖ్యంగా గ్వాదర్ పోర్టు అభివృద్ధి పేరుతో వచ్చిన చైనీయులు స్థానికులకు ఉపాధి కల్పించడం సరే, అక్కడ సముద్రంలో వారు చేపలు పట్టుకునే అవకాశం లేకుండా వాటిని కూడా పట్టుకు పోతున్నారు. తమ వనరులను దోచుకొని, తమను అంచుల్లోకి నెట్టి వేశారని, నిరాశ్రయులను చేస్తున్నారనే భావన స్థానికులలో తీవ్రంగా ఉంది. దీనితో ఈస్ట్ టర్కిస్తాన్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ (ఇటిఐఎం), తెహ్రీక్ ఎ తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) లష్కర్ ఎ తయ్యిబా, లష్కర్ శ్రీ జంగ్వీ, దాయిష్, బెలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ వంటి అనేక వేర్పాటువాద, మతపరమైన, తీవ్రవాద గ్రూపులు అక్కడ ఏర్పడి పోరాటాలు చేస్తున్నాయి. ఇందులో కొన్ని గ్రూపులు ఏర్పాటులో పరోక్ష సైనిక మద్దతు ఉండటం పాక్ కుటిల బుద్ధికి ఒక మచ్చుతునక. ఈ గ్రూపులన్నీ కూడా ప్రస్తుతం సిపిఇసి ప్రాజెక్టును భంగపరచాలనే లక్ష్యంతో పని చేస్తూ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, విదేశీ పెట్టుబడిదారులపై, ముఖ్యంగా చైనా జాతీయులు, కార్మికులపై ప్రత్యక్ష దాడులు చేస్తూ పాక్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నాయి.

**ఇది కేవలం పాక్, ఆఫ్ఘన్‌ల మధ్య పోరేనా?**

ఆఫ్ఘనిస్తాన్‌ను నిజంగానే అమెరికా విడిచి వెళ్లిందా? వెళ్లాలనే ఉద్దేశ్యం దానికి నిజంగా ఉన్నదా? ప్రపంచం తాలిబాన్‌ను గుర్తించక పోయినప్పటికీ, వారి ప్రభుత్వం నడిచేందుకు అమెరికా ఎందుకు నిధులు అందిస్తోంది? టీటీపీ తీవ్ర వాదులు అంత నిర్భయంగా దాడులు ఎలా చేయగలుగుతున్నారు? వారి వద్ద నైట్ విజన్ గాగుల్స్ సహా అత్యాధునిక ఆయుధాలు ఎక్కడ నుంచి వస్తున్నాయి? ఈ కోణంలో ప్రశ్నలు వేసుకొని ఆలోచించినప్పుడు అమెరికా ఇంకా ఆఫ్ఘన్‌లోనే పరోక్షంగా ఉందనే విషయం అవగతం కాకమానదు. వ్యూహాత్మక ప్రదేశంలో ఉన్న ఆఫ్ఘన్, పాక్‌లపై తన పట్టును అమెరికా ఎన్నటికీ వదులుకోదు, వదులుకో లేదు. ఒకవైపు చైనాను, మరొకవైపు రష్యాను, హఠాత్తుగా తలపైకెత్తి నిలుస్తున్న భారత్‌ను నిలువరించడానికి ఈ రెండు దేశాలూ అమెరికాకు అవసరం. అందుకే, వాటితో అమెరికా డబుల్ గేమ్ ఆడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో తమ ప్రయోజనం కోసం చైనాను తమ ఉత్పత్తి కేంద్రంగా వాడుకున్న అమెరికా, ఇప్పుడు ఆ దేశం తమను మించి పోతుందేమోనన్న అనుమానంతో భీతిల్లుతోంది. పైగా, సీపెక్ పుణ్యమా అని పాక్, చైనాలు సన్నిహితమవుతుండడం దానికి నచ్చడం లేదు.



గ్వాదర్ పోర్టు

అనూహ్యంగా అంతర్జాతీయ యవనికపైకి అభివృద్ధి చెందుతున్న శక్తిగా ప్రత్యక్షమైన భారత్ పట్ల కూడా అసూయతో ఉంది. ఈ నేపథ్యంలో చైనాను, భారత్‌ను నిలవరించడానికి దానికి ఆఫ్, పాక్ రెండూ అవసరం. అందుకే, అటు పాక్‌తోనూ, ఇటు ఆఫ్ఘన్‌తోనూ కూడా అది సత్సంబంధాలు నెరుపుతూ నాటకమాడుతున్నది. పాకిస్తాన్ కూడా తక్కువేం తినలేదు. తమ దేశాన్ని తీవ్రవాదం పట్టి పీడిస్తోందని, తామూ బాధితులమేనని ప్రపంచానికి చూపించుకొని, నిధులు పొందేందుకే ఈ దాడులు జరిపిస్తోందని భావించేవారూ లేకపోలేదు.

**ఆఫ్రికాలో యుద్ధాలు, అంతర్యుద్ధాలు**

పాశ్చాత్య దేశాలు చేస్తున్న పరోక్ష యుద్ధాలకు ప్రయోగ వేదిక ఆఫ్రికా ఖండం అని చెప్పేందుకు ఏ మాత్రం తడబడనవసరం లేదు. వనరుల పరంగా సుసంపన్నమైన ఈ ఖండంపై పాశ్చాత్య దేశాలు శతాబ్దాల కిందటే కన్నువేసి వాటిని తమ వలస కాలనీలుగా మార్చుకొని వారిని, వారి వనరులను



అన్నిరకాలుగా వాడుకున్నాయి. నెల్సన్ మండేలా పోరాటం చేసేవరకూ దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష కొనసాగిందంటే, పాశ్చాత్యులు ఆ ప్రాంతంలో ఎంత పాతుకుపోయి ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఆఫ్రికాఖండంలో పలు ప్రాంతాలు కూడా స్వేచ్ఛను కోరుకుంటున్నాయి. అయితే వారిని ఏ మాత్రం ఎదుగనివ్వకుండా ఉండేందుకు పాశ్చాత్యులకు అలవాటైన సమాజంలోని లోటుపాట్లను ఆసరాగా చేసుకుని, అక్కడి వర్గాల మధ్య చిచ్చు పెట్టి తమ పని తాము చేసుకుపోతున్నాయి.

లిబ్యా, దక్షిణ సూడాన్, సెంట్రల్ ఆఫ్రికనన్ రిపబ్లిక్, ఉత్తర మొజాంబిక్, ఇథియోపియా, కెమరూన్, వాయువ్య, నైరుతి ప్రాంతాలలో గత కొన్ని దశాబ్దాలుగా అంతర్యుద్ధాలు, తెగల మధ్య ఘర్షణలు, యుద్ధాలు సాగుతున్నాయి. వారి మధ్య ఉన్న విభేదాలను రెచ్చగొట్టి, వారు కొట్టు కుంటుంటే మధ్యలో వారి వనరులను మాయం చేసి, వారిని శాశ్వత పేదరికంలో ఉంచుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న ఈ యుద్ధాల గురించి వార్తలలోకి ఎప్పుడో తప్ప రాకపోవడానికి కారణం ప్రపంచ మీడియానే గుప్పిట్లో పెట్టుకున్నవారే అందుకు బాధ్యులు కావడం. అయితే, ఇప్పుడు వారు కూడా పాశ్చాత్యుల కుటిలతను అర్థం చేసుకొని తిరగబడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని ఏకధృవ ప్రపంచం గుప్పిట్లోంచి తప్పించేందుకు బ్రిక్స్ వంటి సంస్థలు చేస్తున్న ప్రయత్నాలతో అమెరికా, ఐరోపాదేశాలు గిలగిలలాడుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలకు దక్షిణ దిశలో ఉండి...అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాలతో కూడిన ప్రాంతాన్నే గ్లోబల్ సౌత్ అంటారు. ఇప్పుడు వారంతా కూడా ఏకమయ్యేందుకు యత్నిస్తున్నారు. భారత్ ప్రస్తుతం గ్లోబల్ సౌత్‌కు గొంతుకగా ఉన్నందున కేవలం ఆఫ్రికాలోనే కాక ఇతర ప్రాంతాలలో జరుగుతున్న పరోక్ష యుద్ధాల నుంచి విముక్తం అయ్యే అవకాశం ఉందని భావిద్దాం. ★




# ఇస్రో మరో అద్భుత ప్రయోగం 'పుష్పక్'

ప్రపంచంలోనే ఏ అంతరిక్ష సంస్థ కూడా ఊహించలేనంత సరసమైన ధరల్లో విజయవంతమైన ప్రయోగాలను చేయడంలో పేరుగాంచిన అగ్రగామి సంస్థ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో). అంతేకాదు, ఒక అభివృద్ధి చెందుతున్న దేశం సాధిస్తుందని ఎవరూ ఊహించని విజయాలను సాధించిన సంస్థ కూడా ఇదే. అది దక్షిణ ధృవంపై విజయవంతమైన చంద్రయాన్ ప్రయోగం కావచ్చు, సూర్యుని కక్షలో ఉపగ్రహాన్ని నిలిపిన ఆదిత్య ఎల్ 1 మిషన్ కావచ్చు... వీటన్నింటినీ విజయవంతంగా ప్రయోగించడమే కాదు, ఇతర దేశాలతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చుతో సాధించిన ఘన విజయాలు ఇవి. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అసూయ చెందే విధంగా ఒక విజయం తర్వాత మరొక విజయాన్ని సాధిస్తూ పురోగమిస్తున్న ఇస్రో తాజాగా మరొక ఘన విజయాన్నిన సాధించింది. అదే పునర్వినియోగ వాహనమైన పుష్పక్ ప్రయోగం. దీనితో, అంతరిక్షంలో అతితక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను నిలపడం సాధ్యం అవుతుంది.

ప్రతి రంగంలోనూ ఆత్మనిర్భరతను సాధించాలన్న భారతదేశ పట్టుదలను మరింత పటిష్టం చేసే ప్రతిష్ఠాత్మకమైన విజయాన్ని ఇస్రో సాధించింది. దేశ అంతరిక్ష పరిశోధన ప్రయత్నంలో గణనీయమైన పురోగతిని సూచిస్తూ భారతదేశపు మొట్టమొదటతి పునర్వినియోగ ప్రయోగ వాహనం (రీయూజ బుల్ లాంచ్ వెహికల్-ఆర్ఎల్వి) 'పుష్పక్'ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతంగా ప్రయోగించి, పరీక్షించింది. ఇది భారతదేశపు అంతరిక్ష చరిత్రలో ఒక భారీ మైలురాయిగా చెప్పుకోవాలి.

ఇస్రో నిర్వహించినన కచ్చితమైన, ప్రణాళికా బద్ధమైన పరీక్ష అనంతరం 'స్వదేశీ అంతరిక్ష షటిల్'గా నామకరణం చేసిన పుష్పక్, ఎస్యువి పరిమాణ రెక్కలతో కూడిన రాకెట్ కర్ణాటకలోని రన్వేపై దిగింది. వైమానిక దళ హెలికాప్టర్ నుంచి రాకెట్ను దించే పరీక్షలో, అద్భుతమైన, కచ్చితమైన ఫలితాలు వచ్చాయని ఇస్రో వర్గాలు వెల్లడించాయి. వాహనపు రోబోటిక్ ల్యాండింగ్ సామర్థ్యాలను విజయవంతంగా ధృవీకరిస్తూ, అంతరిక్షం నుంచి తిరిగి వచ్చే ఆర్ఎల్వి అత్యధిక వేగంతో ల్యాండింగ్ అయ్యే పద్ధతిని మిషన్ అనుకరించింది.

'పుష్పక్' అని నామకరణం చేసిన రెక్కల వాహనాన్ని భారత వైమానిక దళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా పైకి తీసుకువెళ్లి 4.5కిమీల ఎత్తు నుంచి దానిని విడుదల చేశారు. రన్వే నుంచి 4 కిలోమీటర్ల దూరంలో విడిచిపెట్టిన తర్వాత, పుష్పక్ స్వయంప్రతిపత్తితో క్రాస్ రేంజ్ సవరణలతో రన్వే వద్దకు చేరుకుని, కచ్చితంగా రన్వే బ్రేక్ పారాచూట్ను, ల్యాండింగ్ గేర్ బ్రేకులను, నోస్వీల్ స్టీరింగ్ సిస్టమ్ను ఉపయోగించి తన ల్యాండింగ్ను పూర్తి చేసి నిలిచింది.

సరసమైన ధరలలో అంతరిక్షాన్ని చేరుకోవాలన్న భారతదేశ అన్వేషణలో భాగంగా విజయవంతంగా పుష్పక్ ల్యాండింగ్ చేయడం అన్నది మన శాస్త్రవేత్తల నిబద్ధతకు చిహ్నం. 'పుష్పక్ ప్రయోగ వాహనం అంతరిక్ష వాహనాన్ని అత్యంత అందుబాటు ధరలో ఉంచేందుకు భారతదేశం చేసిన సాహసోపేత ప్రయత్నం' అని వాహన సంభావ్య ప్రభావాన్ని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ నొక్కి చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్ పునర్వినియోగ ప్రయోగ వాహనం. ఇందులో అత్యంత ఖరీదైన భాగం - అన్ని ఎలక్ట్రానిక్లను అమర్చిన పై భాగం. దీనిని అత్యంత సురక్షితంగా భూమిపైకి తీసుకురావడం ద్వారా పునిర్వినియోగపరచదగినదిగా మార్చడం జరిగిందని వివరించారు.

ఒక దశాబ్దకాలం కిందట ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు నిబద్ధతతో ఆర్ఎల్వి ప్రాజెక్టును ప్రారంభించారు. అంతరిక్ష వ్యర్థాలను తగ్గించడం, ఉపగ్రహ విస్తరణ, నిర్వహణలో విప్లవాత్మక మార్పులు చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా పెట్టుకుంది. పునర్నిర్మాణం కోసం కక్ష్య నుంచి ఉపగ్రహాలను తిరిగి స్వాధీన పరచుకొని, మరమ్మత్తులు చేయగల, కక్ష్యలోని ఉపగ్రహాలకు ఇంధనాన్ని నింపగల సామర్థ్యంతో పుష్పక్ స్థిరమైన అంతరిక్ష అన్వేషణ దిశగా గణనీయ మైన పురోగతిని సూచిస్తోందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భారతీయ ఇతిహాసం రామాయణంలో ప్రస్తావించిన 'పుష్పక విమానం' నుంచి ప్రేరణ పొంది ఈ వాహనానికి 'పుష్పక్' అని నామకరణం చేశారు. సంపదకు అధిదేవత అయిన కుబేరుడి అంతరిక్ష వాహనమే పుష్పక విమానం.

ముఖ్యంగా, 2016లో బంగాళాఖాతంలో వర్చువల్ రన్వే ల్యాండింగ్పైన, 2023లో చినూక్ హెలికాప్టర్ నుంచి ఆకాశం నుంచి విడుదల చేసే పరీక్ష సహా గతంలో చేసిన పరీక్షల తర్వాత ఈ విజయవంతమైన ల్యాండింగ్ సాధ్యపడింది.

ఈ మైలురాయి ఘట్టాన్ని పూర్తి చేయడం అన్నది అంతరిక్ష సాంకేతికతలో పెరుగుతున్న భారతదేశ సామర్థ్యాన్ని, సాహసాన్ని, తన అంతరిక్ష అన్వేషణ సామర్థ్యాలను పెంపొందించుకోవడంలో నిబద్ధతను నొక్కి చెబుతుంది. అంతరిక్షశాస్త్ర రంగంలో ఇస్రో పరిధులను దాటి నూతన ఆవిష్కరణలను కొనసాగిస్తున్న క్రమంలో పుష్పక్ను విజయవంతంగా ల్యాండింగ్ చేయడం ద్వారా దేశానికి తక్కువ ఖర్చుతో కూడుకున్న, స్థిరమైన అంతరిక్ష యాత్రల నూతన శకానికి నాంది పలికింది.

భారతదేశ అంతరిక్ష పరిశోధన రోడ్మ్యాప్లో దాని వ్యూహాత్మక ప్రాముఖ్యతను పట్టి చూపుతూ పుష్పక్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టింది. పుష్పక్ విజయవంతమైన ల్యాండింగ్తో ఇస్రో తన సామర్థ్యాలను మరింత మెరుగుపరచుకునని, అంతరిక్ష పరిశోధనలో అగ్రగామిగా తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడం పై దృష్టి పెట్టింది.

\- జాగృతి డెస్క్

# గొంగడి మారకున్నా గో

**జనవరి 31 (2024) న 'గద్దర్ ఫౌండేషన్' హైదరాబాద్ లక్ష గద్దర్ జయంతి సభను నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వచ్చే ఏడాది (2025 సంవత్సరం) నుంచి గద్దర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతుందని ప్రకటించి, తన మాటే జీఓగా భావించవచ్చునని చెప్పారు.**

ఈ నేపథ్యంలో గద్దర్ గూర్చి కొంత నిష్పక్షపాత వైఖరితో మాట్లాడుకోవలసిన అవసరం ఉంది. కొన్ని విషయాలు-అభిప్రాయాలు కొందరికి నచ్చక పోవచ్చు. అంత మాత్రాన సత్యం-నిజం తెరమరుగు కారాదు.

గద్దర్ తన జీవితంలో సింహభాగం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని విశ్వసించలేదు. పైగా పార్లమెంట్ ఒక పందుల దొడ్డి, అసెంబ్లీ ఒక బాతాఖానీ క్లబ్ అంటూ అగౌరవపరుస్తూ, దూషిస్తూ వేలాది వేదికల పై మాట్లాడాడు, పాటలు పాడాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూకటివేళ్లతో పెకలించి నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం మావోయిస్టుల ఆధ్వర్యంలో కదం తొక్కాలని పిలుపునిచ్చాడు. ఆ విప్లవం తుపాకి గొట్టం ద్వారానే సాధ్యమని అందుకే సాయుధంగా తిరగబడమని దశాబ్దాలపాటు ఆయన సాంస్కృతికోద్యమం చేశాడు. తెలుగు నేలపైనే కాక ఇతర ప్రాంతాల్లోను మావోయిస్టులతో కలిసి ప్రచారం చేసిన విషయమూ అందరికీ తెలుసు. దేశమంతా కలియతిరిగి ప్రజాస్వామ్య ప్రక్రియపై నిప్పులు చెరిగాడు.

అంతేగాక మావోయిస్టులతో కలిసి కొంతకాలం అజ్ఞాత జీవితం-గెరిల్లా జీవితం గడిపాడు. వేలాదిమంది యువతీ యువకులను అజ్ఞాత-గెరిల్లా జీవితం గడిపేందుకుగాను అడవుల్లోకి ఆహ్వానించాడు. ఆయనపై గల గురి, నమ్మకంతో అనేకమంది అడవులకు వెళ్లారు. ఇదంతా జగమెరిగిన సత్యం. ఎన్నికైన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు సహచర మావోయిస్టులతో కలిసి ఆయన 'కుట్ర' చేశాడు. ఆయనపై నమోదైన అనేక కేసులు ఇందుకు సాక్ష్యం.



**పుప్పల నరసింహం, 9985781799**
సీనియర్ జర్నలిస్ట్

అలాంటి గద్దర్ మావోయిస్టుల ప్రతినిధిగా గత కాంగ్రెస్ ప్రభుత్వంతో చర్చలు జరిపి మావోలకు ఎంతో మేలు చేకూర్చి వారి బలోపేతానికి అవిశ్రాంతంగా శ్రమించిన వ్యక్తి, కళాకారుడు ఇప్పుడు ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వానికి ఎలా ఆదర్శప్రాయుడవుతాడు? ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరిపేందుకు ఎలా నిశ్చయిస్తుంది? ఇది కోటి రూకల ప్రశ్న. ఆరోగ్యకర ఆలోచనలు చేసే వారికిది ఆశ్చర్యం కలిగించే అంశం.

డా. వై.యస్. రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంతో పీపుల్స్ వార్ (మావోయిస్టు పార్టీ పూర్వ నామం) జరిపిన చర్చలు విఫలమయ్యాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతా అలజడి సృష్టించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని గద్దర్ తీవ్రంగా దూషించిన విషయం విస్మరించరానిది. అంతటి ఘన చరిత్ర గల గద్దర్‌ను వర్తమాన కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకత్వం ఆదర్శంగా భావించడం ఆశ్చర్యకరమే కాదు, ఆందోళన కలిగించేదే.

ఆదర్శం వేరు, అభిమానం వేరు. ఎవరైనా తరతరాలు గుర్తుంచుకోదగ్గ రీతిలో నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించినప్పుడే, తాను బోధించేవి ఆచరించినప్పుడే ఆదర్శప్రాయులనిపించుకుంటారు. ఈ కొలమానంతో చూస్తే గద్దర్ ఎక్కడా నిలవడు. ఆయన జీవనయానాన్ని నిశితంగా పరిశీలిస్తే ఈ విషయాలన్ని స్పష్టమవుతాయి.

కళను విప్లవీకరించి, విప్లవ రాజకీయాలతో మిళితం చేసి మావోయిస్టుల (అప్పటి పీపుల్స్‌వార్)తో ప్రయాణం కొనసాగించినా అక్కడ కూడా అనేక ఆరోపణలతో రెండుసార్లు గద్దర్ బహిష్కరణకు గురైన సంగతి విస్మరించరాదు. ఆయనలోని దురాశ అత్యాశ, క్రమశిక్షణా రాహిత్యానికి తార్కాణమే తీవ్రమైన 'వేటు' అన్న విషయం విప్లవ అభ్యుదయ కాములందరికి తెలుసు.

అనంతరం పార్టీ బహిష్కరణను 'పాజిటివ్' గా భావించేవారిని, ఆయనకు 'విముక్తి' లభించిందని భావించే వారిని, తన అభిమానులను పోగేసి దగ్గరకు తీశాడు. తన పాటకు, మాటకు తిరుగులేదని నిరూపించేందుకు గాను బుల్లెట్ మార్గాన్ని వీడి, బ్యాలెట్ బాటను ఎంచుకున్నాడు. తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్న నినాదాన్ని అటకెక్కించి ఓటు ద్వారా విప్లవం తీసుకొస్తానని, భావ విప్లవం తీసుకొస్తానని సంకల్పం చెప్పుకున్నాడు. ఏకంగా దక్షిణాది రాష్ట్రాలలో ఓట్ల సునామి తీసుకొస్తానని, జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బడుగు బలహీన, దళిత-బహుజనులను ఏకం చేసి సరికొత్తగా లాల్-నీల్ మార్గంలో రాజ్యాధికారాన్ని కైవశం చేసుకుంటామని సదస్సులు-సభలు నిర్వహించాడు. ఆఖరికి 'భారత రాష్ట్రపతి' పదవి కోసం పావులు కదిపిన సంగతి సైతం సకల జనులకు తెలుసు. కానీ ఎక్కడా విజయం సాధించలేదు. ఆఖరికి మునుగోడు శాసనసభ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు కె.ఎ.పాల్ సారథ్యంలోని 'ప్రజాశాంతి పార్టీ'లో చేరాడు. ఎన్నికల్లో పోటీ



చేస్తున్నానని మీడియా ముందు ప్రకటించాడు. చివర దశలో కూడా నామినేషన్ వేయకుండా, కె.ఎ.పాల్‌కు కనిపించకుండా అజ్ఞాతంలోకి జారుకున్నాడు. కొన్నాళ్ళకు 'గద్దర్ ప్రజాపార్టీ' అన్న పేరుతో భారత ఎన్నికల కమిషన్ దగ్గర రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు మీడియా ముందు ప్రకటించాడు. అప్పటివరకు తన నేతృత్వంలోని పార్టీకి రాజీనామా సమర్పించక పోవడంతో తన పార్టీ నుంచి గద్దర్‌ను బహిష్కరించినట్టు పాల్ ప్రకటించాడు. ఆ మేరకు మీడియాలో వార్తలు వచ్చాయి. రకరకాల వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ పరిణామాలు, పద్ధతులు, వ్యవహారాలు, విధానాలు గౌరవప్రదమైనవిగా కనిపిస్తున్నాయా? చివరికి తాను రాజకీయ నాయకుడిగా ప్రకాశించలేకపోయినా తన పుత్రరత్నం సూర్యాన్ని రాజకీయ నాయకుడిగా చేసేందుకు ఆయన పడిన తాపత్రయం, హైరానా ఇంతా అంతా

# ...త్రాలు మారాయి కదా?

కాదు. దీన్ని పరిశీలించిన వారందరు ఆనాడు ముక్కున వేలేసుకున్నవారే.

అలాగే గద్దర్ చేసిన ప్రబోధాలకు, ఆచరణకు, వాటిపట్ల ఆయనకున్న నిబద్ధతను గూర్చి కొన్ని విషయాలు ముచ్చటించుకోవాలి. గద్దర్ సమకాలికుడు, ప్రముఖ కవి గూడ అంజయ్య రాసిన 'ఊరు మనదిరా…ఈ వాడ మనదిరా…' పాట గద్దర్‌కు అపారమైన కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టింది. ఆ పాట రాసిన అంజయ్యకు మాత్రం ఎక్కడా గౌరవం దక్కలేదు. మరి అలాంటి వ్యక్తి



ఆదర్శప్రాయుడు ఎలా అవుతాడు? ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూత లూగించిన మరో కవి అందెశ్రీ. ఆయన రాసిన 'జయ జయ జయహే తెలంగాణ' అన్న గీతం ఇప్పుడు రాష్ట్ర అధికార గీతంగా గౌరవం పొందింది. అలాంటి కవి గాయకుడి సొంత ఆస్తి ఏ మేరకు ఎగబాకింది?… గద్దర్ సొంత ఆస్తి తారాజువ్వలా ఎలా దూసుకుపోయింది?

అంజయ్య, అందెశ్రీ నిస్వార్థంగా, నిజాయితీగా, నిండు హృదయాలతో, నిబద్ధతతో ఉన్నత ప్రమాణాలతో ఉద్యమ సాహిత్యాన్ని సృష్టించి తెలంగాణ నేలను పావనం చేశారు. వారి సాధారణ–సామాన్య జీవితం ఆదర్శమవుతుందా? లేక ఆర్భాటం చేస్తూ ఆటపాటలతో ఆకర్షించి మాయచేసి చెప్పేదానికి, మాయచేసి–చెప్పేదానికి, చేసే దానికి పొంతనలేని రీతిలో జీవితం గడిపిన గద్దర్ ఆదర్శప్రాయుడౌతాడా? ఎవరికి వారే ఆలోచించుకొని సమాధానం చెప్పుకోవాలి.

మతం మత్తుమందు అన్న మార్క్స్, మావోల మాటను భారతదేశంలో బలంగా ప్రచారం చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు ఇచ్చి, హిందూ దేవుళ్లను దూషించి, సత్యసాయిబాబా లాంటి వారిని పరుషంగా విమర్శించిన గద్దర్ తన పార్టీ తనను బహిష్కరించాక 'తత్త్వం' బోధపడి రకరకాల గుళ్లు, గోపురాల చుట్టూ తిరిగాడు. ఇది భక్తి అనుకుందామా?…అవకాశవాదం అనుకుందామా?

ఈ అధ్యాయం తరువాతనే ఆయన తన రాజకీయ 'సెకండ్ ఇన్నింగ్స్' ను ప్రారంభించడం గమనార్హం. పైగా ఇదంతా ప్రజల అభీష్టం మేరకేనని పెద్ద బుకాయింపు. ఇలా అనేక ద్వంద్వ ప్రమాణాలను, దోషాలను తెలివిగా పాటల, చరణాల దరువుల మాటున దాచేశాడు. ప్రజాబాహుళ్య చైతన్యానికి విరుద్ధంగా తిరుగుబాటు, హక్కుల సాధన పోరాటం పేరిట కమ్యూనిజం మావోయిజం పల్లెపల్లెన పరిఢవిల్లాలని పాదాలకు గజ్జెకట్టి నర్తనమాడిన గద్దర్ గత చరిత్రను, హింసాత్మక భావజాలాన్ని అంతా ఎర్రతివాచీ కిందకు తోసేసి ప్రభుత్వం ఇప్పుడు ఆయనను ఆదర్శంగా చిత్రీకరించడం, అధికారికంగా జయంతిని నిర్వహిస్తామనడం, చిత్రంగా–విచిత్రంగా ఉంది. విప్లవ కారులతో మిత్ర వైవిధ్యం కాదు, శత్రు వైవిధ్యం మాత్రమే అని గుర్తుంచుకోవాలి. ప్రజలచే ఎన్నికయిన రాజ్యం వేరు, విప్లవకారులు తిరుగుబాటు తత్త్వం వేరు. విప్లవకారులు ఎప్పుడూ ఎన్నికయిన ప్రభుత్వాలను సాయుధంగా కూల్చేందుకు కుట్ర చేస్తారన్న ఎరుక సైతం పాలకులకు ఉండాలి. అర్ధశతాబ్దానికి పైగా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ వేదికలపై గోచి, గొంగడి ధరించి ప్రజల నుంచి అపార సానుభూతి, ఆర్థిక సాయం పొంది, తన శ్రావ్యమైన గొంతుతో పండిత– పామరులను ఆకర్షించి అందుకు కాంట్రాస్టు (పరస్పర విరుద్ధంగా) గా జీవితం కొనసాగించిన గద్దర్ ఆదర్శప్రాయుడెలా అవుతాడు?

మరోమాట, గద్దర్ రాజకీయ గురువు ప్రముఖ నక్సలైటు నాయకుడు కొండపల్లి సీతారామయ్య. (కొండపల్లి సీతారామిరెడ్డి–కె.ఎస్.) అన్న విషయం ప్రపంచమంతటికి తెలుసు. గద్దర్ ఆట– పాటలోని వాడి వేడి అంతా కె.ఎస్.దే. కొండపల్లి లేనిదే గద్దర్ లేడన్నదీ సత్యమే. కొండపల్లి సీతారామయ్య కృష్ణాజిల్లాకు చెందిన వాడయినప్పటికీ 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సద్దుమణిగాక, 1971–

ఎలాంటి విజ్ఞాపనలు, అభ్యర్థనలు, డిమాండ్ లేకుండానే గద్దర్ జయంతిని వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించినప్పుడు గద్దర్ కన్నా గద్దర్ రాజకీయ గురువు కొండపల్లి అందుకు అర్హుడని అన్ని వివరాలు అందిస్తే, డాక్యుమెంట్లు చూపితే అందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిస్తుందా?… జయంతి, వర్ధంతులను నిర్వహిస్తుందా?…

72 లో తిరిగి ముల్కి–ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. గద్దర్ ప్రజా సాంస్కృతిక రాజకీయ జీవితం అక్కడే అప్పుడే ఆరంభమైంది. కె.ఎస్. కనుసన్నల్లోనే ఆయన రాజకీయ పాఠాలు వల్లెవేశాడు. పాటకు రాజకీయ పరిమళం అద్దాడు. తెలంగాణ ఉద్యమంతో పాటు నక్సలైటు ఉద్యమాన్ని కొండపల్లి సీతారామయ్య 'జమిలి'గా నడిపాడు. ఆ రెండింటిలోను గద్దర్ పాత్ర గణనీయమైనది. నక్సలైటు ఉద్యమం ఉధృతం కావడంతో తెలంగాణ గ్రామాలు, పల్లెలోని దొరలను పట్టణాలకు తరిమి వారి భూములను ప్రజలు స్వాధీనం చేసుకొనే కార్యక్రమానికి కొండపల్లి సీతారామయ్య ముఖ్య కారకుడు.

ఆ రకంగా తెలంగాణలో సామాజిక రాజకీయ చైతన్యానికి కె.ఎస్. కేంద్రబిందువు. తెలంగాణ ప్రజల సాధికారతకు పాటుపడిన నాయకుడు ఆయన. మరణానంతరం కూడా ఆయన ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తోంది. అదో ఆ కొండపల్లి సీతారామయ్య జయంతి, వర్ధంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్న అభ్యర్థన, డిమాండ్ అందితే ముఖ్యమంత్రి– రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తుందా?….

ఎలాంటి విజ్ఞాపనలు, అభ్యర్థనలు, డిమాండ్ లేకుండానే గద్దర్ జయంతిని వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించినప్పుడు గద్దర్ కన్నా గద్దర్ రాజకీయ గురువు కొండపల్లి అందుకు అర్హుడని అన్ని వివరాలు అందిస్తే, డాక్యుమెంట్లు చూపితే అందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిస్తుందా?… జయంతి, వర్ధంతులను నిర్వహిస్తుందా?…

కొసమెరుపు ఏమిటంటే… అరబిక్ భాష నుంచి ఉర్దూలోకి వచ్చిన గద్దర్ అన్న పదానికి నిఘంటువులో అర్థం వెతికితే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ అర్థం స్ఫురించే వ్యక్తి ఆదర్శం ఎలా అవుతాడని అందరూ నిర్ఘాంతపోవడం ఖాయం. ★

ఏప్రిల్ 4 చల్లా సత్యవాణి జన్మదినం



చల్లా సత్యవాణి. 83 సంవత్సరాలు. ఆమె పేరు ముందు రెండు పదాలు. డాక్టర్ (మేజర్). బోధన వృత్తిరీత్యా డాక్టరేట్. ఎన్‌సీసీ ఆఫీసరుగా మేజర్. ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసరుగానూ అనుభవశీలి. హిందీ, రాజనీతిశాస్త్రం, ఫిలాసఫీ అంశాల్లో మాస్టర్ డిగ్రీలు. రాజమండ్రి కళాశాలలో అధ్యాపకురాలిగా, ప్రిన్సిపల్‌గా, డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో నిత్య ఉత్సాహి. ఇప్పటికీ మానసికంగా అంతే ఉత్తేజం.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు నుంచి దాదాపు రెండు దశాబ్దాల క్రితమే స్వర్ణపతక స్వీకారం. అదీ రఘుపతి వెంకటరత్నం నాయుడు పేరిట. స్వస్థలం కోనసీమలోని రాజోలు ప్రాంతం మోరి గ్రామం అయినా, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన రాజమహేంద్రవరంలోనే శాశ్వత నివాసం. ఉంటున్న ఇంటిపేరూ విశిష్టమే 'ప్రణవకుటి.' ప్రణవం అంటే ఓంకారం అని, కుటి అనేది కుటీరానికి రూపాంతరమని తెలుసు. ఇందులో అంతా ఆధ్యాత్మికమే.

# నిత్యసేవల సత్యవాణి

సత్యవాణి రచనా వ్యాసంగం దరిదాపు పాతికేళ్లనాడు మొదలై విస్తరిస్తూ వచ్చింది. ప్రథమంగా – తన పేరు కలిసి వచ్చేలా 'సత్య–వ్యాస కదంబం.' భాగాలుగా వెలువడింది ఆ పుస్తకం. 'ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్ర దర్శిని' అటు తర్వాతిది.

జ్యోతి స్వరూపుడు మహేశుడు. మన దేశాన నాలుగువైపులా జ్యోతిర్లింగాలు ఉన్నాయి. రామేశ్వర, సోమనాథ, నాగేశ్వర, మహాకాళేశ్వర, త్రయంబ కేశ్వర, మరెన్నో. అన్నీ శివతేజస్సులు. ద్వాదశ ఆదిత్య ప్రతీకలు. మల్లికార్జున, ఓంకారేశ్వర, వైద్యనాథ, కేదారేశ్వర, భీమశంకర, విశ్వేశ్వర,ఘృష్ణేశ్వర... వేటి ప్రత్యేకత వాటికి ఉంది. అనంత శివతత్వం. అన్నింటినీ సమగ్రంగా పుస్తకీకరించారు సత్యవాణి. అనంతరం ఏడాదికే గోదావరి పుష్కర దర్శిని, అదే సంవత్సరం నవజనార్దన క్షేత్రదర్శిని వెలువడ్డాయి. తదుపరి కాలంలో పంచారామ క్షేత్రదర్శిని.

నవజనార్దన, పంచారామ క్షేత్రాల దర్శినులతో భక్తజనుల పర్యటనలు విస్తృతమయ్యాయి. ఎంతగా అంటే అప్పట్లో రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక యాత్రా ప్రణాళికలు అమలు చేసేంతగా! బస్సు ప్రయాణికు లందరికీ క్షేత్ర దర్శన పుస్తకాలు అందేలా చేశారీమె. వీటివల్ల అనిర్వచనీయ అనుభూతి తన సొంత మైందని ఈనాటికీ చెప్తూనే ఉంటారు.

ద్వాదశ నారసింహ క్షేత్రదర్శిని వెలువడి ఇప్పటికి పదహారేళ్లు. 'నృసింహ ద్వాదశ నామ స్తోత్రం' గుర్తొస్తోంది కదూ!

**'స్వభక్త పక్షపాతేన తద్విపక్ష విదారణమ్**
**నృసింహ మద్భుతం వందే పరమానంద విగ్రహమ్'**
**ఇది ముందుగా ధ్యానం.**
**హిమాలయ క్షేత్రదర్శిని సైతం సత్యవాణి విరచితమే.**

మరి అష్టమూర్తి శివక్షేత్ర దర్శినికి సంబంధించి –సదాశివుడి రూపాలు ఎనిమిది. సూర్యచంద్రులు, పంచభూతాలతోపాటు జీవుడిలో.. ఈశానుడు, మహదేవుడు, శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి. ఇలా....

ఇక, తిరుమల–తిరుపతి శ్రీ వేంకటేశ్వర యాత్రాదర్శిని. సుప్రభాతం కనువిందుగా, వీనులవిందుగా వర్ధిల్లుతోంది.

**శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి**
**నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి ముఖ్యాం**
**ఆఖ్యాం త్వదీయ వసతేరనిశం వదంతి**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతం**
**శ్రీ పద్మనాభ పురుషోత్తమ వాసుదేవ**
**వైకుంఠ మాధవ జనార్దన చక్రపాణే**
**శ్రీవత్స చిహ్న శరణాగత పారిజాత...**

తలచుకుంటేనే మది ఆనంద తరంగితం అవుతుంది. ఇంతటి అనుభూతినీ సత్యవాణి పుస్తకాలు భక్తజనులకు అందించాయి, నేటికీ అందిస్తూనే ఉన్నాయి.

గోదావరి, కృష్ణ.... ఈ రెండు నదుల పరీవాహక క్షేత్రాలు, ఆలయాల గురించీ ఏనాడో రచనలు చేశారీ విద్వన్మణి.

**ఇందులో ఎంతగా తన్మయులయ్యారంటే**

తను రాసిన మరో పుస్తకం పేరు –'శ్రీపర్వత వర్ధనీ సమేత ఉమా రామలింగేశ్వర పంచాయతన ఆలయం. శ్రీపద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామివార్ల క్షేత్ర మహాత్మ్యం.

అంతేకాకుండా, శ్రీ మహావిష్ణు ఏకాదశ దివ్యక్షేత్రాలు, విష్ణు ఆలయాల, సప్త మోక్షపుర యాత్రాదర్శినులనూ అక్షరబద్ధం చేశారు. వీటితోపాటు వినాయక వైభవం, గణపతి ఆలయాల చరిత్రను అక్షరీకరించారు. సుబ్రహ్మణేశ్వర, సీతారామాంజనేయ దేవాలయాల విశేషాంశాలనూ పుస్తక రూపాల్లోకి తెచ్చారు.

'మాఊరి గుళ్లు–తరలి వచ్చిన దేవుళ్లు' అనే పుస్తకం ప్రాంతీయంగా అపార పాఠకాదరణ పొందింది.'అంతా దైవ అనుగ్రహ బలం' అంటారు ఎప్పుడూ.

స్థలచరిత్ర వివరాల్ని రాయడమే కాదు, వాటి సందర్శన సమాచారాన్నీ విపులీకరించడం సత్యవాణికి మరింత పేరు తెచ్చిపెట్టింది.ఆలయాలు ఎక్కడ ఉన్నా, అవి ఏ ప్రాంతాన ఉన్నా ఆమె వెళ్లి

అంతటి శక్తి ఉన్నందునే, ఇప్పటికే నాలుగు పదుల సంఖ్యలో అధ్యాత్మిక పుస్తకాలు రాశారు సత్యవాణి. వీటిల్లో చాలామటుకు సందర్శించి తెలుసుకున్నవే. అనేకం నదీ తీర ప్రాంతాలు.
నర్మద నదీ పుష్కరాలు మే ఒకటిన మొదలై పన్నెండున ముగుస్తాయి. ఇదే సందర్భంలో ఆ పుస్తక రచన, ప్రచురణ ప్రక్రియల్లో నిమగ్నులయ్యారీమె. ధార్మిక, తత్వచింతన కలిగిన యాత్రికులతో సహ అందరికీ సమాచారం అందించాలని ఇప్పటి ప్రయత్నం. ఇప్పటిదాకా రచించిన పుస్తకాలను వితరణ చేయడమే సహజ స్వభావం. మే ఉత్సవాలకీ ఇదే విధానం కొనసాగిస్తానంటున్న ఈ మహిళామణి ఉత్సాహం చూస్తుంటే... వయసు 83 అనిపించదు. ఏ 38 సంవత్సరాలోను అనిపిస్తుంది!




**జంధ్యాల శరత్‌బాబు**

**సీనియర్ జర్నలిస్ట్**


తీరాల్సిందే! వెళ్లి చూసిన సమస్త వివరాలనీ గ్రంథస్తం చేయాల్సిందే! ఆ గ్రంథాలన్నింటినీ ఉచితంగా అందించాల్సిందే అందరికీ!

పుస్తక ప్రచురణ ఎంత కష్టమో అందరికీ తెలిసిందే.వ్యయ ప్రయాసలన్నింటినీ ఆనందంగా భరించి పుస్తక వితరణను అనేక సంవత్సరాలుగా నిరంత రాయంగా మహోద్యమంగా సాగిస్తూ వస్తున్నారు.

మొదటి నుంచీ వనితాస్ఫూర్తి ఎవరంటే, దుర్గాబాయి దేశముఖ్ పేరు చెప్తుంటారు. ఆ స్ఫూర్తి ప్రదాతలోని నిత్యచైతన్య తత్వమే తనను ఆకట్టుకుందని అంటుంటారు.

సప్తమోక్షపురాల గురించి మీరూ విన్నారు కదూ!

**1. అయోధ్య 2. మధుర, 3. మాయ.**

**4. కాశి 5. కంచి, 6. అవంతిక, 7. ద్వారవతి.**

అత్యంత పురాతన క్షేత్రాలు ఇవన్నీ. అన్నీ చక్రపూరితాలు. అవి : సహస్రాకార, ఆజ్ఞ, విశుద్ధ, అనాహత, మణిపూరక, మూలాధార చక్ర సమన్వితాలు.

అయోధ్య అనగానే రామదర్శనం, వీక్షణ భాగ్యం.'నా మది నిండా రాముని రూపమే

**అక్షర, స్వర, పదార్చన రామనామమే!'**
**ఆలాపన, ఆరాధన, ఆత్మీయగానం**
**అయోధ్య రామునికే, ఆనందధామునికే!**
**అనునిత్యం తలవాలి ఆ రాముని నామం**
**అనుక్షణం చూడాలి శ్రీరామ స్వరూపం!'..**

అని తలపులోనికి వచ్చి భక్తి భావం అంతటా నిండుతుంది. అటువంటి తాదాత్మ్యం పుస్తక ప్రదానంతో కలుగుతుందంటారు చల్లా సత్యవాణి. అష్ట సోమేశ్వర క్షేత్ర ప్రత్యేకతలనీ ఆ రోజుల్లోనే విశదీకరించిన భక్తితత్పర.

చంద్ర ప్రతిష్ఠిత లింగరూపాలు ఎనిమిది. అవి: కోలంక, వెంటూరు, కోటిపల్లి, వెల్ల, కోరుమిల్లి, సోమేశ్వరం, పెనుమాళ్ల.

అష్టసోమేశ్వరాలతో దాక్షారామాన్ని కలిపితే నవలింగాలు. వాటి దర్శనం పుణ్యప్రదమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ధార్మికతతోపాటే క్రమశిక్షణాయుత జీవన సరళినీ ప్రబోధించారీ నారీరత్నం. ఇందులో ఒక భాగంగా నేషనల్ కేడెట్స్ గురించిన ఆంగ్ల పుస్తకాన్నీ వెలయించారు.

ఈ కార్ప్స్ అనేది భారత సాయుధ దళాల యువవిభాగం. యువతుల విభాగం 1949లోనే ఏర్పాటైంది. ఇదే ఎన్‌సీసీ నినాదం 'కర్తవ్యం... జ్ఞానం' ఇదే మాదిరిగా – ఐక్యత, క్రమశిక్షణ.

మేజర్ బాధ్యత వహించిన సత్యవాణి పలు కార్యక్రమాలను చేపట్టారు. నినాద అంశాలన్నింటినీ ఆచరించి, యువతతో ఆచరింపజేసి, తనదైన ముద్రవేశారు.

ప్రాంతీయతను ధార్మికతతో మేళవించిన కారణంగా, త్రిలింగ క్షేత్రాలనీ అక్షర రూపాలతో పొందుపరిచారు. ప్రామాణిక సమాచారమున్న ఆంధ్ర కౌముది కావ్యాన్ని ఉదహరించారు. ఇది గణపవరపు వేంకటపతి కవి విరచితం. ప్రబంధ రాజవిజయ వేంకటేశ్వర విలాసము, ఆంధ్ర ద్విరూప కోశము వంటి గ్రంథాల కర్త.

'కౌముది' వ్యాకరణ గ్రంథంలో త్రిలింగక్షేత్ర ప్రస్తావనలున్నాయి.

1. కాళేశ్వరం
2. భీమేశ్వరం,
3. శ్రీశైలం.

వీటన్నింటినీ విశేషించి విస్తరించి రాశారు ఈ రచయిత్రి. భారత జాతీయ సమైక్యతను ప్రస్ఫుటపరచే చైతన్య తరంగాలుగా మహా మహేశ్వర క్షేత్రాలను అభివర్ణించారు.

ఫలశ్రుతి ఇదీ;

**ఐతిహ్యంబనురక్త శంకర**
**ముదాత్తలోక మీ ద్వాదశ**
**జ్యోతిర్లింగ మహామహేశ్వర**
**వరస్తోత్రం; బెవండేనియున్**
**భ్రాంతస్సంధ్యల యందు**
**దీని జదువన్ ప్రాప్తించు తద్ ద్వాదశ**
**జ్యోతిర్మూర్తుల గన్న పుణ్యము;**
**లభించున్ స్వామి కారుణ్యమున్!**

ఇవే జ్యోతిర్లింగాలను శంకర భగవత్పాదులు దర్శించడం విదితమే. సంస్తుతి అందించడమూ తెలిసిందే. తిరుమలేశుని గురించి రచించినపుడు తన హృదయంలో కలిగిన భావాలను పద్యరూపాన ఆవిష్కరించారు. శ్రీనివాస ఉదాహరణాన్ని ప్రస్తావించారు సత్యవాణి.

**'ఆపద మొక్కుల ఆశ్రిత బంధూ**
**కాపాడంగదె కరుణాసింధూ!**
**ఆలింపుము మొర ఆది వరాహా**
**పాలింపుము ప్రియభక్త సమూహా!**
**ఆదుకొనవయా ఆనందమయా**
**చేదుకొనవయా శ్రితముని నిచయా!**
**నిస్తుల దీక్షా! కౌస్తుభ వక్షా!**
**త్రిజగన్మోహన, ద్విజరాడ్వాహన**
**అరిజన మర్దన, శరణు జనార్దన**
**పంకజ నయనా! వేంకటరమణా!'**

భక్తితత్వాన్ని, సేవానిరతిని, నిరంతర తత్పరతను తనదిగా చేసుకున్న ఈ రచయిత్రి వినమ్రతకు మారుపేరు. విశ్రాంత జీవనం సాగిస్తున్న తనలో ఆలోచన తరంగాలు అనేకం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం తెలిసిన సత్యవాణి....

**'శాంతపావన శ్రీమదనంత శయన**
**పద్మనాభ ప్రభు ప్రభా ప్రాభవములు**
**శ్రీ జగన్మాత దివ్య నీరాజనములు**
**నవనవశ్రీలు చిందు నా రచనయందు'**

అని 'శుభకాంక్ష' వ్యక్తపరుస్తూనే ఉన్నారు నేటికీ. ప్రతిభను సేవతో మిళితం చేసిన విలక్షణ వ్యక్తిత్వం ఆమెది. అక్షరాభివందనం. ★



# ఉచితాలే ఓట్లు రాల్చే

**కేంద్ర, రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఉచితాల పేరుతో ఇస్తున్న హామీలను అమలు చేయటం సాధ్యమేనా? రాష్ట్ర ఖజానాపైన పడే వేల కోట్ల భారాన్ని భరించగలమా? బడ్జెట్ అందుకు అనుమతిస్తుందా? అని ఏ పార్టీ ఆలోచిస్తున్నట్టు కనిపించడం లేదు. హామీలు గుప్పిస్తూ ఓటర్ల పైన మత్తుమందు చల్లుతున్నాయి. ఎన్నికల్లో గెలవటం, అధికారాన్ని అందుకోవటమే పరమావధిగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో అందరికంటే ఒక అడుగు ముందే ఉంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోనే అందుకు రుజువు.**

దేశవ్యాప్తంగా మోదీ ప్రభంజనాన్ని తట్టుకోలేక సార్వత్రిక ఎన్నికల్లో తన ఉనికిని చాటుకునేందుకు కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కొత్త హామీలకు తెరతీసింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో పార్టీ విజయానికి ఈ తాయిలాలే దోహదం చేశాయని, వాటి సంఖ్యను మరింత పెంచి లబ్ధి పొందాలని చూస్తోంది. పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారంటీ పేరుతో కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకటించింది. ఇందులో 'నారీ న్యాయ్' విభాగం కింద.. ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయల అందచేస్తామని ప్రకటించింది. "పెహ్లీ నౌక్రీ పక్కీ" కింద, చదువుకున్న యువకులందరికీ సంవత్సరానికి రూ. 1 లక్ష లేదా నెలకు రూ. 8,500 చొప్పున ఒక సంవత్సరం వేతనంతో కూడిన అప్రెంటిస్‌షిప్‌ను వాగ్దానం చేసింది. వీటితో పాటు 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, రూ. 5వేల కోట్ల జాతీయ నిధి ఏర్పాటు చేసి స్టార్టప్‌లు ఏర్పాటు చేసే యువ పారిశ్రామికవేత్తలకు జిల్లాల వారీగా సాయం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్, కార్మికులకు సంపూర్ణంగా ఉచిత వైద్యం, ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.400 ఆర్థిక సాయం, వాళ్లకు జీవితబీమా, ప్రమాదబీమా ఇలా లెక్కలేనన్ని హామీలను గుప్పించింది. ఆర్‌బీఐ చేసిన హెచ్చరికలను కూడా పెడచెవిన పెట్టి, దేశవ్యాప్తంగా పాత పెన్షన్ స్కీమ్ అమలు చేస్తామన్న కీలకమైన వాగ్దానం చేసింది. ఈ హామీలను అమలు చేయటానికి రాష్ట్ర బడ్జెట్ అనుమతిస్తుందా అన్న అంశాన్ని పట్టించుకోకుండా ఇలా లెక్కకు మిక్కిలిగా హామీలు ఇవ్వటంలో హేతుబద్ధతను పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు ద్రవ్యలోటు లక్ష్యాలను అందుకోవటానికి కేంద్రం సతమతమవుతుంటే, దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయకుండా ఈ తీరుగా హామీలు ఇచ్చుకుంటూ పోవటం అనేది గుదిబండగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి కుటుంబంలో మహిళకు ఏడాదికి లక్షరూపాయల సాయం చేయటం అనేది ఓటర్లను మభ్య పెట్టటమే అని అభిప్రాయ పడుతున్నారు. (2023లో భారతీయ మహిళల జనాభా 691 మిలియన్లు).




**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్


**ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలు**

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో.. మహిళల్లో కుటుంబ పెద్దకు ఏడాదికి రూ. 10వేల ఆర్థిక సాయం, రూ. 500కి వంట గ్యాస్ సిలిండర్, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందేవారికి లాప్‌టాప్ లేదా ట్యాబ్లెట్, ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా కుటుంబానికి రూ. 15లక్షల వరకూ బీమా.

మధ్యప్రదేశ్‌లో.. రూ. 2లక్షల వరకూ రైతు రుణమాఫీ, నారీ సమ్మాన్ యోజన కింద మహిళకు రూ.1500 అలవెన్స్, రూ.500కి ఎల్పీజీ గ్యాస్ సిలిండర్, ప్రజలందరికి ఉచితంగా రూ. 25లక్షల బీమా.

ఛత్తీస్ గఢ్.. క్వింటాల్‌కి 3,200 వంతున ధాన్యం సేకరణ, కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య, రైతులకు రూ.500 వరకూ ఎల్పీజీ సబ్సిడీ, రైతులకు రుణమాఫీ.

తెలంగాణ.. మహిళలకు ఉచితంగా ప్రజా రవాణా, రూ.500కే వంట గ్యాసు, 200 యూనిట్లవరకూ ఉచిత విద్యుత్తు, అర్హులకు రూ. 4 వేల పెన్షన్, రూ.10 లక్షల వరకూ ఉచిత బీమా.

కర్ణాటకలో.. అన్ని కుటుంబాల్లో మహిళా పెద్దకు నెలకు రూ.2వేల ఆర్థిక సాయం (గృహలక్ష్మి), 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు (గృహజ్యోతి), గ్రాడ్యుయేట్ యువకులకు నెలకు 3వేలు, డిప్లమో హోల్డర్లకురూ. 1500 వంతున ఆర్థిక సాయం (యువనిధి), నెలకు ప్రతి వ్యక్తికి 10 కేజీల వంతున బియ్యం, మహిళలకు ఉచిత ప్రజారవాణా (శక్తి). ఇందులో ఎన్ని అమలవుతున్నాయో గమనిస్తే వీటిలో డొల్లతనం స్పష్టమవుతుంది.

పైగా ఇన్ని హామీలిచ్చినా ఒక్క కర్ణాటక, తెలంగాణలలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన విషయాన్ని మనం ఇక్కడ గమనించాలి.

**గతంలోకి వెళితే..**

ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టటానికి పార్టీలు 'ఉచితాల'ను ప్రకటించటం కొత్తకాదు. మొన్ననే ముగిసిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో చూశాం. తమిళనాడులో డీఎంకే, ఎఐడీఎంకె పార్టీలు అధికారం చేజిక్కించుకోవటానికి పోటాపోటీగా ఓటర్లకు హామీలు గుప్పించటంతో ఈ ఉచితాల సంస్కృతి ప్రబలిందని చెప్పాలి. మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఉచిత చీరలు, ప్రెజర్ కుక్కర్లు, వాషింగ్ మెషిన్లు, కలర్ టీవీలు, వీటితో పాటు మహిళలకు 8 గ్రాముల బంగారు తాళిబొట్లను ఎన్నికల తాయిలాలుగా ప్రకటించారు. ఆ తర్వాత ఇతర రాజకీయ పార్టీలు దానిని అనుసరించాయి. 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉచిత విద్య, ఆరోగ్యం, విద్యుత్తు, తాగునీరు, ఉచిత బస్ రవాణా హామీలతో అధికారాన్ని చేజిక్కించుకుంది. ఉచిత విద్య, ఆరోగ్యం అనేవి సంక్షేమ చర్యలుగా అందరి ప్రశంసలను అందుకున్నా, ఉచిత విద్యుత్తు, తాగునీరు విషయానికొచ్చేసరికి భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

ఆ తర్వాత పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెలిస్తే 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు రూ. వెయ్యి వంతున నగదు ఇస్తామన్న హామీతో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారాన్ని దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, అకాలీదళ్ పార్టీలు, బీజేపీలు సోదిలో లేకుండా పోయాయి. రూ. 2.82లక్షల కోట్ల అప్పుల భారంతో కునారిల్లుతున్న పంజాబ్ రాష్ట్రంలో ఈ హామీలను ఎలా అమలుచేస్తారు? పంజాబ్ ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన భగవంత్ మాన్ ప్రధాని నరేంద్రమోదీని కలిసిన తొలిసమావేశంలోనే, రాష్ట్రాన్ని ఆర్థిక భారం నుంచి గట్టెక్కించటానికి తమకు రూ. 50వేల కోట్ల ప్యాకేజీని అందించమని కోరటం కొసమెరుపు. 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఉచితాల ప్రభావం స్పష్టం కనిపించింది. లోకసభ ఎన్నికల్లో దారుణమైన ఫలితాలను చవిచూసిన అనంతరం అధికార ఎల్డీఎఫ్ పార్టీ సబ్సిడీ

# తాయిలాలు




బియ్యం, ఫుడ్ కిట్స్ తదితర ఎన్నికల హామీలతో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది.

ఆయా రాష్ట్రాలు అమలుచేస్తున్న ఉచితాల వల్ల ఆర్థికరంగంపైన కలిగిస్తున్న దుష్ఫలితాలను కొందరు ఉన్నతాధికారులు ప్రధాని మోదీ దృష్టికి తీసికెళ్లారు. ప్రధానంగా ఓటర్లకు ఉచితంగా విద్యుత్తును అందించటం వల్ల ఖజానా పై పడే భారాన్ని, అలాగే కీలకంగా భావించే సామాజికరంగాలు ఆరోగ్యం, విద్యలకు బడ్జెట్ కేటాయించటం కష్టంఅని వివరించారు. ఎన్నికల కమిషన్ కూడా దీనిపైన ప్రత్యేక దృష్టిని కేటాయించాలని కోరారు.

దాంతో ప్రధాని మోదీ సబ్సిడీలు, ఫ్రీబీలు, రేవ్డీలు.. ఇలా ఏ పేరుతో పిలిచినా ఈ 'ఉచితాల'పైన జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఉచిత విద్యుత్ వంటివి కాకుండా ప్రయివేటు వస్తువులను ప్రభుత్వం అందించే విధానాన్ని (న్యూవెల్ఫేరిజం మోడల్)మోదీ ప్రభుత్వం అనురిస్తుంది. సంపన్నమైన వ్యాపార సంస్కృతి ఉన్న గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా మోదీ అనుసరించిన విధానాలు భిన్నమైనవి. సంక్షేమంపైన కాకుండా రాష్ట్రంలోకి పెట్టుబడులను రప్పించి వ్యాపారం సాగించటంపైన దృష్టిపెట్టారు. హిమాచల ప్రదేశ్, కర్ణాటకల్లో పార్టీకి దారుణమైన ఫలితాలు ఎదురయ్యాయి. ప్రధానంగా కర్ణాటకలో ఓటమిని బీజేపీ జీర్ణించుకోలేకపోయింది. బసవరాజు బొమ్మై ప్రభుత్వాన్ని గద్దెదించటానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకర్షించాయి. ప్రధానంగా ఉచిత విద్యుత్తు, ఉచిత రేషన్, మహిళలకు, యువకులకు ఆర్థిక సాయం వంటి అంశాలను వాటి అమలులో సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా ఓటర్లు అధికారాన్ని కట్టబెట్టారు. ప్రజల సంక్షేమంపైన పూర్తిస్థాయిలో దృష్టి పెడతామని పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించి ఇతర పార్టీలను నిలువరించింది. ప్రధానంగా మధ్యప్రదేశ్ ఎన్నికల్లో, కనీస మద్దతు ధర ధాన్యానికి రూ. 3,100, గోధుమకు రూ. 2,700 ఇస్తానని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రకటించిన రూ. 400, రూ. 100కి దీటుగా ఈ హామీని ఇచ్చింది. దాంతోపాటు కాంగ్రెస్ ప్రకటించిన వివాహితకు నెలకు రూ. 1500 వంతున ఇచ్చే నారీ సమ్మాన్ యోజనకు దీటుగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లాడ్లీ బెహానా స్కీం మొత్తాన్ని రూ. 1000 నుంచి రూ. 1500కు పెంచుతామని, త్వరలో దానిని రూ. 3వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. డిసెంబరు ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విజయం సాధించి బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది. కేంద్ర ప్రభుత్వం ఉచిత ఆహార ధాన్యాల సబ్సిడీ పథకాన్ని మరో ఐదేళ్ల పాటు కొనసాగించటానికి సిద్ధమైంది. ఇందుకోసం 11.8 లక్షల కోట్లను కేటాయించింది.

**ఉచితాలు మంచివేనా?**

ఏదైనా ఉచితంగా లభిస్తే ప్రజలు సోమరులవు తారని వారిలో ఉత్పత్తి సామర్థ్యం సన్నగిల్లుతుందనే అభిప్రాయాలున్నాయి. ఇది ఆర్థికరంగంపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం ఉంది. ఆర్థికరంగంపైన, రాజకీయ వ్యవస్థలపైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుందని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. స్వల్పకాలిక ప్రభావాలను గురించి చెప్పాలంటే, నగదు బదిలీ, సబ్సిడీ వస్తువులు, సేవలను అందించటంవల్ల ఆయా వస్తువుల వినియోగం అధికం అవుతుంది. తమకు అదనంగా లభించే డబ్బుతో కొనుగోళ్లు పెంచటంతో స్వల్ప కాలంలో ఆర్థికకార్యకలాపాలు ఊపందుకుంటాయి. ప్రజల్లో ఆత్మ విశ్వాసం, సెంటిమెంట్ మెరుగు పడుతుంది. వినియోగదారులు డబ్బు ఖర్చు పెట్టటం, ఆర్థికాభివృద్ధి సాధ్యపడతాయి. ఉచితాల స్వభావాన్ని బట్టి, కొన్ని పరిశ్రమలు లేదా కొన్ని విభాగాల్లో డిమాండ్ అధికం అవుతుంది. దీని వల్ల ఆర్థిక మార్పు సాధ్యం అవుతుంది.

ఈ ఉచితాలు దీర్ఘకాలిక ప్రభావాలను కూడా చూపిస్తాయి. వాటి అమలును కొనసాగిస్తే ప్రభుత్వానికి వ్యయభారం పెరుగుతుంది. దాన్ని సక్రమంగా నిర్వహించకపోతే, బడ్జెట్లో సవాళ్లకు, ఆర్థిక లోటుకు కారణమవుతుంది. అలాగే ప్రజలు ఉచితాలకు అలవాటు పడతారు. శ్రమపడటం అనేది మాయం అవుతుంది. స్వావలంబన, వ్యవస్థాపకత తగ్గుముఖం పడతాయి. తాత్కాలిక ఎన్నికల విజయాల కోసం ప్రభుత్వం ఉచితాలను అమలు చేస్తూ పోతే దీర్ఘకాలికమైన అభివృద్ధి మందగిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా అస్థిరతకు గురవుతాయి.

విద్య, ఆరోగ్యం వంటివి ఉచితంగా అందించటం వల్ల పేదలు రాణించ టానికి, ఇతరులతో సమానంగా అవకాశాలు పొందటానికి అవకాశం లభిస్తుంది. నార్వే, డెన్మార్క్, జర్మనీ, స్వీడన్ లాంటి అభివృద్ధి దేశాలలో విద్య ఉచితంగా లభిస్తుందన్న విషయాన్ని మనం విస్మరించలేం. విద్య వల్ల లభించే




ఈ ఉచితాలు దీర్ఘకాలిక ప్రభావాలను కూడా చూపిస్తాయి. వాటి అమలును కొనసాగిస్తే ప్రభుత్వానికి వ్యయభారం పెరుగుతుంది. దాన్ని సక్రమంగా నిర్వహించకపోతే, బడ్జెట్లో సవాళ్లకు, ఆర్థిక లోటుకు కారణమవుతుంది. అలాగే ప్రజలు ఉచితాలకు అలవాటు పడతారు. శ్రమ పడటం అనేది మాయం అవుతుంది. స్వావ లంబన, వ్యవస్థాపకత తగ్గుముఖం పడతాయి.

ప్రయోజనాలు బహుముఖంగా ఉంటాయి. ఇక ఆరోగ్యం.. బస్తీ దవాఖానాలు ఇబ్బడి ముబ్బడిగా పెరగటం, పీహెచ్ సీలో వసతులు మెరుగుపరచటం వల్ల ఎక్కువ ప్రయోజం కలుగుతుంది.

ఉచితంగా తాగునీరు.. తాగునీరు ఉచితంగా లభించటం వల్ల విచ్చలవిడి వినియోగం, దుబారా పెరుగుతాయి. తాగునీటి వినియోగంపైన పరిమితిని విధించటంతో పాటు భూగర్భజలాలను వృద్ధి చేయటంపైన దృష్టి సారించవలసి ఉంది. ఉచిత విద్యుత్తు అందించటం వల్ల ప్రభుత్వాలపై సబ్సిడీ పెరిగి, అది రాష్ట్రబడ్జెట్ పైన తీవ్రమైన ప్రభావం చూపటం మనకు తెలుసు.

2006లో బీహార్‌లో నితీష్ ప్రభుత్వం విద్యార్థినులకు సైకిళ్లను అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే పథకాన్ని 2008లో ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం, 2011లో పశ్చిమ బెంగాల్లోని సీపీఐ ప్రభుత్వం అమలు చేశాయి. బాలికలకు సైకిళ్లను అందచేయటం వల్ల బీహార్‌లో డ్రాపౌట్ల శాతం తగ్గుముఖం పట్టిందని ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది. ఉచితంగా సైకిళ్ల వరకూ మంచిదే. స్కూటర్ ఇవ్వటం అనేది ప్రాథమిక అవసరం కిందకు రాదు. అది విలాసం. అలాగే అసోంలో 2010-15 మధ్య మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. 4,656మంది మహిళల స్వావలం బనకు, స్వయంఉపాధికి దోహదం చేసింది. ఢిల్లీలో యోగశాలలు, సీనియర్ సిటిజన్లకు తీర్థయాత్ర వంటివి ఉపయుక్తమే, ఆరోగ్యకరమైన కార్యక్రమమే. కానీ ఆర్థికంగా స్థిరత్వం ఉన్న రాష్ట్రాలు ఇలాంటివి అమలు చేయవచ్చు తప్ప బీహార్ లాంటి రాష్ట్రాలకు దానివల్ల తలబొప్పి కడుతుంది. మహిళలకు ఉచితంగా బస్సు రవాణా సౌకర్యం కల్పించటం వల్ల ఉత్పత్తిలో వారి భాగస్వామ్యం పెరిగిందని చెబుతున్నారు.

**ఆయా రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను పరిశీలిస్తే..**

జీడీపీలో 5.9శాతం ద్రవ్యలోటు ఉండాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించు కుంది. ద్రవ్యలోటు లక్ష్యాన్ని అంటిపెట్టుకోవటానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు ఉచితాలు గండికొడతాయని ఆర్థిక రంగ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన12 నుంచి 18 నెలల తర్వాత గానీ ఆర్థిక రంగం పై ప్రభావం తెలుసుకోవటం సాధ్యం కాదని అంటున్నారు. 2024 ఆర్థికసంవత్సరంలో 11 రాష్ట్రాలు బడ్జెట్ అంచనాల దశ (బీఈ) లోనే ద్రవ్యలోటును కలిగి ఉన్నాయి.

- నగదు బదిలీని ఐదు రాష్ట్రాలు అమలు చేస్తుండగా, మధ్యప్రదేశ్ మినహా అన్ని రాష్ట్రాలు 2024 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును చూపిస్తున్నాయి. 2023-24లో బడ్జెట్ అంచనాలు చూస్తే కర్ణాటకలో గృహలక్ష్మికి రూ. 17,500 కోట్లు, మధ్య ప్రదేశ్ లో ముఖ్యమంత్రి లాడ్లీ బహ్నాయోజన అమలుకు రూ. 7,850 కోట్లు, తమిళనాడు కలైంగర్ మగలిర్ ఊర్మాయి తొగైకి ఏడు వేల కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ. 12 వేల కోట్లు గా ఉంది.



- రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చులో ఎక్కువ భాగాన్ని ఉచిత విద్యుత్తుకు, సబ్సిడీలకు వెచ్చిస్తున్నారు.
- 2023 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వ్యయంలో 83 శాతం రెవెన్యూ కాగా, మిగిలింది మూలధన పెట్టుబడి వ్యయం.
- 53శాతం రెవిన్యూ రసీదులు వడ్డీలు, పెన్షన్లు, వేతనాలపైన ఉంటుంది. ఇందులో 28శాతం వేతనాలు, 13 శాతం పెన్షన్లు, 12శాతం వడ్డీరేట్లుకు ఖర్చు చేస్తారు.

**పాత పెన్షన్ విధానంతో చిక్కులు**

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రముఖ వాగ్దానాల పేరుతో పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్రాలు అమలు చేయవద్దని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రాలు తమ స్థాయిలో ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని కోరింది. ఆదాయ పెంపును పక్కనబెట్టి అదనపు భారం మోపే పథకాల వైపు మళ్లటం సరికాదని పేర్కొంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన "స్టేట్ ఫైనాన్స్ ఎ స్టడీ ఆఫ్ బడ్జెట్స్ ఆఫ్ 2023-24" నివేదికలో పాత పెన్షన్ విధానం అమలుపై కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే, వాటి ఆర్థిక లోటు ఎన్‌పీఎస్‌తో పోలిస్తే 4.5 రెట్లు పెరుగు తుందని ఆందోళన వ్యక్తం చేసింది. పాత పెన్షన్ స్కీమ్ ఖర్చుల అదనపు భారం 2060 నాటికి జీడీపీలో 0.9 శాతానికి పెరుగుతుందని పేర్కొంది. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం ఓపీఎస్ చివరి బ్యాచ్ 2040 ప్రారంభంలో పదవీ విరమణ చేస్తారు. వారు స్కీమ్ కింద 2060 వరకు పెన్షన్‌ను అందుకుంటా రని పేర్కొంది. కేంద్ర యూనియన్ బడ్జెట్ 2023-24లో భాగంగా, ఆర్థిక శాఖ కార్యదర్శి టి.ఎస్. సోమనాథన్ నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానం అమలుపై అధ్యయనం చేయటానికి నియమించిన విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి.

**సుప్రీంకోర్టులో..**

ఓటర్లను ఇలా ఉచితాలతో ప్రలోభపెట్టటం పైన.. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్.. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు హిందూ సేన ఉపాధ్యక్షుడు సుర్జీత్ సింగ్ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇది తీవ్రంగా పట్టించుకోవలసిన అంశం అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 2013లో సుప్రీంకోర్టు ఉచితాలపైన కీలక వ్యాఖ్యలు చేసింది. అది ఎంత మాత్రం లంచం కిందకు రాదని వ్యాఖ్యానించింది. ప్రజాప్రతినిధ్య చట్టం 123 కింద, ఇలా ఉచితాలను ప్రకటించటం ఓటర్లను ప్రలోభపెట్టటమే అని పిటీషనర్ అప్పట్లో వాదించారు. ఇప్పుడు ఉచితాలు అంశం మరో మారు తెరపైకి వచ్చింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇస్తున్న ఉచిత హామీలకు సంబంధించి అశ్వినీ ఉపాధ్యాయ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సమీక్షించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పర్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచీ అంగీక రించింది. ఇది ఒక కీలకపరిణామంగా చెప్పుకో వచ్చు.

ప్రభుత్వ నిధులతో ఉచితాలను అమలు చేస్తామని అసంబద్ధంగా ఇస్తున్న హామీలు ఓటర్లపై అనుచితమైన ప్రభావాన్ని చూపుతాయని, స్వేచ్ఛా యుత ఎన్నికల విధానానికి భంగం కలిగిస్తాయని, ప్రతిఒక్కరికి సమాన అవకాశాలు అన్న విధానాన్ని దెబ్బతీస్తాయని పిటీషనర్ ఈ వ్యాజ్యంలో అభిప్రాయ పడ్డారు. సుప్రీంకోర్టు బెంచి ఈ అంశంలో ఎలాంటి తీర్పు ఇస్తుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ★



# హిందువులపై పెరుగుతున్న దాడులు

భాగ్యనగర శివారు చర్లపల్లి సమీపంలోని చంగిచర్ల గ్రామంలో హోలీ వేడుకలకు సమాయత్తమైన హిందూ కుటుంబాలపై కొంత మంది ముస్లిం మూకలు దాడికి తెగబడడం వారిలో పెరుగుతున్న అభద్రతా భావాన్ని, అహంకారాన్ని సూచిస్తోందనే భావించాలి. మేం రోజుకు ఐదుసార్లు నమాజు చదువుతాం కానీ, మీరు ఏడాదికి ఒకసారి వచ్చే పండగని కూడా హడావిడిగా చేసుకోకూడదన్నట్టుగా ముస్లింలలో ఒక వర్గం ప్రవర్తిస్తోంది.

ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలు, నరేంద్ర మోదీ తిరిగి అధికారంలోకి వస్తారంటూ అనేక సర్వే నివేదికలు తెలుపుతుండడం, ఆ వర్గం నాయకులు తమవారిని గుప్పిట్లో ఉంచుకునేందుకు భయపెట్టి, రెచ్చగొట్టడం వంటి కారణాల వల్ల దేశవ్యాప్తంగా ఇటువంటి పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం సిఏఎ నోటిఫై చేసినప్పుడు వారు ఒకప్పటిలా తీవ్రమైన అల్లర్లకు పాల్పడలేకపోయారు. పైగా ఒకప్పటిలా సుప్రీం కోర్టు కూడా మైనార్టీ వర్గం తెచ్చిన పిటిషన్లను తక్షణ ప్రాతిపదికన విచారించి, తీర్పులు ఇవ్వడం లేదు. ఇది ఆ వర్గాన్ని తీవ్రంగా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. కరోనాకు ముందు సిఏఎ, ఎన్ఆర్‌సి వ్యతిరేకత పేరుతో షాహీన్‌బాగ్‌లో వారు చేసిన కాండ వంటిదే ప్రతి చోటా చేయాలని వారు కోరుకుంటున్నప్పటికీ, అంత ఆస్కారం లభించడం లేదు. ముఖ్యంగా, యోగి, హేమంత వంటి ముఖ్యమంత్రులు కుల, మత భేదాలు చూడకుండా తప్పు చేసినవారిని తగినట్టుగా శిక్షిస్తుండడంతో, ఇన్ని దశాబ్దాలుగా బుజ్జగింపులకు అలవాటుపడిన వారికి తీవ్ర బాధను కలిగిస్తోంది.

తాజాగా స్థానిక మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలోని మేకల మండీ ప్రాంతంలోని పిట్టలబస్తీలో హోలీ సందర్భంగా భక్తి పాటలు పెట్టుకుని హిందూ కుటుంబాలు వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. కాగా, ఆ ప్రాంతంలో గల మసీదులో నమాజుచేసుకొని వచ్చిన కొందరు ఈ కార్యక్రమానికి అభ్యంతరం చెప్పారు. అందుకు, హిందువులు అంగీకరించలేదు. తమ ఏర్పాట్లు తాము చేసుకోవడం ప్రారంభించారు. ఈ విషయంపై రెండు వర్గాల మధ్య వాదన ప్రారంభమైంది. నానా మాటలు అంటూ సుమారు 500మందికి పైగా ముస్లింలువారిపై దౌర్జన్యానికి దిగారని స్థానికులు చెబుతున్నారు. దీనిని అడ్డుకోబోయిన మహిళలు, స్థానికులపై ముస్లిం మూకలు కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ గొడవ గురించి సమాచారం అందుకుని వచ్చిన మేడిపల్లి పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జీ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు.

ఆశ్చర్యకరం కలిగించే విషయమేమిటంటే, ఇరువర్గాలూ ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునేందుకు పోలీసు స్టేషన్‌కు పరుగుతీయడం. ఫిర్యాదు చేసిన వారిలో పిట్టలబస్తీకి చెందిన ఒక మహిళ తన ఫిర్యాదుకాపీలో పలువురు నిందితులపేర్లను ఏకరువు పెట్టడమే కాదు, వారు కర్రలతో తలపై, పొట్టమీద కొట్టడంతో తీవ్రగాయాలయ్యాని పేర్కొంది.

ఈ విషయం తెలుసుకున్న వెంటనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటెల రాజేందర్, హైదరాబాద్ లోకసభ అభ్యర్థి మాధవీలత, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వివిఎస్ ప్రభాకర్ సహా హిందూసంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హిందూ కుటుంబాలపై దాడికి పాల్పడ్డ వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజానికి ఆ వర్గానికి అత్యంత మేలు చేస్తున్న ప్రభుత్వం నరేంద్ర మోదీ సర్కారే. ఆ విషయం తెలిసినప్పటికీ, వారు తమ మతమత్తులో నుంచి బయటపడేందుకు ఇష్టపడుతున్నట్టుగా కనిపించడం లేదు. ఇప్పుడు వారి భయమల్లా మోదీ తిరిగి అధికారంలోకి వస్తే తమకున్న ప్రత్యేక హక్కులు ఏం ఊడబెరుకుతారేమో అన్నదే.

ఈసారి పాతబస్తీ నియోజకవర్గం నుంచి బీజేపీ ఒక మహిళను నిలబెట్టడం కూడా ఆ వర్గానికి రుచిస్తున్నట్టు కనిపించడం లేదు. ఆ నియోజకవర్గ అభ్యర్థి అక్కడి ముస్లిం మహిళల్లో అవగాహన తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే ప్రజల దృష్టికి వచ్చిన రెండవ సంఘటన ఇది. తొలి సంఘటన ఇటీవలే కోఠిలోని గుజరాతీ గల్లీలో జరిగింది. పోలీసులు దోషులపై చర్య తీసుకున్నా ఆ ప్రాంత శాసనమండలి సభ్యుడు వచ్చి వారిని విడిపించుకొని పోవడం పరాకాష్టగా భావించాలి. వారం రోజుల్లో తేడాతో చంగి చర్లలో రెండవ ఘటన చోటు చేసుకుంది. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇటువంటి ఘటనలు జరగడానికి అవకాశం ఉన్నందున హిందువులు అప్రమత్తత పాటించడం అవసరంగా మారింది. ★



‘భారత సిలికాన్ వ్యాలీ’గా ప్రసిద్ధి చెందిన బెంగళూరు నగరం నేడు గుక్కెడు నీళ్ల కోసం విలవిలలాడిపోతున్నది. వేలకొద్దీ స్టార్టప్‌లు, గూగుల్ నుంచి వాల్మార్ట్ వరకూ అనేక అంతర్జాతీయ ఐటి కంపెనీలు, సంస్థలు కలిగిన ఆ మెగా నగరం నేడు ప్రకృతి మనకు ఉచితంగా ఇచ్చే ఆ నీరు ఎంత ‘విలువైన’దో తెలుసుకుంటున్నది. ప్రజలు నీటి ట్యాంకర్ల వెనుక పరుగులు తీస్తున్నారు. బలహీనమైన నైరుతి రుతుపవనాల వల్ల వర్షాలు తగ్గి కావేరీ నది బేసిన్‌లోని రిజర్వాయర్లను భూగర్భ జలాలను తిరిగి నింపకపోవడంతో తగ్గిపోయా యని చెబుతున్నా, ప్రణాళిక లేకుండా అడ్డదిడ్డంగా నగరం విస్తరించడం ప్రధాన కారణమన్నది వాస్తవం. పచ్చదనానికి ప్రతీకగా ఉండే బెంగళూరు నగరంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడడం విచిత్రమే. ఇంకా పూర్తిగా వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపకుండానే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, రానున్న రెండు నెలలు ఎలా ఉంటుందో అని అక్కడి ప్రజలు వణికి పోతున్నారు.

# నగరాలలో నీటి సంక్షో

ఇదేదో కేవలం కర్ణాటకకు సంబంధించిన విషయమే అనుకోవడానికి లేదు. దక్షిణ భారత రాష్ట్రాలు కూడా సమస్యను ఎదుర్కొంటున్నాయి. అందులో తెలంగాణ రాష్ట్ర పరిస్థితి మరింత ఘోరంగా ఉండనుందని నిపుణులు అంటున్నారు. కాగా, కర్ణాటక పొరుగు రాష్ట్రాలకన్నా భిన్నమైన అవసరాలను కలిగి ఉండడం చేతనే వేసవి రాకముందే ఎక్కువ నిల్వ జలాలను వినియోగించు కోవలసి వస్తోందని అంటున్నారు. నీటి వ్యవస్థకు ఆటంకాలు కల్పిస్తూ దీర్ఘకాలికంగా సాగిన విధ్వంసం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని నిపుణులు అంటున్నారు. దేశ విదేశాల నుంచి వ్యక్తులు వచ్చే నగర పరిస్థితే ఇలా ఉంటే, చుట్టుపక్కల గ్రామాల పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో మనం ఊహించుకోవచ్చు.

**దెబ్బతింటున్న ఉపాధులు**

ఇంత పెద్ద నగరంలో నీటి సమస్య అంటే కేవలం ప్రజల గొంతులు మాత్రమే ఎండిపోతాయని మనం భావిస్తే అది మన అమాయకత్వమే అవుతుంది. జీవనానికి మౌలికమైన నీటి సమస్య వల్ల పలువురి ఉపాధులు కూడా దెబ్బతిం టాయి. హోటల్ వంటి వ్యాపారాలు తిరోగమనంలోకి వెడతాయేమోనని వారు ఇప్పుడే ఆందోళన చెందుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వాడిపడేసే ప్లేట్ల దగ్గర నుంచి రెస్ట్ రూముల్లో నీరు ఎంత తక్కువగా నీరు వాడాలనే సూచనల వరకు చేతులు కాలిన తర్వాత నీటి క్రమశిక్షణను పాటిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ట్యాంకర్ల వేటలోపడి ఆఫీసులకు ఆలశ్యంగా వస్తున్నారని దీనివల్ల ఉత్పాదకత తగ్గుతోందని బహుళజాతి సంస్థలు గగ్గోలు పెట్టడంలో ఎంత మాత్రం ఆశ్చర్యం లేదు. అలాగే, అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇంటి నుంచి పని చేసే అవకాశాన్ని కల్పించాయి. ఇంటి నుంచి అంటే బెంగళూరులో ఇంటి నుంచి కాదు సుమా, మీ ఊరు వెళ్లి హాయిగా అక్కడి నుంచి పని చేసుకోండి అంటూ తమ ఉద్యోగులను పంపినట్టు వార్తలు వస్తున్నాయి.

పలు ప్రాంతాలలో బోరుబావులు ఎండిపోవడం వల్లనే ఈ సంక్షోభం నెలకొందని నిపుణులు అంటున్నారు. మీడియా వార్తల ప్రకారం దీని కారణంగా, 257 ప్రాంతాలలో పరిస్థితి దారుణంగా ఉండనుంది. ఈ విషయాలను మీడియా బహిరంగ పరిచిన తర్వాత బెంగళూరు వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డ్ (బిడబ్ల్యుఎస్ఎస్‌బి) మార్చి 8వ తేదీన వాహనాలను కడుక్కోవడానికి, మొక్కలకు, నిర్మాణ పనులకు మంచినీటిని వాడకూడదని నిషేధాన్ని విధించింది.

**నీటి కొరతకు కారణాలు**

వెల్ లాబ్స్ అన్న ప్రముఖ జల పరిశోధనా సంస్థ నగర జల సమతుల్యత అన్న పేరుతో నివేదికను వెలువరించింది. మితిమీరిన దోపిడీకి గురైన భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడడం, బిడబ్ల్యుఎస్ఎస్‌బి పైప్‌లైన్లు అందుబాటు పరిమితంగా ఉండటం, చెరువుల నిర్వహణలో నిర్లక్ష్యం, జలశుద్ధి కేంద్రాలను పూర్తిగా వినియోగంలో పెట్టకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నివేదిక పేర్కొనడం గమనార్హం. అయితే, 2023లో ఏర్పడిన వర్షాభావ ప్రభావం ఇదని కూడా భూగర్భ జల నిపుణులు పేర్కొంటున్నారు. కురిసిన వాన నీటిలో 45శాతం నదులు, చెరువులను చేరుకుంటోంది. అయితే, శుద్ధి చేసిన, చెయ్యని వ్యర్థ జలాలతో నిండిన ఈ చెరువులు వాన నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని కలిగి లేకపోవడం పౌరుల స్వయంకృతమే.

బృహత్ బెంగళూరు మహానగర పాలిక పరిధిలో దాదాపు మూడు లోయలవ్యాప్తంగా లంకె కలిగిన 173 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల నెట్‌వర్క్ నగర వరద నిర్వహణకు కీలకం. ఒక చెరువు నుంచి మరొక చెరువుకు పారేలా లంకెలు కలిగిన నెట్‌వర్క్‌తో కూడి ఉండడంతో అధిక జలాలు అలా పారుతాయి. మొదట్లో ఈ కాలానుగుణం చెరువులు వానాకాలంలో పూర్తిగా నిండి, భారీ వానలు పడినప్పుడు తన నెట్‌వర్క్ ద్వారా వరదలు రాకుండా ఉపయోగపడేవి.

పట్టణీకరణ ఈ పద్ధతిపై భారీ ప్రభావాన్నే చూపింది. ముఖ్యంగా, చెరువుల్లోకి ప్రవహించే జలాల మేళనం మారిపోయింది. చెరువుల్లోకి ప్రవహించే నీటిలో దాదాపు సగం వ్యర్థ జలాలు. ఇందులో శుద్ధి చేసినవి, చేయనివి కూడా కలుస్తున్నాయి. ఈ కారణంగా నగరంలో చెరువులు ఎప్పుడూ నిండుగా కనిపించడమే కాదు, వర్షపు నీరు అందులో నిల్వ ఉండే ఆస్కారం లేకుండా చేస్తున్నాయి. వానాకాలంలో నగరంలో వరద పరిస్థితులు ఏర్పడటానికి ప్రధాన కారణమిదే. వానాకాలంలో వృథాగా ప్రవహించే సగటు జలాలు దాదాపు 982 ఎంఎల్‌డి ఉంటుందని అని నివేదిక పేర్కొంది. అదనంగా, ఇష్టంవచ్చినట్టుగా చోటు చేసుకుంటున్న నిర్మాణాల వల్ల చెరువుల మధ్య గల లంకెలు తెగిపోతుండడంతో అధిక నీటి ప్రవాహం మరొక చెరువులోకి మళ్లకుండా ఊళ్లోకి ప్రవహించి, వరదలను, నీటి నష్టాన్ని కలిగిస్తున్నాయి.

నగరంలో సంచిత వ్యర్థ జలాల్లో కేవలం 24 శాతం మాత్రమే శుద్ధి అవుతున్నాయి. శుద్ధి చేసిన వ్యర్థ జలాల్లో 63శాతం మాత్రమే కేంద్రీకృత శుద్ధికి గురవుతాయని, మిగిలిన 13 శాతం వేర్వేరు ప్లాంట్లలో శుద్ధి అవుతాయి. కాగా, మొత్తం నగర



# భానికి కారణం ఎవరు?

వ్యర్థ జలాల్లో కేవలం 30 శాతాన్ని మాత్రమే పున: ఉపయోగిస్తున్నారు. శుద్ధి చేసే మౌలిక సదుపాయాలను విస్తరింప చేసేందుకు అవకాశం ఉంది. ఎందుకంటే, నిర్మాణ కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాలు, తోటల పెంపకాల వంటివాటిలో ఈ జలాలను ఉపయోగించవచ్చు.

నిజానికి ఈ వ్యర్థ జలాల్లో అధికశాతం వినియోగంలోకి పెట్టని వనరు. దీనిని ఉపయోగించడం ద్వారా మంచినీటి వినియోగంపై భారాన్ని తగ్గించి, తక్కువ వానలు పడుతున్న కాలంలో నీటికి లోటు లేకుండా చూసుకోవచ్చని ఆ వెల్స్ నివేదిక పేర్కొనడం గమనార్హం. అత్యవసరం కాని కార్యకలాపాల కోసం శుద్ధి చేసిన జలాలను ఉపయోగించడం అన్నది దీర్ఘకాలంలో ఎంతో ఉపయుక్తమైనదని నిపుణులు చెబుతున్నారు. నగరంలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు తృతీయశ్రేణి జల కేంద్రాలను కోరవచ్చని ప్రభుత్వం చెబుతోంది. మొన్నమొన్నటి వరకూ ఈ వనరును తక్కువగా ఉపయోగించారు.

**చుక్కలనంటుతున్న నీటి ట్యాంకర్ల ధరలు**

రోజు మార్చి రోజు స్నానం చేసినప్పటికీ, కనీస అవసరాల కోసం నీరు అవసరమని పౌరులు, హౌజింగ్ సొసైటీలు ట్యాంకర్ల కోసం పడుతున్న పోటీ కారణంగా వాటి ధరలు చుక్కలనంటుతున్నాయి. ముఖ్యంగా కావేరీ నదీ జలాల అందుబాటులేని ప్రాంతాలలో సాధారణ వ్యక్తులు నీరు కొనుక్కోవడం కంటే బంగారం కొనుక్కోవడం తేలికని భావిస్తున్నారు. కాగా, నీటి ట్యాంకర్ల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ఇచ్చినప్పటికీ, ఆచరణలో పెద్దగా దాని ప్రభావం కనిపించడం లేదు.

ఒకవైపు డిమాండ్ అధికంగా ఉండడం ఒక కారణమైతే, దూరాల నుంచి నీటి తీసుకువచ్చి సరఫరా చేయవలసి రావడం కూడా ధరలను పెంచుతోంది. ఒకవైపు పెట్రోలు, మరొకవైపు నీటి ధరలు కలిసి తడిసిమోపెడవుతున్నాయి. ఈ అదనపు ధరల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటే తప్ప అటు సామాన్య పౌరులకు, ట్యాంకర్ల వారికీ కూడా ఊరట కలుగదు. అంటే, కనీసం ఆ వాహనాలకు వాడే పెట్రోల్, డీజిల్ మీది పన్నులను ఉపసంహరించుకున్నా, కొంతలో కొంత మేలు కలుగుతుంది.

ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు నగరంలో నీటి సమస్యను తీరుస్తామనే హామీ ఇస్తుంటారే తప్ప దీనిని పరిష్కరించాలనే నిబద్ధతతో లేకపోవడంవల్లనే ఈ సమస్య కొనసాగుతోంది. దీనితో పాటుగా, వర్షపు నీటి మీద అధికంగా ఆధార పడటం, నిల్వలకు తగిన చర్యలు తీసుకోకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణం. కేవలం 20శాతం లైవ్ స్టోరేజీ సామర్థ్యాన్ని మాత్రమే రాష్ట్రం కలిగి ఉండటం వల్ల, కేవలం ఒక సీజన్‌కు సరిపడ మాత్రమే దాని దగ్గర నీటి నిల్వలు ఉంటున్నాయన్న మాట.

**దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలూ ప్రమాదం అంచున?**

నైరుతి రుతుపవనాల కాలంలో 2023లో తక్కువ వర్షపాతం నమోదు కావడం కేవలం కర్ణాటకకే కాదు, దక్షిణాదిలోని రాష్ట్రాలు అన్నింటికీ శాపంగా మారింది. ఆ తర్వాత అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో పడే వానలు కూడా 13శాతం తక్కువగా పడడం వల్ల రిజర్వాయర్లలో నీటి స్థాయిలు తగ్గిపోయాయి. ఈ రాష్ట్రాలలోని ప్రధాన పట్టణ కేంద్రాలలో చెరువుల నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడం, భూగర్భ జలాలను అవసరానికి మించి వినియోగించడం వల్ల ప్రస్తుత సంక్షోభానికి కారణమయ్యాయి.

కేంద్ర జల కమిషన్ (సిడబ్ల్యుసి) తాజా నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడులలోని 42 రిజరాయర్లన్నింటిలో వాటి వాస్తవ సామర్థ్యమైన 53.334 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటికి బదులుగా మొత్తం 12.287 బిసిఎం ఉంది. అంటే, మొత్తం నీటి సామర్థ్యం 23 శాతానికి పడిపోయిందన్న మాట. గత పదేళ్లలో ఇదే కాలంలో ఉన్న సగటు నిల్వలతో పోలిస్తే ఇది చాలా తక్కువని నిపుణులు అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో నిల్వలు సాధారణం కన్నా 69 శాతం తక్కువ కాగా, తమిళనాడు (30శాతం), కర్ణాటక (24శాతం), తెలంగాణ (12శాతం) తక్కువగా ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. కేవలం కేరళమాత్రమే తన రిజర్వాయర్ల నిల్వలను నిర్వహిస్తూ, సాధారణం కన్నా ఒకశాతం మెరుగ్గా ఉందని చెబుతున్నారు. తూర్పు నుంచి పశ్చిమానికి, పశ్చిమం నుంచి తూర్పుకు ప్రవహించే నదుల నిల్వ స్థాయిలు అత్యంత తక్కువగా ఉన్నట్టు కనిపిస్తోంది.

అయితే, దక్షిణాదిలో ఉన్న రిజర్వాయర్లపైనే సాధారణ దృష్టి ఉన్నా, దేశ వ్యాప్తంగా కూడా పరిస్థితులు అంతగొప్పగా లేవని నిపుణులు చెబుతున్నారు. గత పదేళ్లలో నమోదు చేసిన సగటు నిల్వలతో పోల్చినప్పుడు ప్రస్తుతం ఉత్తరభారతదేశం (33శాతం), పశ్చిమ భారతం (45శాతం), మధ్య భారత్ (46శాతం) తక్కువగా నమోదు చేశాయి. దేశంలో అంతో ఇంతో ఆరోగ్యవంత మైన నిల్వలను కలిగి ముందుకు సాగుతున్నది తూర్పు ప్రాంతమే. అక్కడ నిల్వలు 49శాతంగా ఉన్నాయి.

ఈ లెక్కలన్నీ కూడా పూర్తిగా వేసవిలో ప్రవేశించిన తర్వాతవి కాదు. ముందు పరిస్థితులే... ముందుంది ముసళ్ల పండుగ అన్నట్టు భయపెడుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఇప్పుడప్పుడే భయపడవలసిన పరిస్థితి కానీ, అవసరం కానీ లేవని జూన్ వరకు సరఫరా చేసేందుకు నీరు ఉందని హామీ ఇస్తున్నాయి. ఆ తర్వాత, రుతుపవనాలకు ముందు, తర్వాత పడే వాన నీటితో చెరువులు, రిజర్వాయర్లు నిండుతాయని భావిస్తున్నారు.

పట్టణీకరణపై భారాన్ని తగ్గించడం, ప్రణాళికా బద్ధంగా, కబ్జాలు లేని నిర్మాణాలు జరగడం, నీటిని నిల్వ చేసే కాలువలను, చెరువులను కాపాడుకోవడం, వ్యర్థ జలాల పునర్వినియోగంతో పాటుగా నీటి వృధా నివారణ వంటి చర్యలను చేపట్టకపోతే, మన చేతులతో మనమే మన ప్రాంతాలను ఎడారులుగా మారుస్తామన్నది వాస్తవం. ★

# అక్కడి హిం
# అగచాట్లు వ

**పౌరసత్వ సవరణ చట్టం 2019 అమలు నల్లేరు మీద నడక లాంటిది కాదని ఊహించిందే.అంతా ఊహించినట్టుగానే ఈ చట్టం అమలు మీద స్టే విధించాలని కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మార్చి 19న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని పరిశీలించింది. స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఇది శుభ పరిణామమే. అలాగే ఈ చట్టం అమలు గురించి కేంద్రం ఇచ్చిన నిబంధనల మీద కూడా స్టే ఇవ్వాలని పిటిషనర్లు వాదించారు. మొదట పిటిషనర్ల వాదన మీద తమ సమాధానం ఏమిటో తెలియచేయాలని కేంద్రాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ 236 పిటిషన్లు, అమలుకు సంబంధించిన నిబంధనలను సవాలు చేస్తూ 20 విన్నపాలు దాఖలైనాయని కేంద్రం తరపున హాజరైన మెహతా తెలియచేశారు. సీఏఏ ఉద్దేశం ఎవరి పౌరసత్వం రద్దు చేయడం కాదని మెహతా మరొకసారి సుప్రీంకోర్టుకు విన్నవించారు. మరొక విషయం- 2014కు ముందు దేశంలో ప్రవేశించినవారికి మాత్రమే పౌరసత్వం ఇస్తామని, కొత్తగా ఏ ఒక్కరికి ఇవ్వడం లేదని కూడా ఆయన తెలియచేశారు. అయినప్పటికి, కోర్టులో తుది నిర్ణయం వెలువడే వరకు ఎవరికీ కొత్తగా పౌరసత్వం ఇవ్వకూడదని కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషర్ల తరపు న్యాయవాది ఇందిరా జైసింగ్ కోరారు. ముస్లిం లీగ్ తరపున వాదిస్తున్న కపిల్ సిబల్ కూడా కోర్టును ఇదే విధంగా అభ్యర్థించారు.**

సీఏఏ అమలు ప్రకటన ఆ చట్టం రూపొందిన నాలుగేళ్ల మూడు మాసాలకు వెలువడిందని, ఆనాడు ఈ చట్టం లేదా పౌరసత్వ ప్రదానానికి సంబంధించిన నిబంధనలు మాత్రం పొందుపరచలేదని కపిల్ సిబల్ వాదించారు. చట్టం ప్రకారం చట్టం చేసిన ఆరు మాసాలలోనే దాని ప్రకటన వెలువడాలని, అలాగే ప్రతి మూడు మాసాలకి ఒకసారి పార్లమెంట్ దృష్టికి కూడా తీసుకువెళ్లాలని ఆయన అన్నారు. బెలూచిస్తాన్ హిందూ పంచాయత్ సంస్థ తరపున కేసు వాదిస్తున్న రంజిత్ కుమార్ మరొక అంశం కోర్టు ముందుకు తెచ్చారు. డిసెంబర్, 2014కు ముందు భారత్‌లో ప్రవేశించిన బెలూచిస్తాన్ హిందువులకు పౌరసత్వం ఇచ్చారని, ఈ చర్య ఇతరుల హక్కులకు ఎలా భంగకరమవుతుందని ఆయన అన్నారు. బెలూచిస్తాన్ నుంచి వచ్చిన హిందువులంతా వివక్షకు గురైన వారేనని కూడా ఆయన తెలియచేశారు. అలా వచ్చిన వారికి ఓటు హక్కు వస్తుంది కాబట్టి, అదే ప్రభావితం చేస్తుందని జైసింగ్, సిబల్ వాదించినా కోర్టు పరిగణనలోనికి తీసుకోలేదు.




ఎవరి హక్కులకు భంగం కలిగించడం, పౌరసత్వాన్ని రద్దు చేయడం సీఏఏ ఉద్దేశం కాదని కేంద్రం చెప్పింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్‌లలో మత వివక్షకు గురైన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు అనే ఆరు మతాలకు చెందిన వారు (అక్కడ మైనారిటీలు, వివక్షకు గురి అవుతున్నవారు) భారత్‌లో పౌరసత్వం తీసుకుని సగౌరవంగా జీవించవచ్చునని భారత్ ప్రకటించింది. అదే సీఏఏ ఉద్దేశం. నిజంగానే ఆ దేశాలలో ప్రధానంగా హిందువులు ఎలాంటి అగచాట్లకు గురి అవుతున్నారో తెలుసుకోవడం అవసరం. ఒకరి హక్కులు ఒకరికి భంగం కాకూడదు. అలాగే ఒకరి హక్కులు ఫణంగా పెట్టి వేరొకరు లాభపడకూడదు.

పాకిస్తాన్‌లోని మైనారిటీలు, అంటే హిందువుల దుస్థితి ఎంత ఘోరమో ఈ వాస్తవాలు చెబుతాయి.

**1. అపహరణ, మతమార్పిడి**

ఏటా పాకిస్తాన్‌లో 1000 మంది హిందూ, క్రైస్తవ బాలికలు అపహరణకు గురి అవుతున్నారు. తరువాత వారి మతం మారిపోతోంది. ఈ బాలికలను కుటుంబాల నుంచే తీసుకుపోయి వారి వయసుకు రెండు రెట్లు ఎక్కువ ఉన్న పురుషులకు ఇచ్చి పెళ్లిళ్లు చేశారు. లేదా లైంగిక అత్యాచారం చేసి అక్రమ రవాణా చేస్తారు. అంటే వ్యభిచార గృహాలకు అమ్ముతున్నారు. అక్కడి కొన్ని సంస్థలు ఏమని ప్రచారం చేస్తాయంటే ఇలా హిందు లేదా ఇతర మతాల బాలికలను అపహరించి తేవడం హజ్ ఎ అక్బరీతో సమానం అని. అంటే పెద్ద మత కార్యం. 2004-2018 మధ్య ఇలాంటి అపహరణ కేసులు 7430 నమోదైనాయి. నిజానికి ఇది బయటకు తెలిసిన సంఖ్య. ఇతర మతాలలోని మైనర్ బాలికల రక్షణకు పాకిస్తాన్‌లో ఎలాంటి చట్టాలు లేవు. నిజానికి పాకిస్తాన్ నుంచి హిందువులు వేలాదిగా తరలి రావడానికి ప్రధాన కారణం వారి బాలికలకు రక్షణ

# దువుల
# ర్ణనాతీతం



లేకపోవడమే.

**2. తగ్గిపోయిన హిందూ జనాభా**

3,000 వేల ఏళ్ల నాటి సింధు నాగరికతకు నిలయాలుగా చెప్పే హరప్పా, మొహెంజదారో ఇప్పుడు పాకిస్తాన్‌గా చెబుతున్న ప్రాంతంలోనే విలసిల్లాయి. కాలక్రమంలో హిందువులను హింసించడం వల్ల ముస్లిం రాజ్యాలుగా మారాయి. 1947లో జరిగిన దేశ విభజన తరువాత హిందువుల జనహననం వేగవంతమైంది. ముస్లింలకో దేశం అన్న ముస్లిం లీగ్ పిలుపు తరువాత పశ్చిమ, తూర్పు పాకిస్తాన్‌ల నుంచి లక్షలాది మంది హిందువులు ఇవాళ్టి భారతదేశానికి అక్షరాలా ప్రాణాలు అరచేత పెట్టుకుని వచ్చారు. అలా పశ్చిమ పాకిస్తాన్‌లో 1947 నాటికి మిగిలిన 15 శాతం జనాభా 1951 నాటికి 2 శాతానికి పడిపోయింది. 1964లో అక్కడ జరిగిన మత ఘర్షలతో మరికొంతమంది హిందువులు భారతదేశానికి పారిపోయి వచ్చారు. ప్రస్తుతం పశ్చిమ పాకిస్తాన్ (బంగ్లా విడిపోగా మిగిలినది)లో మిగిలిన హిందువులు 1.6 శాతం. నేటి పాకిస్తాన్‌లోని నగరాలన్నీ ఒకప్పుడు హిందూ జనాభాతో నిండి ఉండేవి. ఉదాహరణకు లాహోర్. ఇక్కడ 1941నాటి హిందూ/సిక్కు జనాభా 40 శాతం. ఇప్పుడు అక్కడ ఆ రెండు మతాల వారి జనాభా కేవలం 1 శాతం. ధూపదీప నైవేద్యాలు అందుతున్న ఆలయాలు రెండు.

అలాగే అఫ్గానిస్తాన్ విషయం. సింధు నాగరికత కాలంలో ఇక్కడంతా హిందువులే. ఇప్పుడు 99.7 శాతం ముస్లింలు. అఫ్ఘాన్‌కు 5వందల ఏళ్ల క్రితం సిక్కులు తరలి వెళ్లడం ఆరంభించారు. అక్కడి జలాలాబాద్‌లో ఉన్న చిస్మా సాహెబ్ గురుద్వారా వారికి చాలా పవిత్రం. ఆ గురుద్వారాకు గురు నానక్ వెళ్లారు.

సోవియెట్–అఫ్ఘాన్ యుద్ధం (1979–1989) సమయంలో చాలామంది హిందువులు, సిక్కులు యూరప్ తరలిపోయారు. తరువాత అఫ్ఘాన్ ముజాహిదీన్ల వశమై ఛాందసవాదంతో నిండిపోయింది. వీళ్ల సృష్టే తాలిబన్. అక్కడ 1970 ప్రాంతానికి హిందువులు, సిక్కులు ఏడు లక్షలు ఉండేవారు. 1990 నాటికి అక్కడ మిగిలిన ఆ రెండు మతాల వారు కలపి 15,000 మాత్రమే. మరి ఇప్పుడో కేవలం ఆ రెండు మతాల వారు కలిపి 1350 మంది ఉన్నారు.

**3. మైనారిటీలు ద్వితీయ శ్రేణి పౌరులు**

పాకిస్తాన్ చట్టాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. దీనితో మైనారిటీలకు అవి రక్షణ కల్పించడంలో విఫలమవుతూ ఉంటాయి. పాక్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 20–22 అందరి పౌరులకు మత స్వేచ్ఛ ప్రసాదిస్తుంది. కానీ 1971లో వచ్చిన ముస్లిం చట్టం ప్రకారం ముస్లిమేతరులకు పాకిస్తాన్ సమాన హక్కులు ఇవ్వదు. ముస్లింలు మాత్రమే దేశ అధ్యక్షులు కాగలరు. ఉన్నత పదవులలోకి వచ్చిన వారు ఏమతం వారైనా ముస్లిం ప్రార్థన ఆధారంగానే ప్రమాణం చేయాలి. పాకిస్తాన్ పీనల్ కోడ్ (సెక్షన్‌లు 295బి, సి, 298 ఎ6 సి) దైవ దూషణ నేరానికి కఠిన శిక్షలు విధిస్తుంది. ముస్లింలలోనే ఒక తెగ కూడా వివక్షను ఎదుర్కొంటున్నది. పాక్ పీనల్ కోడ్ ప్రకారం వారు కూడా ముస్లింలమని చెప్పుకోవడం నిషిద్ధం. ఇస్లాంలోని ప్రతీకలని, ప్రవచనాలని వారు స్వీకరించ కూడదు. వీటిని ఉల్లంఘిస్తే జైలు శిక్ష నుంచి మరణ దండన దాకా విధించే హక్కు కోర్టులకు ఉంటుంది. అమెరికా ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం ఒక్క 2019 సంవత్సరంలోనే దైవ దూషణ నేరం కింద 84 మందిని జైళ్లలో పడేశారు. 29 మందికి మరణ దండన విధించారు. కోర్టులు కాకపోతే ప్రజలు కూడా శిక్షలు విధించగలరు. అది కూడా 2019లోనే జరిగింది. ఒక పాఠశాల విద్యార్థి తన ప్రిన్సిపాల్ దైవ దూషణకు పాల్పడ్డాడని వచ్చి చెప్పాడు. వెంటనే మూడు హిందూ దేవాలయాలు, కొన్ని దుకాణాలు, కొన్ని పాఠశాలలు వెంటనే దగ్ధమైనాయి. ఘోట్కి అనే పట్టణంలో ఇది జరిగింది.

4. పాత గుడులు అదృశ్యం, కొత్త వాటిపై దాడి నిత్యకృత్యం. పాత ఆలయాలు మాయమై పోతున్నాయి. కొత్త వాటికి స్థానమే లేదు. 2020లో ప్రభుత్వం అనుమతి ఇచ్చినా ఒక ఆలయం చుట్టూ కట్టిన గోడను స్థానికులు కూల్చేశారు.

5. పాకిస్తాన్‌లో జిహాదీలు ఎక్కువ. వీరి తయారీకి బాగా ఉపయోగపడుతున్నవే అక్కడ ప్రస్తుతం ఉన్న 40,000 మదర్సాలు. ఇవి ప్రభుత్వ పాఠశాలల కంటే ఎక్కువ. ఒక పాకిస్తాన్ పాఠ్య పుస్తకంలో ఒక హిందువు అంటే అతడు ఎప్పటికీ ఇస్లాంకు శత్రువే అన్న వాక్యం ఉంది. ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి కొద్ది వారాలలో దిగిపోతాడనగా ఒక హిందూ ఆలయం కట్టించడానికి ఉద్యుక్తుడయ్యాడు. అప్పుడే టిక్‌టాక్ పేరుతో ఒక వీడియో వెలువడింది. ఇస్లామాబాద్‌లో హిందూ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇస్తే, తాను ఒక హిందువుని చంపుతానని, అది తన కర్తవ్యమని ఆ వీడియోలో ఒకడు అన్నాడు. ఇంతకీ అతడొక బాలుడు. ముస్లిమేతరులను బెదిరించే ఇలాంటి వీడియో నిత్యం వెలువడతాయి.

6. ప్రపంచం కొవిడ్ 19తో పోరాడుతున్న సమయంలోను పాకిస్తాన్ ప్రభుత్వం, అక్కడి ప్రభుత్వేతర సంస్థలు హిందువులు, క్రైస్తవులతో వివక్షాపూరిత వైఖరినే అనుసరించాయి. కరాచీలోని పన్నెండు లక్షల మంది దినసరి కూలీలకి సాలనీ ట్రస్ట్ ఫండ్ అనే సంస్థ నిత్యావసరాలు సరఫరా చేసింది. వీరంతా ముస్లింలే. అక్కడ చాలా పెద్ద సంఖ్యలో ఉన్న హిందువులకు, క్రైస్తవులకు మొండి చేయి చూపింది. కరాచీలోనే లయారీ అనే చోట హిందువులకు బియ్యం ఇవ్వడం లేదని ఆ సంస్థ బాహాటంగానే ప్రకటించింది. ఆ ప్రాంత హిందూ మహిళ ఒకరు సియాసత్ బ్లాగ్‌లో ఈ విషయం వెల్లడించారు.

**(2020 ఒక నివేదిక ఆధారంగా)**

# రాజకీయ చదరంగం

రానున్న ఐదేళ్లకు ప్రభుత్వాన్ని ఎన్నుకు నేందుకు వచ్చే నెల నుంచి సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో సహజంగానే భారతదేశానికి ఎన్నికల జ్వరం పట్టుకుంది. ప్రధాన పార్టీలు ఒక్కొక్కటిగా తమ అభ్యర్థుల పేర్లను వెల్లడిస్తూ ఎంపికైన అభ్యర్థులకు ఆనందాన్ని, భంగపడిన వారికి విషాదాన్ని ఇస్తున్నాయి. ప్రధాన పార్టీలు ఆచితూచి నిర్ణయాలు తీసుకుని, అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తున్నాయి. అందులో కొందరి పేర్లు సంచలనాన్ని, రకరకాల వ్యాఖ్యలను రేకెత్తిస్తున్నాయి.


కంగనా


సుప్రియ శ్రీనేట్

**సందేశ్‌ఖాలీ బాధితురాలికి బీజేపీ టిక్కెట్టు, అవాక్కైన ప్రతిపక్షం**

ప్రత్యర్థి పార్టీలను విస్మయంలోకి లోను చేయడంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దిట్ట అని ఒకటికి వందసార్లు రుజువు చేసుకొని ఉంటుంది. తాజాగా, విడుదల చేసిన ఐదవ విడత జాబితాలో పేర్లు విన్నవారంతా ఒక్కసారి ఆశ్చర్యానికి లోనయ్యారనడం అతిశయోక్తి కాదేమో. అటు మెరుపులను, ఇటు గాయాలను కలగలిపి ఉగాది పచ్చడిలా ఉన్న ఆ జాబితాలో ఒకవైపు సినీ నటి కంగనా రనౌత్ ఉండగా, మరోవైపు సందేశ్‌ఖాలీ బాధితురాలు రేఖా పాత్రా పేరు ఉండటం. కంగనా విషయంలో ఊహాగానాలు ఉన్నా రేఖా పాత్రాకు సీటు ఇస్తారనేది ఎవరికీ ఊహకు అందని విషయం. ఆమెకు పశ్చిమ బెంగాల్‌లోని బసీర్‌హాట్ నియోజకవర్గం టిక్కెట్టు ఇచ్చారు.

**ఎవరీ రేఖా పాత్ర**

సందేశ్‌ఖాలీ ఉదంతంలో గొంతెత్తి పోరాటం చేసిన ప్రముఖుల చిట్టాలో మొదటిపేరు రేఖదే ఉంటుంది. ఆమె ఫిర్యాదు ఆధారంగానే పశ్చిమ బెంగాల్ పోలీసులు తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షాజహాన్ అనుచరుడు శిబు హజ్రాను అరెస్టు చేశారు. సందేశ్‌ఖాలీ ఘటనలో దోషి షాజహాన్ షేక్ చేతిలో అత్యాచారానికి గురైన బాధితురాలు రేఖ. ప్రధానమంత్రి మోదీ పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న మార్చి 6వ తేదీన సందేశ్‌ఖాలీ మహిళల ఇక్కట్లను తెలిపేందుకు ఆయనను కలుసుకున్న బృందంలో రేఖ కూడా ఉన్నట్టు వార్తలు వచ్చాయి.


రేఖా పాత్ర

తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి నూరుల్ ఇస్లాంపై రేఖ పోటీ చేస్తున్నారు. సందేశ్‌ఖాలీ ఘటన సమయంలో ఎంపీగా ఉన్న నుస్రత్ జహాన్‌ను వదిలిపెట్టి తృణమూల్ అధినేత్రి ఈ స్థానాన్ని ప్రత్యేకంగా నూరుల్ ఇస్లాంకు ఇచ్చారు. కాగా, తనకు అవకాశమిచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూనే, తాను సందేశ్‌ఖాలీ బాధితులకు న్యాయం జరిగేవరకూ తన గొంతు ఎత్తుతూనే ఉంటానని రేఖ పాత్ర చెప్పారు.

సమస్యలు ఎదుర్కొంటున్న సందేశ్‌ఖాలీ ప్రాంతం నుంచి గృహిణి అయిన రేఖను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా, తాము బాధితుల పక్షాన ఉంటామనే అత్యంత బలమైన రాజకీయ ప్రకటనను బీజేపీ చేసింది. 'బెంగాల్‌లో బసీర్‌హాట్ నుంచి రేఖా పాత్రను బీజేపీ నిలబెడుతోంది. ఆమె షేక్ షాజహాన్ అత్యాచారాలకు బలైన సందేశ్‌ఖాలీ బాధితులలో ఒకరు. నిశ్శబ్దంగా క్షోభిస్తున్న ఆమె వంటి మహిళల ఓటు అడిగే ముందు వారి కన్నీటిని మమతా బెనర్జీ తుడవాలి. బెంగాల్ బీజేపీ బెంగాల్‌కు, సందేశ్‌ఖాలీ మహిళలకు అండగా ఉంటుందని స్పష్టమైన ప్రకటన ఇది,' అంటూ బీజేపీ ఐటి సెల్ జాతీయ కన్వీనర్ 'ఎక్స్' పై చేసిన పోస్టులో పేర్కొన్నారు.

**మెత్తటి కత్తితో సుప్రియ శ్రీనేట్ వ్యాఖ్యలను, వైఖరిని ఖండించిన కంగనా**

సూటిగా, స్పష్టంగా, నిష్కర్షగా తన అభిప్రాయాలను వెల్లడించే నటిగా కంగనా రనౌత్ చాలా సందర్భాలలో, చాలామందినే ఆశ్చర్యానికి లోను చేశారు. ఆమె రాజకీయపరమైన ప్రకటనలు చేయడం, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించడం వంటివి జరుగుతున్నప్పటికీ ఇంత త్వరగా ఆమె ఎన్నికల బరిలోకి అడుగుపెడుతుందని ఎవరూ భావించలేదు. భారతీయ జనతా పార్టీ ఆమెకు హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి టిక్కెట్టు ఇచ్చింది. అంతే, కాంగ్రెస్ పార్టీలోని మహిళా నేతలకు పూనకం వచ్చింది.

గ్లామర్ ప్రపంచంలో భాగమైన కంగనాపై కాంగ్రెస్ సోషల్ మీడియా అధిపతి సుప్రియా శ్రీనేట్ చేసిన వ్యాఖ్యలతో సోషల్ మీడియా అగ్గి మీద గుగ్గిలమవుతోంది. ఒక స్త్రీ అయి ఉండి మరొక స్త్రీని ఆ రకంగా అవమానించడం సరైన పనేనా అంటూ సాధారణ పౌరులు వ్యాఖ్యానిస్తుండగా, ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో కంగనా ఫోటోను పోస్ట్ చేస్తూ, 'క్యా భావ్ చల్ రహా హై మండీ మే కోయి బతాయేగా (మండిలో నడుస్తున్న ధర ఎంతో ఎవరైనా చెప్పగలరా?) అని కంగనాను ఉద్దేశించి సుప్రియ శ్రీనేట్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరంగా ఉన్నాయి. కేవలం ఆమె చేసిన వ్యాఖ్యలే కాదు, ఆమె పోస్ట్ చేసేందుకు ఎంచుకున్న ఫోటో కూడా నటిని అవమానించేందుకు

# లో ఎత్తులకు పైఎత్తులు

ఉద్దేశించిందేననే విషయం ఆ ఫోటో చూసిన ఎవరికైనా అర్థమవుతుంది. ఈ వ్యవహారం టీవీలలో చర్చకు దారి తీస్తుండడం, బీజేపీ ఆమె రాజీనామాను డిమాండ్ చేస్తుండడం, ఆ వ్యాఖ్యలు తాను చేసినవి కావని, తన అకౌంట్లు అందుబాటులో ఉన్నవారు ఈ అభ్యంతరకరమైన, అసహ్యకరమైన పోస్ట్ చేశారని, దానిని తాను తొలగించానని శ్రీనేట్ వివరణ ఇచ్చుకున్నారు. నా గురించి తెలిసిన వారు ఎవరైనా నేను మహిళల గురించి అలా మాట్లాడనని తెలుసని ఆమె ఎక్స్‌పై స్పష్టీకరణ ఇచ్చారు.

ఇందుకు స్పందనగా, తాను కళాకారిణిగా గత 20 ఏళ్లలో అనేక పాత్రలు పోషించానని. ఇంకో మాటలో చెప్పాలంటే అన్నిరకాల మహిళా పాత్రలు పోషించానని, క్వీన్‌లో అమాయకురాలైన యువతి పాత్ర నుంచి, ధాకడ్‌లో సమ్మోహన పరిచే గూఢచారి నుంచి మణికర్ణికలో దేవతగా, చంద్రముఖిలో రాక్షసిగా, రజ్జోలో సెక్స్‌వర్కర్ నుంచి తలైవిలో విప్లవాత్మక నాయకురాలిగా పాత్రలు పోషించానని కాంగ్రెస్ అధికారప్రతినిధిని ఉద్దేశించి ఎక్స్‌పై పోస్ట్ చేసిన పోస్టులో పేర్కొంది. మన ఆడపిల్లలను వివక్ష అనే సంకెళ్ల నుంచి విడిపించాలని, వారి శారీరక అంగాల పట్ల ఆసక్తి నుంచి మనం ఎదగడమే కాదు, సెక్స్‌వర్కర్ల దుర్భర జీవితాలను, పరిస్థితులను ఒక తిట్టుగా, బూతుమాటగా వాడకూడదని, ప్రతి మహిళ గౌరవానికి అర్హురాలంటూ వ్యాఖ్యానించింది. వాటితో పాటుగా సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఇతర అభ్యంతరకర వ్యాఖ్యలను కూడా షేర్ చేశారు. ఒక యువకుడికి టికెట్లు వస్తే, అతడి సిద్ధాంతంపై దాడి చేస్తారు, ఒక యువతికి టిక్కెట్టు వస్తే ఆమె లైంగికతపై దాడి జరుగుతుంది. ఎంత విచిత్రం!! అంతేకాదు, ఒక చిన్న పట్టణం పేరుకు కూడా కాంగ్రెస్‌వారు లైంగికతను ఆపాదిస్తున్నారు. ఒక యువతి అభ్యర్థి కనుక మండీ పేరును ఆ నేపథ్యంలోనే ప్రతి చోటా ఉపయోగిస్తున్నారు. ఇటువంటి వైఖరి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్‌వారు సిగ్గు పడాలంటూ వ్యాఖ్యానించి, వారి నైజాన్ని కంగనా బట్టబయలు చేశారు.

**వరుణ్‌గాంధీకి కాంగ్రెస్ ఆహ్వానం**

బీజేపీ జారీ చేసిన జాబితాలో ఈ ఇద్దరు మహిళలు పేర్లు ఎంత సంచలనం రేకెత్తించాయో, ఒక యువకుడి తొలగింపు అంత నిశ్శబ్దంగా జరిగిపోయింది. కానీ, కాంగ్రెస్ మాత్రం ఆగలేకపో తోంది. ఆ టికెట్టు ఎవరిదంటే, ఫిలిబిత్ ఎంపీ, గాంధీ వంశజుడైన వరుణ్ గాంధీది. అతడికి ఈసారి బీజేపీ టిక్కెట్టు ఇవ్వకపోవచ్చనే పుకార్లు కొన్ని వారాలుగా



వరుణ్ గాంధీ

షికార్లు చేస్తున్నాయి. అది నిజం కావడమేంటి, కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగిపోయింది. చివర 'గాంధీ' అన్న పేరు ఉన్నవారంతా తమ పార్టీవారేనన్న భావనను కాంగ్రెస్ బాగా జీర్ణించుకుంది. అందుకే, ఎన్నిసార్లు విఫలమైనా రాహుల్ గాంధీ వెనుకే తిరుగు తుంటారు. ఇప్పుడు బీజేపీ వరుణ్‌ను విసర్జించడం తమకు కలిసివచ్చిన ఒక అవకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది.

గాంధీ కుటుంబంతో బంధుత్వం ఉండటం వల్లనే వరుణ్‌గాంధీకి బీజేపీకి టిక్కెట్టు ఇవ్వలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అధీర్ రంజన్ చౌధరి వ్యాఖ్యానించడమే కాదు, ఘన చరిత్ర కలిగిన పార్టీలో చేరవలసిందిగా వరుణ్‌కు ఆహ్వానం పలికారు. వరుణ్ గాంధీని 'దబంగ్ నేత' (బలమైన నాయకుడు) అంటూ అభివర్ణించడమే కాదు, చాలా విద్యావంతు డైన వ్యక్తి అని చౌధరి అభివర్ణించారు. అంతే కాదు, అతడు క్లీన్ ఇమేజ్ కలిగిన వాడంటూ పేర్కొన్నారు. అతడు వచ్చిన తమ పార్టీలో చేరితో తామంతా సంతోషిస్తామంటూ ఆయన వ్యాఖ్యానించారు.

ఇటీవలి కాలంలో పలు అంశాలపై బీజేపీతో వరుణ్ విభేదిస్తూ వస్తున్నారు. అయితే, అతడి తల్లి మనేకా గాంధీ పేరు అభ్యర్థుల జాబితాలో ఉండటమే కాదు ఆమెను సుల్తాన్‌పూర్ నియోజకవర్గం అభ్యర్థిని చేశారు. వరుణ్ గాంధీ, రాహుల్ గాంధీ అన్నదమ్ముల పిల్లలు. గత రెండు సార్లుగా వరుణ్ ఫిలిభిత్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు. అనేక సందర్భాలలో పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా కేంద్రంపై యుపి రాష్ట్రంలో పరిణామాలపై తీవ్రమైన వ్యాఖ్యలను బహిరంగంగా చేశారు.

కాగా, యుపి నుంచి కేవలం వరుణ్‌గాంధీని మాత్రమే తప్పించలేదు, జనరల్ వికె సింగ్, సత్యదేవ్ పచౌరీ, బరేలీ ఎంపీ సంతోష్ గంగవార్, బదౌన్ ఎంపీ సంఘమిత్ర మౌర్య, రజవీర్ సింగ్ దిలర్ వంటి పలువురికి పార్టీ టిక్కెట్లు ఇవ్వడానికి నిరాకరించింది. అయితే, అధీర్ రంజన్ ఆహ్వానాన్ని మన్నిస్తారా లేదా అన్న విషయం వేచి చూడవలసిందే.

**హర్యానాలో బీజేపీ చమత్కారం**

పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే ఎవరికైనా టిక్కెట్టు వస్తుందా, ఇస్తారా? రైల్వే క్యూలో నిలబడ్డా ఇటీవలి కాలంలో మనకు టికెట్టు దొరకడం లేదు కానీ కొందరికి మాత్రం దొరుకుతోంది. ఆ కోవలోకి వచ్చేవారే నవీన్ జిందాల్, రంజీత్ సింగ్ చౌతాలా. హర్యానాలో నరాలుగు సీట్లకు ప్రకటించిన పేర్లలో వీరిద్దరివి కూడా ఉండడం ఆశ్చర్యాన్ని కలిగింది. నవీన్ జిందాల్ కురుక్షేత్ర స్థానం నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. హర్యానా మాజీ మంత్రి సావిత్రి జిందాల్ చిన్న కుమారుడు నవీన్ జిందల్. దేశంలోని అత్యంత సంపన్నమైన మహిళల్లో ఆమె ఒకరు కావడమే కాదు, దివంగత పారిశ్రామిక వేత్త ఒపి జిందల్ భార్య ఆమె. జిందల్ స్టీల్ అండ్ పవర్ చైర్‌పర్సన్‌గా ఉన్న నవీన్ ఇటీవలే ఇండియన్ స్టీల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించారు.

అసలు విషయమేమిటంటే, 2004, 2014



నవీన్ జిందాల్



రంజీత్ సింగ్

లోనూ కాంగ్రెస్ ఎంపీగా జిందల్ కురుక్షేత్రకు ప్రాతినిధ్యం వహించారు. రానున్న ఎన్నికల్లో నవీన్ జిందాల్ ఆప్ అభ్యర్థి, రాజ్యసభ మాజీ ఎంపీ సుశీల్ గుప్తాతో తలపడనున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ఇక్కడ ఆప్ పోటీ చేస్తున్నది. నవీన్‌లాగే పార్టీలో చేరిన కొద్ది గంటలకే టికెట్టు సాధించిన మరొక అభ్యర్థి రంజీత్ చౌతాలా. హర్యానాలో స్వతంత్ర ఎమ్మెల్యేగా ఉన్న అతడు బీజేపీలో చేరిన వెంటనే హిసార్ అభ్యర్థిగా అతడి పేరును ప్రకటించారు. సిర్సాలో జరిగిన ఒక కార్యక్రమంలో బీజేపీలో చేరిన చౌతాలా బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో మంత్రి. మాజీ డిప్యూటీ ప్రధానమంత్రి దేవీలాల్ సోదరుడి కుమారుడు, హర్యానా ముఖ్యమంత్రి ఓంప్రకాష్ చౌతాలా కుమారుడు రంజీత్ చౌతాలా. ★

కాలం మారిపోయింది. కాలానికి రూపమే లేదు – మరి మారి పోవటం ఏమిటి?!

కాలంతో కలిసి ప్రయాణించే మనుష్యుల మనస్తత్వాలలో మార్పు–అదే కాలంలో మార్పు!

మనిషి మనస్తత్వంలో మార్పు ఎందుకనో– చుట్టూఉన్న సౌకర్యాలూ, అవసరాలూ, ఒత్తిళ్లు, ఆకర్షణలూ..ఇలా చెప్పుకుంటూ వెళ్తుంటే చాలా చాలానే మన ఎదురుగా వచ్చి నిలబడతాయ్.

మనిషి మనసు మునుపటిలా లేదు. మారి పోయింది. స్వార్థపూరితం అయిపోయింది అనెయ్యటం మరొకటి – ఆ మారిపోయిన మనుష్యుల్లో తామూ ఒకరిమేనన్న విషయం మాత్రం మర్చిపోతారు!

తాను వేరన్నట్టు ఈ ప్రపంచానికంతకూ ప్రేక్షకుడిని అన్నట్టు మాట్లాడతాడు. అదే ఆ పరమాత్ముడికి దగరవ్వటానికి తన జీవితానికి తనే ప్రేక్షకుడిగా మారాలంటే మాత్రం కష్టం అంటాడు.

నేను కూడా బహుశః అంతే అయి ఉండవచ్చు ననుకోండి.

ఇప్పటి మనిషి అవసరాలు పెరిగాయ్. అలా పెరగటంలో పక్క మనిషి ప్రభావం చాలా ఉంటుందనిపిస్తుంది. ఎందుకంటే మనిషి తన జీవితంలో సగభాగం పక్కవాడి మెప్పుపొందటానికే జీవిస్తాడన్నది సత్యం కనుక. మళ్లీ భగవంతుడి మెప్పును పొందటానికి అంతటి తహతహ ఉండదు. కోరికలు కోరుకోవటం తప్ప పరమాత్మని మెప్పించటానికి మరి నిస్వార్థం, త్యాగం కావాలి! నిజానికి వాటి రుచిని మనస్సుతో తెలుసుకోగలిగితే ఇంక దానికి సాటి అయినది మరొకటి కనిపించదు మరి!

నిస్వార్థం, త్యాగం కూడా ఎక్కడో అక్కడ నవ్వుల పువ్వుల్నీ, ఆశీర్వాదాల హరివిల్లునీ పూయిస్తూనే ఉంటాయో – అవి అదృశ్యంగా మనని ఆలకిస్తూనే ఉంటాయ్. ప్రభాస్, ప్రణితల గురించి నా ఆలోచనా స్రవంతి ఎక్కడెక్కడికో ప్రవహించింది.

వాళ్ల సమస్యకి ఎలాగయినా పరిష్కారాన్ని సూచించాలని నా మనస్సు కోరుకుంటోంది. పెద్దవాడిగా నిలబడి నాలుగు చివాట్లు వేసేస్తే పరిష్కారం అయ్యే సమస్యలు కావివి.

ముందున్న జీవితకాలమంతా సుఖంగానే ఉంటుందన్న భ్రాంతిలో తీసుకున్న నిర్ణయం మరి అది!

అందుకే జీవిత నగ్నసత్యాల్లోకీ, మనస్సు మూలాల్లోకీ వెళ్లి అక్కడ ఏం జరుగుతోందో ప్రత్యక్షంగా వాళ్ల అరచేతుల్లో అవగాహనకి పెడితే నేరుగా వాళ్ళు అసలైన పరిష్కారం వైపు అడుగులు వెయ్యగల దారె దొరకదు.

ఈ రోజుల్లో పిల్లలకి ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. అన్నిటికీ తొందరపాటే అన్నమాట ఒక పదినెలల్లు అనుకుంటే అయిపోదు!

ప్రేమ విషయంలో మనస్సుకి అన్నది ఎప్పుడు లేకపోలేదని?! ఆవేశంతో కూడుకున్నది కనుకనే బహుశః అంత మధురంగా ఉంటుందేమో!

ముందు కాలానికీ, ఇప్పటి కాలానికీ ఒక్కటే భేదం– అప్పట్లో స్త్రీ పురుషుడిమీద ఆర్థికంగా ఆధారితగా ఉండేది. పురుషుడికీ స్త్రీ లేకపోతే జీవితం లేదన్నది పరమ సత్యమే అయినా–ఖాళీ అయిన ఆ స్థానాన్ని భర్తీ చెయ్యటానికి మరో స్త్రీ సిద్ధంగా ఉండటం అన్నది కూడా ఆ సమస్య మీద బలమైన ముద్రని వేస్తోందనిపిస్తుంది! అనిపించటం ఏమిటి అదే సత్యం కూడాను.

బాధ సాంద్రత, భరించేశక్తీ కూడా– ఆ తర్వాత దొరికే జీవితపు వెసులుబాటుని బట్టి కూడా ఉంటుందనిపిస్తుంది.

ఆ వెసులుబాటే ఇప్పటి స్త్రీకి కొద్దిగా చొరవ తీసుకునే అవకాశం ఇస్తోంది. ఇటువంటి అవకాశం కూడా స్త్రీ జీవితంలో వాంఛితమే!

ఈ రోజుల్లో మగవాడు కాస్త మునుపటి మగవాడికన్నా భిన్నంగా తనని తను తరచి చూసుకుంటున్నాడు. మునుపటి రోజుల్లో సంసారపు సింహాసనంలో కేవలం తనకి మాత్రమే చోటు అనుకునేవాడు. అది తప్పు అని ఇప్పుడు గ్రహించటానికి ప్రయత్ని స్తున్నాడు.

అప్పుడు, ఎప్పుడూ ఆ సింహాసనం ఇద్దరికీ సగ భాగమే. ఇప్పటి స్త్రీ అధికారికంగా పక్కకి జరుగు అని అనగలుగుతోందంటే! తెర వెనుక నుంచి తెరముందుకి వచ్చిందంతే!



# అలంకారం

దర్భా లక్ష్మీ అన్నపూర్ణ

అసలు సమస్య ప్రేమ అతిశయాలంకారం మీద ఆధారపడి ఉంటుంది! వైవాహిక జీవితం వాస్తవాలంకారం మీద ఆధారపడి వుంటుంది.

ఈ పాటికి మీకు సమస్య ఏమిటో అర్థం అయిపోయివుంటుందనుకుంటాను. ప్రభాస్, ప్రణీతల మధ్య తగాదా ఇప్పుడు విడాకుల వరకూ వెళ్లింది.

ప్రణీత నా మనవరాలు- కూతురి కూతురు. నా కూతురు నా దగ్గరకి వచ్చి కన్నీళ్లు పెట్టుకుంది. ప్రేమించుకోవటం ఉత్సాహంతో పెట్టే పరుగు! ఆ తర్వాతి వైవాహిక జీవితం ఆయాసం రాకుండా వేసే సమతుల్యపు అడుగులు!

జీవితం అంతా పరుగుపెడుతూనే ఉండాలంటే ఎలా సాధ్యమవుతుంది? ఇద్దరూ ఆ పని చెయ్యటానికి అశక్తులే! కానీ ఆ అశక్తతను ఒకరికి ఒకరు నిశబ్దంగా ఆపాదించుకుంటారు.

అక్కడ మొదలవుతుంది గొడవ.

తనలాగే ఎదుటిమనిషీ అనుకుంటే- ఇలా ఎందుకూ అన్న ప్రశ్న మొదల వుతుంది. ఈ మాటలన్నీ వాళ్లిద్దరికీ చెప్పాను. ఇద్దరూ విన్నారు. వెంటనే అర్థం అయిపోతే ఇన్ని న్యాయస్థానాలూ, ఇన్నన్ని జంటలు విడిపోవటాలూ ఎందుకు ఉంటాయ్!

మోహాలు చేదుమాత్ర తిన్నట్టుగా పెట్టారు. ఇదిగో- ఇటువంటి సందర్భంలోనే వాళ్లకి నేనొకపని చెప్పాను. అదేమిటంటే- వాళ్లు ప్రేమించుకున్న నాటి సందర్భాల్లోకే వీలయితే ఆ స్థలాల్లోకే వెళ్లి వాటిని మరోసారి గుర్తు చేసుకుంటూ వాటిని మీ ఇదరులా కాకుండా మూడో వ్యక్తిగా పక్కన ఉండి చూడమన్నాను. ఇప్పుడు జరుగుతున్నది అదే!. నేను చెప్పటం ఎందుకు ప్రత్యక్షంగా చూద్దాం పదండి మరి!

*  *  *

చెరువుగట్టుమీద గాలి చల్లగా, మంద్రంగా హాయిగా వీస్తోంది. ప్రభాసూ ప్రణీతా ఆ గట్టుమీద ఆసీనులయివున్నారుగానే ఆ చల్లదనాన్ని ఆస్వాదించే స్థితిలో మాత్రం వాళ్లు లేరు. వాళ్ల మనసుల్లో చచ్చేంత ఉక్కపోతగా వుంది మరి!

ముందుగా తనే మౌనాన్ని ఛేదిస్తూ అంది ప్రణీత "ఏమిటాలోచిస్తున్నావ్?" "అసలు మా అమ్మకి నాకు ప్రభాసని పేరు పెట్టాలన్న ఆలోచన ముప్పయ్యేళ్ల క్రితమే ఎలా వచ్చిందా అని ఆలోచిస్తున్నాను! ఇప్పుడు ఈ ఆరడుగుల ప్రభాస్ వెలుగులోకి వచ్చి ఈ అయిదడుగుల ప్రభాస్ జీవితాన్ని చిందరవందర చేసేస్తాడని అప్పుడు మా అమ్మ ఊహకి అందే వీలులేదు కదా! ప్చ్" దిగుల్లో మునిగిపోతు న్నట్టుగా హీనస్వరంతో అన్నాడు ప్రభాస్.

ఆ క్షణంలో ప్రేమ మైకంలో ఇక్కడే కూర్చుని తను ఒకప్పుడు చెప్పిన మాటలు గుర్తుకి వచ్చాయ్ ఇద్దరికీ.

"నువ్వు ప్రభాసంత పొడవు లేకపోయినా ఫర్వాలేదు అసలు ఆ హీరో ప్రభాస్ అంత పొడవు ఉండటమే నాకు నచ్చదు తెలుసా!

పది రోజుల క్రితం ప్రణీత అన్నమాటలు ఇద్దరికీ జ్ఞాపకం వచ్చాయ్. మళ్లీ

"భూమికి జానెడు ఉన్నావ్ ప్రభాసన్న పేరొకటి నీ మొహానికి!"

ఇక్కడికి వచ్చేముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇద్దరూ ఓ పది నిమిషాలపాటు ప్రశాంతంగా ఆలోచించాలి. మనస్సుని మునుపటిలా రెచ్చిపోనివ్వకూడదు. రంకెలు వెయ్యనివ్వకూడదు.

గతంలో జరిగిన దృశ్యాన్ని మూడోవ్యక్తి స్థానంలో నిలబడి చూడాలి.

అందుకే మౌనంగా ఉన్నారిద్దరూ.

కాస్సేపటి తర్వాత ఎక్కడో అగాథాల్లోంచి ఒకమాట సన్నగా వినిపించటం మొదలు పెట్టింది ప్రణీతకి "ఇప్పుడు నిజంగా నీ ప్రభాస్ ఆరడుగుల వాడయితే నీకు నచ్చడు! ఈ రెండేళ్ల సాహచర్యంలో ఈ అయిదడుగుల ప్రభాసే నీ సొంతం! ఇతనే కావాలనిపిస్తుందే పిచ్చి మనసా కాస్సేపు ఆ క్షణాల్లోకి వెళ్లి జీవించు!"

ప్రణీత కాస్సేపు అదేపని చేసింది.

ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తన ప్రభాస్ పొడవుగా ఉంటే తనకి నచ్చడుగాక నచ్చడు.

"పద వెళ్దాం!" ప్రణీత గొంతు ముక్తసరిగా ఉన్నా కాస్త ప్రశాంతంగా ఉండటంతో ప్రభాస్ పొడవు గొడవ తమ జీవితాల నుంచి నిష్క్రమించినట్టే అనుకున్నాడు నిశ్చింతగా.

'ఇక రేపు తన పొగడ్తల చిట్టా ప్రారంభం అవుతుందేమో భగవంతుడా' అనుకున్నాడు గాభరంగా మరుక్షణం.

మర్నాడు ఇద్దరూ ప్రేమించుకునేటప్పుడు కూర్చున్న పార్కుకు వెళ్లి అదే బెంచీమీద కూర్చున్నారు. మళ్లీ ఇద్దరికీ లోపల ఉక్కపోతే!

'నువ్వు ఛీ అంటే నువ్వు ఛీ' అని తిట్టుకున్న పాయింట్లన్నిటి మీదా ఈ రివర్స్ ప్రోగ్రామ్‌లో చర్చ జరగావి మరి!

ఇక్కడ కూర్చుని మొదటిసారిగా ప్రణీత పెదాల వైపు చూస్తూ అన్నమాటలు, ఆ తర్వాత అన్న మాటలూ గుర్తుకి వచ్చి గతుక్కుమన్నాడు. అప్రయత్నంగా తన పెదాలని తడుముకున్నాడు ప్రభాస్. ప్రణీత గుర్రుగా చూడటం తెలుస్తోంది పక్కనుంచే.

ప్రణీత పెదాల గురించి జరిగిన వాగ్వాదం ఇద్దరి కళ్ల ముందూ మెదిలింది. ముందుగా ప్రణీతకీ 'పైగా మొన్న ఏమన్నాడూ మొహాన్ని ములక్కాడలా చేసుకుని" అప్పుడు బుద్ధిలేక నీ పెదాలు చెర్రీ పళ్లలా ఉంటాయ్ పణ్ణీ అన్నాను! ఇదిగో ఇప్పుడు చెబుతున్నాను విను నీ పెదాలు చిర్రీ పళ్లలా ఉంటాయ్ కాదు ఉండేదుస్తాయ్!"

"చిర్రీ పళ్ళా?! అవ్వేమిటి?" తను గుర్రుగా అడిగింది అప్పుడు.

"నేనే సృష్టించానులే పిచ్చిగా ఉండే పళ్లవి!" అన్నాడు కసిగా.

ఆ గతం గుర్తు కొస్తుంట ...ప్రభాస్ భయం భయంగా వాలుకళ్లతో చూశాడు. సరిగ్గా అప్పుడే ఇటువైపు చూసిన ప్రణీత మూతి మూడు వంకర్లు తిప్పి అటువైపు తిరిగిపోయింది.

కాస్సేపు ఆలోచనా ముద్రలో ఉండిపోయిన ప్రభాస్ హఠాత్తుగా కెవ్వుమన్నట్టుగా అరిచాడు.

"ఏమయింది?" చిరుగ్గా అడిగింది ప్రణీత.

''నీ పెదాలని అచ్చంగా చెర్రీపళ్లలా ఊహించుకుంటే భయం వేసింది. నీ మూతి



ఎర్రగా...”

“ఆపాపు! మరప్పుడు అలాగే కదా పొగిడావ్! తర్వాత్తర్వాత మాత్రం చీతీ, బుర్రీ అన్నావ్!”

“అబ్బే పెదాలు పెదాల్లాగే లేత చర్మం రంగులో ఉండాలి! అప్పుడలా ఎందుకున్నానో నాకర్థం కావటంలేదు ఆఁ! తాతయ్యగారు చెప్పారుగా ప్రేమించుకునేటప్పుడు అతిశయాలంకారం ఉంటుందని! ఏదీ ఇటు తిరుగు! హమ్మయ్యా ఇలాగే బావున్నావ్!”

ప్రణీత గోముగా నవ్వింది...గీరగా చూసింది.

హఠాత్తుగా ఏదో గుర్తుకి వచ్చినదానిలా అడిగింది ‘‘అవునూ ఎవరయినా పెదాలని దొండపళ్లలా ఉన్నాయంటారుగానీ నువ్వు చెర్రీ పళ్లని ఎందుకన్నావ్?’’ ‘‘అప్పుడే అడక్కపోయావూ ఇప్పుడెందుకడుగుతున్నావ్?”

“అదీ ప్రేమ పిచ్చి! గందరగోళం కనుక!”

“నాకూ అంతేగా మరి! అప్పుడు మనం కబుర్లు చెప్పుకుంటుండే రోజూ చెర్రీ పళ్లు అమ్మే అబ్బాయి వచ్చేవాడు కదా! ఆ పళ్లు చూసి నువ్వు ‘ఈ పళ్ల రంగు ఎంత బాగుందో కదా అనేదానివి! అందుకే అలా చెబితే బావుంటుందని ఐడియా వచ్చేసింది. ఇప్పుడు చెర్రీలేదు, దొండాలేదు! నీ పెదాలరంగే అద్భుతం! ఇక ఈ పెదాలరంగు ప్రహసనం ముగిసిందిగా! తర్వాతి ప్రోగ్రామ్ ఎవరిదీ నీదా నాదా?” అత్రంగా అడిగాడు ప్రభాస్.

“ఇద్దరిదీను?” తల దించుకుని అంది ప్రణీత

‘‘ఇద్దరిదీనా? అయితే ఇంకనే ఈజీగా బాలన్సయిపోతుంది! ఇంతకీ ఏవిఁటది?”

“నిన్ను చూడకుండా క్షణమైనా ఉండలేను! అది నిజంకాదనీ ప్రతిక్షణం ఎదురూ బొదురూ కూర్చుంటే ఒకరంటే ఒకరికి విసుగువుడుతుందని రుజు వయిందిగా!



ప్రభాస్ రెండు క్షణాలు ఆలోచనలో పడ్డాడు. కొత్త ఉపమానం ఏమీ దొరకలేదు. అందుకే ఇందాక చెప్పిన ఉపమానమే! పాలు పొంగుతూనే ఉంటే ఆఖరికి అడుగంటి పోయి మాడిపోతాయ్! ఒక పొంగు వచ్చిం తర్వాత ఏం చేస్తే దాన్లోంచి పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి ఇలా ఎన్ని వస్తాయో చూడు! “నువ్వే నా ప్రాణం.. నీ కోసం ప్రాణమయినా ఇచ్చేస్తానంటే నిజంగా నాకేదయినా అయితే నీ ప్రాణం ఇచ్చేస్తావా?” అడిగింది బేలగా మొహం పెట్టి ప్రణీత.

ఇంట్లో ఉన్నా ఏ గదిలోకోపోయి పుస్తకం చదువు కుంటూనో, ఫోన్ చూసుకుంటుంనో కూర్చుంటావ్! ప్రేమించుకునేటప్పుడు నిముషానికో ఫోన్ చేసేవాడివి! పెళ్లయిన కొత్తలో నా కొంగు అదేలే నా చున్ని పట్టుకుని తిరిగేవాడివి! ఇప్పుడు కుదిపి కుదిపి పలకరిస్తేనేగానీ పలకటంలేదు!”

“నువ్వు మాత్రం ముందేమో నా మాటల్ని పంచదార గుళికలూ, సున్నుండ ముక్కలూ అనేదానివి! తర్వాత్తర్వాత అబ్బా ఊరుకోండీ మీసొల్లు వాగుడు వినలేక ఛస్తున్నాను అనే దశకి వచ్చావ్!”

“వినలేకపోతే విడాకులిచ్చేయ్ అని నువ్వేకదా ఇంకో పదడుగులు ముందుకి వేశావ్!”

“ఏదో ప్రాసకుదిరింది కదా అని అఘోరించాను! నువ్వేమో పుట్టింటికిపోయి నిజంగానే విడాకులకి నోటీసు పంపించావ్!”

ఇద్దరూ కాస్సేపు ఎడమొహం, పెడమొహంగా కూర్చుండిపోయారు. కాస్సేపటి తర్వాత ప్రభాస్ అన్నాడు’’ నిజం చెప్పు నేను అలా తక్కువ మాట్లాడుతూ ఏదో ఒక ప్రక్కన కూర్చుంటేనే నీకు బావుందికదూ!”

ప్రభాస్ అడిగిన ఆ తీరుకి ప్రణీత అవునని ఒకసారి, కాదని ఒకసారీ అడ్డదిడ్డంగా తల వూపింది.

“నాకూ అంతేలే అది సహజం కనుక!”

‘‘మరి ప్రేమించుకుంటున్నప్పుడు ఒక్క క్షణమయినా చూడకుండా ఉండలేననటం” సత్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అంది ప్రణీత

“తాతయ్య గారు చెప్పారుగా వైవాహిక జీవితం వాస్తవాలంకారమని!”

‘‘అన్ని తాతయ్యగారు చెప్పనవేనేమిటి? నువ్వేదయినా చెప్పు!”

ఎలా చెప్పాలా అని మూతిమీద చూపుడు వేలుతో తట్టుకుంటూ చివరికి ఐడియా ఫ్లాష్‌లా వెలిగి మొహాన్ని కూడా వెలిగించుకుంటూ అన్నాడు ప్రభాస్ “ఇల్లు కట్టుకోవటానికి వేసే పునాది ఎలా ఉంటుందో తెలుసా! తెలిసేవుంటుంది లే! మన జీవన సౌధానికీ ఆ బరువైన, వెడల్పయిన ప్రేమ డైలాగులు అవసరం అన్నమాట! పునాదంత వెడల్పుగానూ, పైన కూడా కట్టుకుంటే మనం ఉండటానికి చోటు వుంటుందా? ప్రేమ కూడా అంతే! ఉక్కిరి బిక్కిరి అయిపోతాం! పాలెప్పుడూ పొంగుతూనే ఉంటే గిన్నెలో ఒక్క చుక్కయినా మిగులుతుందా?”

‘‘ఏదో అర్థమయినట్టే ఉందిలే. ఇక ఆయాసపడకు!” అప్పటికి విడాకులన్న ఆలోచనలోంచి ప్రణీత మనస్సు బయటికి వస్తోంది.

“హమ్మయ్య!”

“ఇన్నీ తెలిసున్నవాడివి నాతో అలా రాక్షసుడిలా దెబ్బలాడి విడాకులదాకా ఎందుకు తీసుకొచ్చావ్ మరి?”

“నేను రాక్షసుడ్నయానని గుర్తించకుండా నువ్వే రాక్షసివయ్యావనుకున్నాను!”

ఈసారి ప్రణీత ఉరిమినట్టు చూడలేదు. అందుకే ప్రభాస్ వెంటనే అన్నాడు “ఇప్పుడు జ్ఞానోదయం అయిందిగా!” ఈసారి ప్రణీత మొహం వికసించింది.

“ఇక తర్వాతదీ ఏవిఁటి నీ చేతివంట అమృతం అని పెళ్లయిన కొత్తల్లో అనటం ఇప్పుడేమో ఏం మాట్లాడకుండా తినెయ్యటం అప్పుడప్పుడు లోపాలు ఎంచటం. పైగా పక్కింటి వాళ్లు కూరేదయినా ఇస్తే ఎంత బావుందో అనటం. ఇది అంతే అతిశయాలం కారం ఇంటి పునాదిలాంటిదే!

అమృతాన్ని కూడా రోజూ సేవిస్తుంటే



మామూలు మన కాఫీలాగే అయిపోతుంది!"

"పోనీ కనీసం పాయసంలా ఉంది అనొచ్చుగా!"

"కాఫీ రోజూ తాగకపోతే ఉండలేం! అందుకే కాఫీతో పోల్చాను నీ చేతివంటని!"

ప్రణీత పెదవులమీదకి ముసిముసి నవ్వులు మధురంగా ముసురుకుంటూ వచ్చాయ్ అవి రెండుక్షణాలే మనగలిగాయ్.

మళ్లీ కస్సుమంది. కస్సుమనటంలో కాస్తంత నటనే ఉంది. "అప్పుడేమో నా నడక హంసనడక కన్నా బావుంటుందన్నావ్! ఇప్పుడేమో ఏవిటా హంసనడక అడుగులు తొందరగా వెయ్యి అని విసుక్కుంటావో! దీని సంగతి?" ఏవిటి అన్నట్టు కనుబొమలెగరేసింది.

ప్రభాస్ రెండు క్షణాలు ఆలోచనలో పడ్డాడు. కొత్త ఉపమానం ఏమీ దొరకలేదు. అందుకే ఇందాక చెప్పిన ఉపమానమే! పాలు పొంగుతూనే ఉంటే ఆఖరికి అడుగంటిపోయి మాడిపోతాయ్! ఒక పొంగు వచ్చిం తర్వాత ఏం చేస్తే దాన్లోంచి పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి ఇలా ఎన్ని వస్తాయో చూడు!"

"నువ్వే నా ప్రాణం.. నీ కోసం ప్రాణమయినా ఇచ్చేస్తానంటే నిజంగా నాకేదయినా అయితే నీ ప్రాణం ఇచ్చేస్తావా?" అడిగింది బేలగా మొహం పెట్టి ప్రణీత.

"నువ్వా అన్నావుగా బోలెడన్నిసార్లు ఆ మాట?"

"ముందు నువ్వు చెప్పు నేను తర్వాత చెబుతానులే!"

"ప్రాణం ఇచ్చెయ్యటమంటే నీకేదయినా అయితే నా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతానని! నేను చనిపోతే నువ్వు జీవచ్ఛవమైపోవటం!" అని అంటుంటే ప్రభాస్ నోటికి చప్పున తన చేతిని అడ్డం పెట్టిందీ. ప్రేమను అతని భుజం మీద తలవాల్చుకుంది. "ఈ విషయాలన్నీ నీకెప్పుడు అర్థం అయ్యాయ్"?

"తాతగారు ఆలోచించమని చెప్పనప్పట్నుంచీ!"

"అవును మనని మూడోవ్యక్తిగా ప్రక్క నుంచి చూడమన్నప్పుడు నాకు మన పరస్పర ఆరోపణలు ఎంత అర్థం లేనివో, విలువైన జీవితం ముందు అవి ఎంత అప్రధానమైనవో అర్థం అయింది!"

"తాతయ్యగారి దగ్గరికి మన సమస్యని తీసుకువెళ్లి ఉండకపోతే ఈ పాటికి మనం విడిపోయి ఉండేవాళ్లమేమో!" ప్రభాస్ విచారంగా అన్నాడు. అతని చేతులు ప్రణీత చుట్టూ ప్రేమగా బిగుసుకున్నాయ్.

మూడు పువ్వులూ, ఆరుకాయలూ అన్నట్టుగా సాగిపోతోంది ప్రభాస్, ప్రణీతల సంసారం.

తీరిగ్గా కూర్చున్న ప్రభాస్ అన్నాడొకరోజు "నిన్ను చూడకుండా ఒక్క క్షణమయినా ఉండలేను అనడం ఒక రకంగా నిజమే పణ్ణీ! ప్రేమించుకునేటప్పుడు నువ్వూ, నేనూ ఇంకా వేరువేరు కనుక అలాగే చెప్పుకోవాలి!

ఇప్పుడు జీవితంలో ఒకరికి ఒకరం ప్రతిక్షణం ఫిక్సయిపోయాం కనుక కాస్సేపు కనిపించకపోయినా, దూరంగా ఉన్నా దగ్గరగా వున్నా ఫీలింగే ఉంటుంది. నువ్వు నా అర్థాంగివి కదా! అదన్నమాట ఈ పెళ్లి మేజిక్కు!"

"మీరింకా అదే చెప్పటానికి ప్రయత్నిస్తున్నారా? పెళ్లిలోని సహజత్వాన్ని నేనిప్పుడు బాగానే అర్థం చేసేసుకున్నాను!" ఓ విధమైన నిర్భయత్వంతో, ధీమాతో అంది ప్రణీత.

"ప్రేమావేశంలో అతిశయాలంకారం, పెళ్లి జీవితంలో వాస్తవాలంకారం! మన సయోధ్య ఈ సృష్టికి అలంకారం!" హాయిగా నవ్వేశాడు ప్రభాస్!

* * *

చూశారుగా వాళ్ళిద్దరిమధ్యనా జరిగిన కథ!

అదండీ సంగతి. ఇలాంటి పిల్లలెవరయినా ఎదురయితే మీరూ యిలా చెప్పి చూడండి!

**వచ్చేవారం కథ..**

**ద్యోతకం – డా. నెల్లుట్ల నవీన్‌చంద్ర**

# కులగణన 'సర్వరోగ నివారణి' కాదు

'రాహుల్‌గాంధీ కులగణన జపం చేస్తున్నారు. అదేమీ సర్వరోగ నివారణి కాదు. లేకపోతే దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని సమూలంగా నిర్మూలించడానికో, అసమానతలను తొలగించడానికో పనికొచ్చేదీ కాదు' ఈ మాటలు కాంగ్రెస్సేతర నాయకుడెవరో అన్నవి కావు. శతాధిక వర్షాల కాంగ్రెస్ పార్టీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ఆనందశర్మ. పైగా ఏదో సభలోనో, ఇంటర్వ్యూలోనో చెప్పినది కూడా కాదు. నేరుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఈ మేరకు ఒక ఉత్తరమే రాశారు శర్మ.


ఆనందశర్మ


రాహుల్

అంటే నా వ్యాఖ్యలు వక్రీకరించారు అంటూ మాట మార్చడానికి అవకాశమే లేదు. అలాంటి కులగణనలు ఇందిర, రాజీవ్ వారసత్వానికి వ్యతిరేకమని కూడా శర్మ హెచ్చరించారు. నిజంగా ఇదొక విప్లవమే.

ఇలాంటి ఒక సంచలన డిమాండ్‌ను పార్టీ అధిష్ఠానం ముందు ఉంచడానికి ఆనందశర్మ ఎంచుకున్న సమయం కూడా కీలకమైనదే. లోక్‌సభ ఎన్నికలకి ముహూర్తం ఖరారైంది. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఏమేమి చేస్తుందో ఒక లిస్టు కూడా బయటపెట్టింది. అందులో కులగణన ఒకటి. అంటే ఎన్నికల అంశాన్ని చేసుకుంది. అసలు కాంగ్రెస్ ఏనాడూ అస్తిత్వ రాజకీయాల జోలికి వెళ్లలేదని కాబట్టి ఇప్పుడు ఆ పనికి పూనుకుంటే ప్రజాస్వామ్యానికి క్షేమం కాదని కూడా ఆనందశర్మ వ్యాఖ్యానించారు. భారతీయ సమాజంలో కులం ఒక వాస్తవమే కావచ్చు. అయినా అలాంటి అస్తిత్వ రాజకీయాలను కాంగ్రెస్ ప్రోత్సహించలేదని ఆయన చెప్పారు.

# భగత్‌సింగ్ 93వ వర్ధంతి.. కొన్ని విశేషాలు

మార్చి 23, 2024న భగత్‌సింగ్ 93వ వర్ధంతిని భారతదేశమంతటా నిర్వహించారు. భారత్‌లో మరెక్కడ ఆ కార్యక్రమాలు నిర్వహించినా హుస్సేనీవాలా అనే కుగ్రామంలో అర్పించే నివాళికి మాత్రం ప్రత్యేకతనివ్వాలి. పాకిస్తాన్‌లో పంజాబ్ భూభాగంలో, భారత్ సరిహద్దులోనే ఈ గ్రామం ఉంది. ఇక్కడ కూడా ఏటా భగత్‌సింగ్, ఆయనతో పాటే ఉరికంబం ఎక్కిన రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నివాళి ఘటిస్తారు. హుస్సేనీవాలా ఒక గొప్ప చారిత్రక ఘట్టానికి సాక్షి. ఆ ముగ్గురు మహోన్నత దేశభక్తుల భౌతికకాయాలకు 1931లో ఉరి తీసిన తరువాత ఇక్కడే అత్యంత రహస్యంగా అంత్యక్రియలు నిర్వహించారు. పైగా ఈ గ్రామం సట్లెజ్ నదీతీరంలోనే ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్నది కాబట్టే ఈ గ్రామాన్ని భారత్‌లో కలుపుకోవడానికి 12 గ్రామాలను పాకిస్తాన్‌కు

విభజన సమయంలో ఇవ్వవలసి వచ్చింది. ఏటా ఇక్కడ ఇప్పటికీ షహీద్ మేళా నిర్వహిస్తున్నారు. అది కూడా మార్చి 23వ తేదీనే. ఈ గ్రామం పక్కనే గండాసింగ్ వాలా అనే గ్రామం ఉంటుంది. ఈ రెండు ఫిరోజ్‌పూర్ నగరానికి దగ్గరగా ఉన్నాయి. హుస్సేనీవాలా పేరు ఒక ముస్లిం పకీర్ పేరుతో వచ్చినా, తరువాత ఇది ఆ ముగ్గురు మహనీయులను తనలో కలుపుకున్న నేలగానే చరిత్ర ప్రసిద్ధమయింది. వారి స్మారకస్తూపాలు నిర్మించిన ప్రాంతాన్ని ప్రేరణా స్థల్ అని పిలుస్తున్నారు. భగత్‌సింగ్ జాతీయ అసెంబ్లీలో బాంబులు వేసి సంచలనం సృష్టించిన సంగతి తెలిసినదే. ఆ ముగ్గురు మహనీయులు భారత స్వాతంత్ర్యోద్యమంలో అద్భుతమైన స్థానం ఉన్నవారే.





## తెలంగాణ బాలికకు మోదీ హామీ

'నీ 25వ గ్రంథాలయం ప్రారంభోత్సవానికి నేను వస్తాను!' ఇది సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ ఒక తెలంగాణ బాలికకు ఇచ్చిన హామీ. ఆకర్షణ సతీశ్ అనే ఈ బాలిక ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలలో 11 గ్రంథాలయాలు స్థాపించింది.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఆకర్షణ ఇటీవల ప్రధాని నగరానికి వచ్చినప్పుడు కలుసుకున్నది. ఆమె ఇంతవరకు 7,008 పుస్తకాలు సేకరించింది. వాటితోనే 10 గ్రంథాలయాలు తెలంగాణ రాష్ట్రంలో ఒకటి తమిళనాడులో ఏర్పాటు చేసింది. ఆకర్షణ ఆరంభించిన ఈ అద్భుత ఉద్యమం వెనుక గొప్ప మానవత్వం, నేపథ్యం ఉన్నాయి. ఒకసారి కీమోథెరపీ వైద్యం చేయించుకుంటున్న కొందరు చిన్నారులను ఆమె చూసింది. వారంతా కలరింగ్ పుస్తకాలు కావాలని, దాంతో సమయం ఇట్టే గడచిపోతుందని కోరారు. ఇదే ఆకర్షణను ఈ ఉద్యమానికి పురిగొల్పింది. అది కూడా ఆసుపత్రిలో రోగులకు కొవిడ్ సమయంలో తండ్రితో కలసి ఆహారం అందించినప్పుడు జరిగింది. వెంటనే ఆమె తన కాలనీ సంక్షేమ సంఘం సాయం తీసుకుంది. ఒక వాట్సాప్ గ్రూప్ పెట్టి పుస్తకాల కోసం అభ్యర్థించింది. తన అభ్యర్థనకు వచ్చిన స్పందన చూసి ఆమె దిగ్భ్రాంతికి లోనయింది. రెండురోజులలోనే వందలాది పుస్తకాలు వచ్చి పడ్డాయి. వాటిని ఎంఎన్‌జె ఆసుపత్రిలో భద్రపరిచారు. ఇక ఆమె వెనక్కి చూడలేదు. వరసగా సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, గాయత్రినగర్ అసోసియేషన్ బోరబండలో, బాలనేరస్థుల బాలికల నిలయం (హైదరాబాద్), కోయంబత్తూర్ ఇలా స్థాపించుకుంటూ వెళ్లింది. ఒక బాలిక ఇంత కృషి చేసిన తరువాత మోదీ ఇంటర్వ్యూ దొరికింది. ఇటీవల జగిత్యాల వచ్చినప్పుడు పది నిమిషాలు సమయం ఇచ్చారు. అయితే ఆ సమావేశం 23 నిమిషాలు సాగింది. ఆమె కృషి, ఆశయంలోని అద్భుత దృష్టికి కరిగిపోయిన ప్రధాని 25వ గ్రంథాలయాన్ని తానే ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు.

## వీహెచ్‌పీ అమెరికా శాఖ ఆధ్యాత్మిక యాత్ర




విశ్వహిందూ పరిషత్ అమెరికా శాఖ ఒక వినూత్న ఆధ్యాత్మిక యాత్రను ఆరంభించింది. రామమందిర్ రథయాత్ర పేరుతో సాగే ఈ యాత్ర హోలీ సందర్భంగా షికాగోలో మార్చి 25న మొదలయింది. అమెరికాలోని 48 రాష్ట్రాలలో ఉన్న 851 ఆలయాల మీదుగా వెళుతుంది. అరవై రోజుల పాటు, 12,800 కిలోమీటర్ల మేర యాత్ర సాగుతుంది. పెద్ద ఆలయాలే కాకుండా, కొన్ని చిన్న చిన్న ఆలయాలను కూడా ఈ యాత్ర కలుపు కుంటుంది. ఈ సంవత్సరం జనవరి 22న జరిగిన అయోధ్య బాలక్‌రామ్ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రపంచంతో పాటు అమెరికాలోని హిందువులు, ఇతర వర్గాల వారు కూడా ఆనందోత్సాహాలు ప్రకటించారు. పలు కూడళ్లలో బిల్‌బోర్డులు ఏర్పాటు చేసి రామకథ వివరాలను, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. టయోటా సీయెన్నా మినీవ్యాన్‌ను రథంలా తయారు చేశారు. ఇందులో సీతారామ లక్ష్మణులు, హనుమ ప్రతిమలు ప్రతిష్ఠించారు. భక్తులకు ఇవ్వడానికి ఇందులోనే ప్రాణప్రతిష్ఠ అంక్షింతలు కూడా ఉంచారు. వీటితో పాటు ఒక కలశం కూడా ఉంది. వీహెచ్‌పీ అమెరికా శాఖ ప్రధాన కార్యదర్శి అమితాబ్ మిట్టల్ ఈ వివరాలు వెల్లడించారు. అయోధ్య ప్రాణప్రతిష్ఠతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 1.5 బిలియన్ హిందువులు పునరుత్తేజం పొందారని మిట్టల్ చెప్పారు. అమెరికాలో ఇంత పెద్ద స్థాయిలో హిందువులకు సంబంధించిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం ఇదే తొలిసారి.

అమెరికా విశ్వహిందూ పరిషత్ శాఖ నిర్వ హిస్తున్నట్టే కెనడా శాఖ కూడా రామరథయాత్రను తలపెట్టింది. అక్కడి 150 హిందూ ఆలయాల మీదుగా ఆ యాత్ర సాగుతుంది. హిందూధర్మం గొప్పదనం వివరించడమే ఈ యాత్ర ఉద్దేశమని హిందూ మందిరాల సాధికారత సమితి (కెనడా) నాయకుడు తేజల్ షా చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల కోసం, వారి వారసుల కోసం మన ధర్మం గురించి చైతన్యం కలిగించవలసి ఉంటుందని ఆయన అన్నారు. ★

అంతర్జాతీయ క్రికెట్ మూడు విభాగాలలోనూ భారత్ నంబర్ వన్ జట్టుగా నిలవడం వెనుక పటిష్టమైన దేశవాళీ క్రికెట్ వ్యవస్థ ఉంది. ఈ క్రికెట్‌కు మూలస్తంభం ఏదంటే ముంబై అని మాత్రమే చెప్పుకోవాలి. అదిలేనిదే భారత క్రికెట్ లేనేలేదు.



# దేశవాళీ క్రికెట్లో ముంబై 'ఘరానా'..!

ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన రెండు దేశాలలో ఒకటైన భారత్ లో అత్యంత జనాదరణ పొందుతున్న క్రీడ క్రికెట్. ప్రస్తుత ప్రపంచ క్రికెట్ ను భారత్ శాసించడం వెనుక తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన దేశవాళీ క్రికెట్ వ్యవస్థ పాత్ర ఎంతో ఉంది.

**1934-35 నుంచి 2023-24 వరకూ...**

భారత దేశవాళీ క్రికెట్ అనగానే రంజీట్రోఫీ ముందుగా గుర్తుకు వస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వమే భారత అప్పటి క్రికెటర్, నవానగర్ మహారాజా రంజిత్ సింహ్ జీ పేరుతో 1934–35 సీజన్ నుంచి రంజీట్రోఫీని నిర్వహిస్తూ వస్తున్నారు. అప్పట్లో 15 జట్లతో ప్రారంభమైన రంజీట్రోఫీ కాలానుగుణంగా మారుతూ ప్రస్తుతం 32 జట్ల లీగ్ కమ్ నాకౌట్ స్థాయికి విస్తరించింది.

కర్నల్ కఠారీ కనకయ్య నాయుడు, సునీల్ గవాస్కర్, సచిన్ టెండుల్కర్, కపిల్ దేవ్, దిలీప్ వెంగ్ సర్కార్, విజయ్ మర్చెంట్, గుండప్ప విశ్వనాథ్, చంద్రశేఖర్, బేడీ, ప్రసన్న నుంచి నేటితరం స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్, యశస్వీ జైశ్వాల్ వరకూ ఎందరెందరో గొప్పగొప్ప ఆటగాళ్లు భారత దేశవాళీ క్రికెట్ నుంచి అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టినవారే.

**అమ్మఒడి దేశవాళీ క్రికెట్.....**

2008లో ఐపీఎల్ ప్రారంభంకాక ముందు వరకూ భారత క్రికెట్‌కు దేశవాళీ క్రికెట్ ప్రామాణికంగా, ఆటగాళ్ల ప్రతిభకు వేదికగా ఉంటూ వచ్చింది. భారతజట్టులో చోటు సంపాదించాలంటే రంజీక్రికెట్లో అత్యుత్తమంగా, నిలకడగా రాణించి తీరక తప్పని పరిస్థితి ఉండేది. ఐపీఎల్ రాకతో రంజీట్రోఫీ ప్రాధాన్యం కొంతవరకూ తగ్గినా టెస్టు జట్టు ఎంపికకు మాత్రం ప్రామాణికంగా నిలుస్తూ వస్తోంది. రంజీట్రోఫీ తొలిరోజుల్లో మూడురోజుల మ్యాచ్ లో పాల్గొన్న ఆటగాళ్లకు 3 రూపాయలు బేటాగా చెల్లించేవారు. అయితే... ప్రస్తుతం రంజీ క్రికెటర్లు మ్యాచ్ ఆడిన ఒక్కోరోజుకు 25 వేల రూపాయల నుంచి 50 వేల రూపాయలు మ్యాచ్ ఫీజుగా అందుకొంటున్నారు. ప్రస్తుత దేశవాళీ క్రికెట్లో సీజన్ కు 10 మ్యాచ్ లు ఆడిన ఒక్కో రంజీ ఆటగాడి కి బీసీసీఐ 25 లక్షల రూపాయల వరకూ చెల్లిస్తోంది.

**రంజీట్రోఫీకి మరో పేరు ముంబై....**

దేశవాళీ రంజీ ట్రోఫీకి ముంబై మరోపేరుగా నిలిచింది. రికార్డుస్థాయిలో 42వసారి విజేతగా నిలవడం ద్వారా తన రికార్డును తానే అధిగమించింది. హోంగ్రౌండ్ వాంఖడే స్టేడియం వేదికగా ముగిసిన 2023-24 సీజన్ టైటిల్ సమరంలో విదర్భను 169 పరుగులతో చిత్తు చేయడం ద్వారా ఎనిమిదేళ్ల విరామం తరువాత ట్రోఫీ అందుకొంది. 1934-35 నుంచి 2023-24 సీజన్ల మధ్య కాలంలో ముంబై రంజీట్రోఫీని నెగ్గినన్నిసార్లు మరేజట్టు సాధించలేకపోడం విశేషం.

గొప్ప క్రికెటర్లను తయారు చేయటమే కాదు... గొప్పజట్లను తీర్చి దిద్దుతూ తనదైన క్రికెట్ సంస్కృతిని పాదుకొల్పిన ఘనత ముంబై క్రికెట్ సంఘానికి మాత్రమే దక్కుతుంది.

**స్టార్ ప్లేయర్లు అందుబాటులో లేకున్నా...**

భారత కెప్టెన్ రోహిత్ శర్మ, యువఓపెనర్ యశస్వి జైశ్వాల్, సర్ ఫ్రాజ్ ఖాన్ లాంటి మేటి బ్యాటర్లు అందుబాటులో లేకున్నా మాజీ చాంపియన్ అజింక్యా రహానే నాయకత్వంలో ముంబై 2023-24 రంజీ ఫైనల్స్‌కు చేరడం, అందుబాటులో ఉన్న ఆటగాళ్లతోనే విజేతగా నిలవడం ఘనతగా మిగిలిపోతుంది.

గత తొమ్మిది దశాబ్దాల కాలంలో 48సార్లు రంజీ ఫైనల్స్ చేరడంతో పాటు 42 సార్లు విజేతగా, ఆరుసార్లు రన్నరప్ గా నిలిచిన అరుదైన రికార్డు కేవలం ముంబైకి మాత్రమే సొంతం.

విదర్భతో జరిగిన టైటిల్ పోరులో తొలి ఇన్నింగ్స్ లో ముంబై తడబడినా... ప్రత్యర్థిని 105 పరుగులకే కుప్పకూల్చడం, తన రెండో ఇన్నింగ్స్ లో భారీస్కోరు సాధించడం ద్వారా టైటిల్ ఖాయం చేసుకోగలిగింది.

విదర్భ టెయిల్ ఎండర్ ఉమేశ్ యాదవ్ ను వెటరన్ ధవళ్ కులకర్ణీ పడగొట్టడంతో ముంబై 42వసారి రంజీట్రోఫీ విజేతగా నిలువగలిగింది. ముంబై విజయంలో ప్రధానపాత్ర వహించిన యువబ్యాటర్ ముషీర్ ఖాన్ కు ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్స్ అవార్డు దక్కింది.

**ముంబైజట్టుకి 10 కోట్ల నజరానా...**

రంజీట్రోఫీ విజేత ముంబైజట్టుకు బీసీసీఐ 5 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీగా చెల్లిస్తే... ముంబై క్రికెట్ సంఘం తమ ఆటగాళ్లకు మరో 5 కోట్ల రూపాయలు బోనస్ గా ప్రకటించింది. ముంబై జట్టులోని సభ్యులంతా మొత్తం 10 కోట్ల రూపాయల ప్రైజ్ మనీని పంచుకోనున్నారు. ముంబై క్రికెట్ పరంపరను కొనసాగించిన జట్టు సభ్యులకు 5 కోట్ల రూపాయలు అదనంగా ఇస్తున్నట్లు ముంబై క్రికెట్ సంఘం అధ్యక్షుడు అమోల్ కాలే, కార్యదర్శి అజింక్యా నాయక్ ప్రకటించారు. ప్రస్తుత సీజన్లో ముంబై తరపున 10 మ్యాచ్ లు ఆడిన ఒక్కో ఆటగాడు 25 లక్షల రూపాయల చొప్పున మ్యాచ్ ఫీజు అందుకోనున్నాడు.

ముంబై క్రికెట్ ప్రధాన కేంద్రం వాంఖడే స్టేడియం 50 సంవత్సరాల వేడుకల సమయంలోనే ..వాంఖడే సేడియం వేదికగా జరిగిన రంజీ ఫైనల్లో ముంబైజట్టే విజేతగా నిలవడం ఓ చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుంది. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

## కేశవ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో ఉచిత హెయిర్ కటింగ్, బ్యూటిషియన్ కోర్సుల శిక్షణ




**భాగ్యనగర్:** మార్చి 24న కేశవ నిలయంలో కేశవ సంవర్ధన సమితి భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఉచిత హెయిర్ కటింగ్, బ్యూటిషియన్ కోర్సుల శిక్షణ కార్యక్రమం జరిగింది.

సమాజంలోని యువతీయువకులకు సమితి నిర్వ హిస్తున్న అనేక సేవా,



ఉపాధికల్పన కార్యక్రమాలలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్ణయించారు. ఈ శిక్షణ ఇవ్వడంలో నిష్ణాతులైన అకాడమీల యజమానులు సేవాభావంతో ముందుకు వచ్చారు.

ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు కృష్ణారెడ్డి, సమితి ప్రధాన కార్యదర్శి కొప్పరపు బాలయ్య, తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, ట్రైనింగ్ అకాడమీల యజమానులు గరుడాస్ అకాడమీ, విజయకుమార్ (మెహదీ పట్నం),D.che అకాడమీ, శ్రీనివాసులు (బాగ్‌లింగంపల్లి), గరూస్ అకాడమీ సాయిక్రిష్ణ (మాదాపూర్) పాల్గొన్నారు. ★

## చారిత్రక ప్రదేశాల సందర్శన యాత్ర

**భాగ్యనగర్:** ఇతిహాస సంకలన సమితి, భాగ్యనగర్ ఆధ్వర్యంలో మార్చి 24న చారిత్రక ప్రదేశాల సందర్శన యాత్ర చేశారు. రెండు బస్సులలో సాగిన ఈ యాత్ర నల్లగొండ జిల్లాలోని వల్మిడి, జనగామ జిల్లాలోని పాల్కురికి సోమనాథుడి స్వగ్రామమైన పాలకుర్తి, భక్తకవి, శ్రీమద్ భాగవత రచయిత పోతనామాత్యుల వారి స్వగ్రామం బమ్మెర, కొలనుపాకలోని జైన దేవాలయము, 2000 ఏళ్ల నాటి శివాలయములు, భువనగిరి దగ్గరలో గల స్వర్ణగిరి (శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం) మొదలైన ప్రదేశాలను సందర్శించారు. చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్




ఈ ప్రదేశాల ప్రాముఖ్యతను గురించి యాత్రికులకు వివరించారు. ఈ యాత్రలో మహిళలు, పిల్లలతో సహా మొత్తం 63 మంది పాల్గొని చారిత్రక విశేషాలు తెలుసుకున్నారు. ★



## తిమ్మాపురం గ్రామంలో గోపూజ, సత్సంగం

**నల్గొండ :** జిల్లా గ్రామవికాస్ ఆధ్వర్యంలో మార్చి 25న పాల్గుణ పౌర్ణమి (కామపౌర్ణమి) సందర్భంగా ప్రాకృతిక వ్యవసాయం, పర్యావరణ సమతుల్యత, భూ సుపోషణ గురించి తెలియ చేయటానికి నల్లగొండ జిల్లా అనుమూల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గోపూజ, సత్సంగం జరిగింది. ఈ కార్యక్రమంలో గోవు విశిష్ఠత, విషరసాయన ఎరువుల వికృత వినియోగం వలన మన సమాజంలో కలుగుతున్న అనార్థాల గురించి అవగాహనను కలిగిస్తూ, భవిష్యత్ తరాలను ఆరోగ్య వంతులుగా ఉంచటానికి విభాగ్ గ్రామ వికాస్ సంయోజక్ గుర్రం ప్రభాకర్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రెండువందలమంది రైతు, మాతృమూర్తులతోబాటు ఆర్.ఎస్.ఎస్. నుండి ఖండస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు. ★

# కుట్టుశిక్షణ, జ్యూట్ బాగ్స్‌పై శిక్షణ



**భాగ్యనగర్:** విశ్వహిందూపరిషత్, కరుణశ్రీ సేవాసమితి ఆధ్వర్యంలో మార్చి 23న జరిగిన కుట్టు, జ్యూట్ బాగ్స్ తయారిపై శిక్షణ కార్యక్రమంలో దుర్గావాహిని సంయోజకురాలు వాణీ సక్కుబాయి మహిళలకు మార్గదర్శనం చేశారు.

ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ఆచార్య కడారి సత్యమూర్తి, సమితి కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, కోశాధ్యక్షులు రాజుపేట సత్యనారాయణ, దుర్గామహిళా తరగతుల శిక్షకురాలు రమా పాల్గొన్నారు.

### మార్చి 15,16,17 తేదీలలో నాగపూర్ అఖిల భారతీయ ప్రతినిధి సభలలో జరిగిన మార్పులలో నూతన బాధ్యతలు

| | |
|---|---|
| 1. అతుల్ లిమయే | : సహ సర్‌కార్యవాహ |
| 2. అలోక్ కుమార్ | : సహ సర్‌కార్యవాహ |
| 3. జగదీశ్ | : అఖిల భారత శారీరక్ ప్రముఖ్ |
| 4. ఓ.కె.మోహనన్ | : అఖిల భారత సహ శారీరక్‌ప్రముఖ్ |
| 5. సునీల్‌భాయ్ మెహతా | : అఖిల భారత బౌద్ధిక్ ప్రముఖ్ |
| 6. దీపక్ | : అఖిల భారత సహ బౌద్ధిక్ ప్రముఖ్ |
| 7. విజయ్ | : అఖిల భారత సహ వ్యవస్థా ప్రముఖ్ |
| 8. సెంథిల్ కుమార్ | : అఖిల భారత సహ సేవాప్రముఖ్ |
| 9. భారత్ భూషణ్ | : అఖిల భారత సహ సంపర్క ప్రముఖ్ |
| 10. ప్రదీప్ జోషి | : అఖిల భారత సహ ప్రచార ప్రముఖ్ |
| 11. స్వాంత రంజన్ | : అఖిల భారత ప్రచారక్ ప్రముఖ్ |
| 12. సునీల్ కులకర్ణి | : అఖిల భారత సహ ప్రచారక్‌ప్రముఖ్ |
| 13. డాక్టర్ మన్మోహన్ వైద్య | : అఖిల భారత కార్యకారిణి సదస్యులు |
| 14. అద్వైత్ | : సద్భావన టోలి |
| 15. డాక్టర్ వామన్ శనై | : దక్షిణ మధ్య క్షేత్ర సంఘచాలకులు |

## 'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

**జీవన శైలి మార్పు ఫలితం ఏమిటి? తీరిక లేని జీవితాలలో మిగిలినదేమిటి?**
**అద్దె గర్భాల అన్వేషణ ఆధునిక కాలానికి అనివార్యమా?**



**ధారావాహిక**
**వచ్చేవారం నుంచి...**



రచన: సంబరాజు లీల (లట్టుపల్లి)

తెలుసుకుందాం

# వీరభద్రస్వామి ఆలయం - లేపాక్షి



ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి ఆలయం కొలువుదీరింది. దీనిని 1530లో విజయనగర సామ్రాజ్యంలో ఉన్న విరూపన్న నాయక, వీరన్న సోదరులు నిర్మించారు. ఈ ఆలయంలో కొలువై ఉన్న దేవుడు వీరభద్రస్వామి. దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ప్రతి సంవత్సరం దేశం నలుమూలల నుండి అనేక మంది భక్తులు తరలి వస్తుంటారు. ఆలయానికి సుమారు 200 మీటర్ల దూరంలో ఏకరాతితో చెక్కిన నంది విగ్రహం దర్శనమిస్తుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ మధ్యనే యునెస్కో జాబితాలోకి చేరింది.

కథ

# శత్రువు - మిత్రుడు



ఒక అడవిలో ఒక జింక ఉండేది. అది చాలా అందంగా, చలాకీగా ఉండేది. చెంగు చెంగున ఎగురుతూ, గంతులు వేస్తూ అడవి అంతా కలియ తిరుగుతుండేది.

మిలమిల మెరిసే తన చర్మం, దాని మీద అందమైన పువ్వులలాంటి మచ్చలు చూసుకుని జింక ఎంతో గర్వపడుతుండేది.

ఒకరోజు జింక వెళుతుండగా దారిలో దానికి ఒక నక్క ఎదురువచ్చింది. "నా దారికే ఎదురొస్తావా? ఎంత పొగరు నీకు" అంది జింక కోపంగా.

"ఈ అడవి నీ సొంతం కాదు. ఈ దారిని నువ్వు కొనుక్కోలేదు" అంది నక్క కూడా అంతే కోపంగా.

అవి రెండూ తీవ్రంగా గొడవపడ్డాయి. "నిన్నేం చేస్తానో చూడు" అంటూ వెళ్లిపోయింది నక్క.

ఎలాగైనా ఆ జింక పొగరు అణచాలని నక్క కుతకుతలాడిపోసాగింది.

మరుసటిరోజు జింక ఇలాగే ఒక తోడేలుతో పోట్లాట పెట్టుకుంది.

చాటు నుంచి ఈ విషయం గమనించిన

## పద్యం

పిన్నల పెద్దలయెడఁ గడు
మన్ననచే మెలఁగు సుజన మార్గంబులు నీ
వెన్నుకొని తిరుగుచుండిన
నన్నియెడల నెన్నఁబడుదువన్న కుమారా!

**భావం :** ఓ కుమారా! నీవు చిన్నవారిని, పెద్దవారిని చూచినయెడల మర్యాదతో ప్రవర్తింపుము. మంచివారు నడచు మార్గములందు నడువు, అట్లు నీవు ప్రవర్తించుచుండిన యెడల లోకము నందంతటనూ ప్రఖ్యాతికెక్కగలవు.

## శ్లోకం

'ధీరాణాం నిశ్చలం మన:
చలంతు గిరయ: కామం
యుగాంత పవనాహతా:
కృచ్ఛేపి న చలత్యేవ
'ధీరాణాం నిశ్చలం మన:

**భావం :** ప్రళయకాలంలో వీచే ప్రచండ గాలులకు పర్వతాలు కుదుళ్ల సహా కదలి పోవచ్చు. కానీ ఎన్ని కష్టాలు చుట్టుముట్టినా ధీరుడి మనసు చలించదు. స్థిరంగా ఉంటుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| లావు | భూమి |
| పృథ్వీ | పండుగ |
| వైరం | బలం |
| తరువు | చెట్టు |
| బందీఖాన | శత్రుత్వం |
| పర్వం | జైలు |

జవాబులు : లావు–బలం; పృథ్వీ–భూమి; వైరం–శత్రుత్వం; తరువు–చెట్టు; బందీఖాన–జైలు; పర్వం–పండుగ.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### పూర్ణిమ అర్వింద్ పక్వాస



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక కార్యకర్త. 5 అక్టోబర్ 1913న గుజరాత్‌లో జన్మించారు. చిన్ననాటి నుంచే స్వాతంత్ర్యోద్యమం వైపు అడుగులు వేశారు. 18 ఏళ్ల వయసులోనే దండి మార్చ్‌లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా బ్రిటిష్ పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. జైలులో ఉన్న ఆమె సహచర ఖైదీ కస్తూర్బా గాంధీకి ఇంగ్లిష్ చదవడం, రాయడం నేర్పించారు. స్వాతంత్ర్యానంతరం 1954లో బొంబాయిలో మహిళల సాంస్కృతిక, శారీరక, ఆధ్యాత్మిక విద్య కోసం శక్తిదళ్ అనే సంస్థను ప్రారంభించి సేవలందించారు. 25 ఏప్రిల్ 2016న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా ఎవరు నియమితులయ్యారు?
2. భారతీయ రిజర్వ్ బ్యాంకును ఎప్పుడు స్థాపించారు?
3. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల లోక్‌సభతో పాటు, నాలుగు రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆ రాష్ట్రాలేవి?

సమాధానాలు : 1. సి.పి. రాధాకృష్ణన్; 2. 1935, ఏప్రిల్ 1; 3. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం.



నక్క తోడేలు దగ్గరికి వెళ్లి “రాను రాను ఈ జింక గర్వం ఎక్కువైపోతున్నది. అది నీకు శత్రువు! నాకు శత్రువు. శత్రువుకు శత్రువు మిత్రుడు అంటారు. కాబట్టి మనిద్దరం ఈ రోజు నుంచి మిత్రులం, మనం ఇద్దరం కలిసి దాని పొగరు అణుద్దాం” అంది.

దానికి తోడేలు “ఓసి వెర్రినక్కా! శత్రువుకు శత్రువు మిత్రుడు అనేది పాత మాట, ఎవరికీ శాశ్వత శత్రువులు గానీ శాశ్వత మిత్రులు గానీ ఉండరు అనేది కొత్త నానుడి. వినలేదా నువ్వు. ఈరోజు నీకు నాతో పని పడినట్లుగానే రేపు నాకు ఆ జింకతో పని పడవచ్చు” అంటూ వెళ్లి పోయింది. ★

## మెదడుకు మేత

వానా లేక ఎండా లేక పైరు పచ్చంగా, ఆకు లేక సున్నం లేక నోరు ఎర్రంగ.. ఏమిటది?

జవాబు : చిలుకముక్కు.

## మంచిమాట

**గతం గురించి ఆలోచిస్తూ.. భవిష్యత్తును పాడుచేసుకోవడం మూర్ఖుల లక్షణం!**




# వారఫలాలు

01- 07 ఏప్రిల్, 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలు స్నేహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆదాయం కాస్త పుంజుకుంటుంది. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థులకు కొంత ఊరట లభిస్తుంది. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో అందుతాయి. క్రీడాకారులు, పరిశోధకులు, రచయితలకు శుభవార్తలు అందుతాయి. 1,2 తేదీల్లో దూరప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. ఆశించిన రాబడి దక్కి అవసరాలు తీరతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. విద్యార్థుల యత్నాలు కాస్త ఫలిస్తాయి. వ్యాపారులకు లాభాలు, పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. పారిశ్రామిక వర్గాలు, రచయితలకు కీలక సమాచారం అందుతుంది. 2,3 తేదీల్లో శారీరక రుగ్మతలు. సోదరులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

పరిచయాలు పెరుగుతాయి. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణాలు, సమస్యల నుంచి బయటపడతారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు విస్తరణ పనులు చేపడతారు. రచయితలు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలకు మరింత అనుకూల పరిస్థితులు. 5,6 తేదీల్లో వ్యయప్రయాసలు. కుటుంబసభ్యులతో తగాదాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేస్తారు. లక్ష్యాల సాధనలో ముందడుగు. కుటుంబంలో చికాకులు తొలగి ఊరటచెందుతారు. నిరుద్యోగుల శ్రమఫలించే సమయం. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. వ్యాపారులకు లాభాలు అందుతాయి. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు శ్రమ ఫలిస్తుంది. రచయితల యత్నాలు సఫలం. 6,7 తేదీల్లో బంధువులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆదిత్య హృదయం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

చేపట్టిన కార్యక్రమాలు చకచకా పూర్తి కాగలవు. ఆదాయం కొంత పెరిగి అవసరాలు తీరతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడవచ్చు. ధార్మిక కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. కాంట్రాక్టర్లకు మరింత ఉత్సాహవంతంగా గడుస్తుంది. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో సమస్యలు. శారీరక రుగ్మతలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కొన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో అధిగమిస్తారు. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఆలోచనలు కార్యరూపం పెడతారు. ఇంటి నిర్మాణ యత్నాలలో కొంత పురోగతి ఉంటుంది. వ్యాపారులు సంస్థలను లాభాల దిశగా నడిపిస్తారు. పారిశ్రామిక వర్గాలకు మరింత ప్రోత్సాహం. రచయితలు, కళాకారులకు కాస్త అనుకూలత. 2,3తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

సమస్యలు క్రమేపీ తొలగుతాయి. పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆస్తుల విషయంలో కొత్త ఒప్పందాలు చేసుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలలో కదలికలు. దేవాలయాలు సందర్శిస్తారు. రాజకీయ, పారిశ్రామివర్గాలు, పరిశోధకులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 3,4 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఒక సమాచారం ఆశ్చర్యపరుస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయ,వ్యయాలు సమానంగా ఉంటాయి. ఆస్తుల వ్యవహారాలలో ఒప్పందాలు వాయిదా పడవచ్చు. వ్యాపారులకు సామాన్య లాభాలు దక్కుతాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలు, రచయితలకు ఒత్తిడులు మరింత పెరుగుతాయి. 1,2తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. విష్ణుధ్యానం చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

సన్నిహితులు మీకు మరింత చేదోడుగా నిలుస్తారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు కాస్త ఊరట లభిస్తుంది. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు గతంకంటే మెరుగ్గా ఉంటుంది. పారిశ్రామికవర్గాలు, రచయితలు, కళాకారులకు శ్రమ ఫలిస్తుంది. 4,5తేదీల్లో ఖర్చులు. శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

వీరికి పట్టింది బంగారమే అన్నట్లుగా ఉంటుంది. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆస్తుల విషయంలో చిక్కులు తొలగుతాయి. వ్యాపారులకు మరింత లాభసాటిగా. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 1,2తేదీల్లో కుటుంబ సభ్యులతో విభేదాలు. మానసిక అశాంతి. లక్ష్మీస్తుతి మంచిది.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొన్ని కార్యక్రమాలలో కొంత జాప్యం జరిగినా పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు ఒక ప్రకటన ఊరటనిస్తుంది. కొత్త కాంట్రాక్టులు పొందుతారు. అదనపు ఆదాయం. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. వ్యాపారులు లక్ష్యాలు సాధిస్తారు. కళాకారులు, పరిశోధకుల యత్నాలు. 6,7తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధు వులతో తగాదాలు. విష్ణుసహస్రనామ పారాయణం చేయండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

వ్యతిరేకులు కూడా అనుకూలురుగా మారతారు. సమాజంలో మీపై ఆదరణ పెరుగుతుంది. నూతన ఉద్యోగయత్నాలు సానుకూలం. అదనపు ఆదాయం సమకూరుతుంది. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఇంటి నిర్మాణాల్లో ముందడుగు వేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులకు కాస్త ఊరట లభిస్తుంది. ఉద్యోగులకు నిరుత్సాహం. 5,6తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

నిర్వహణ : పోపూరి విశ్వనాథ్ 9133197111

# పదరసం-458

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | | 4 | | | ■ |
| | ■ | | ■ | | ■ | | ■ | ■ | 5 |
| | ■ | 6 | | | ■ | ■ | 7 | | |
| 8 | | | ■ | 9 | | 10 | ■ | ■ | |
| | ■ | ■ | ■ | | ■ | 11 | | 12 | |
| ■ | 13 | | 14 | | ■ | | ■ | | ■ |
| 15 | | ■ | | ■ | 16 | | 17 | | 18 |
| ■ | | ■ | 19 | | | ■ | | ■ | |
| 20 | | ■ | | ■ | | ■ | 21 | | |
| ■ | 22 | | | | ■ | 23 | | ■ | |

## ఆధారాలు

**అడ్డం**

1) దప్పుకొట్టి వేసే చాటింపు (3)

3) పెడబొబ్బలు (5)

6) విధము (3)

7) సమయం, అవకాశం (3)

8) గౌరవంతోకూడిన సామర్థ్యానికి మొదలు లేదు (3)

9) ముక్కలు చేసేది, కోసేది (3)

11) మోసగాడు, టక్కరి (4)

13) సమయం తెలిపేది (4)

15) స్పృహ, ఆలోచన (2)

16) సూతుడు అష్టాదశపురాణాలను ప్రవచించిన దివ్యప్రదేశం (5)

19) వ్యర్థమైన మాటల ప్రేలుడు (3)

20) తిరగబడ్డ వ్యవసాయం (2)

21) అపసవ్యంగా పంచడం (3)

22) అటునించి వచ్చిన కష్టాలు (4)

23) రెండోసగం లేని కుజుడు (2)

**నిలువు**

1) శ్రీరాముడు అరణ్యావాసం చేసిన అడవి (5)

2) మన దేశపు ప్రథమ పౌరుడు (4)

3) "ఇది" అయిందంటే (వాడుకభాషలో) మొత్తం ఖర్చు చేసేసినట్లు (6)

4) వారణాశి (2)

5) కొందరిపై ఉండే ఉన్నతోద్యోగి (4)

10) సుమారు (4)

12) చిరిగిన తెర (3)

13) మనం తరచూ వాడే నల్లమందు మొక్క గింజలు ! (5)

14) గురువు ఆగ్రహాదేశం వలన, నేర్చుకున్న వేదాలను కక్కినవాడు (5)

16) ఒక (మూల) దిక్కు (3)

17) బొక్కసం ముక్కలైంది (4)

18) పైకొచ్చిన వీటిని తెలియనివాడంటే సాధువు, అమాయకుడు (4)

## పదరసం - 457 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ప్ర[1] | తి | ఫ | లం[2] | ■ | ■ | అ[3] | ■ | మా[4] | వి[5] |
| తీ | ■ | ■ | చం[6] | ప[7] | క | మా | ల | ■ | రి |
| కా[8] | టు | క[9] | ■ | ద్దు | ■ | ను | ■ | తా[10] | వి |
| రం | ■ | ప్ప | ■ | ■ | కూ[11] | షం | లం | క | ■ |
| ■ | తం[12] | దా | న | తా[13] | న | ■ | ■ | ట్టు[14] | బో[15] |
| బై[16] | ■ | టు | ■ | రం | ■ | ■ | ప్రా[17] | ■ | టా |
| తు[18] | చ[19] | ■ | ఆ[20] | గం | త[21] | కు | డు | ■ | బో |
| ■ | తు | ■ | లా | ■ | ళ్ళి | ■ | పు[22] | క్కి | టి |
| తె[23] | ర | చా | ప | ■ | కో[24] | రి | క | ■ | ■ |
| ■ | త | ■ | న[25] | ట్టే | ట | ■ | థ[26] | ప | కం |

తెలుగు చిత్రసీమలో ఇప్పుడు రీ-రిలీజ్ చిత్రాల హంగామా సాగుతోంది. కరోనా కారణంగా కొత్త సినిమాల నిర్మాణంలో జాప్యం జరగడం, థియేటర్‌కు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులు రాకపోవడంతో కొందరు నిర్మాతలు పాత చిత్రాల పంపిణీ హక్కుల్ని తీసుకుని రీ-రిలీజ్ చేయడం మొదలు పెట్టారు. వారం రోజుల పాటు ఈ సినిమాలు ఆడకపోయినా, వారాంతపు కలెక్షన్స్ బాగుంటే చాలని భావించారు. అలా విడుదలైన కొన్ని సినిమాలు చక్కని విజయాన్ని అందుకోవడంతో ఆ ట్రెండ్ ఇప్పుడు జోరందుకుంది.




# సినిమాల రీ-రిలీజ్ వరమా!? శాపమా!?

అగ్ర కథానాయకుల పుట్టిన రోజున వారు నటించిన సినిమాలను విడుదల చేయడం మొదలెట్టారు. అలానే ఏదైనా సినిమా విడుదలై పదేళ్లు, ఇరవై యేళ్లు గడిచిన సందర్భాలలో సదరు స్టార్ హీరోల సినిమాను రీ-రిలీజ్ అవుతున్నాయి. గతంలో ఎన్టీయార్, ఎయన్నార్ వంటి కథానాయకుల సినిమాలు రెండు మూడు సంవత్సరాల తర్వాత తిరిగి విడుదల అవుతుండేవి. చిత్రం ఏమంటే... ఫస్ట్ రన్‌లో ఆడని సినిమాలు సైతం సెకండ్ రన్‌లో హిట్ అయిన సందర్భాలున్నాయి. అలానే మొదటిసారి విడుదలైనప్పుడు శతదినోత్సవం జరుపుకున్న సినిమాలు సెకండ్ రన్, థర్డ్ రన్‌లోనూ శతదినోత్సవం జరుపుకున్న ఉదాహరణలున్నాయి. అయితే... ఆ తర్వాత టీవీ ప్రాబల్యం పెరిగి సినిమాలు బుల్లితెరలో ప్రదర్శితం కావడం మొదలైంది. దాంతో రిపీట్ రన్, రీ-రిలీజ్ వంటి మాటలు తెర వెనక్కి వెళ్లిపోయాయి. కరోనా తర్వాత మళ్లీ ఈ ట్రెండ్ మొదలైంది.

థియేటర్లను ఫీడ్ చేసే స్థాయిలో సినిమాలు నిర్మాణం కాకపోవడం, పాత సినిమాలను చూడటానికి ఈ తరం ఆసక్తి చూపడం ఇందుకు ప్రధాన కారణం. ఇప్పుడు టీవీ కంటే కూడా స్మార్ట్ ఫోన్స్‌లో ఎంటర్ టైన్ మెంట్ కంటెంట్ ను చూడటానికి యువత అలవాటు పడ్డారు. వారికి ఓటీటీలోని వెబ్ సీరిస్, ఓటీటీ సినిమాలే ప్రధాన వినోదంగా మారిపోయింది. థియేటర్లకు ప్రత్యేక పరిస్థితుల్లో కానీ రావడం లేదు. దాంతో తమకు నచ్చినప్పుడు, చూడాలనుకున్నప్పుడు టీవీలో సినిమాలు ప్రదర్శితం కావు. అందువల్ల 20, 30 సంవత్సరాల క్రితం వచ్చిన సూపర్ హిట్ సినిమాలను థియేటర్లలో చూడాలనుకుంటున్నారు. తొలి రన్ లో పరాజయం పాలైన కొన్ని సినిమాలు రీ-రిలీజ్ మంచి కలెక్షన్స్‌ను రాబట్టిన సినిమాగా 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. మ్యూజికల్ హిట్‌గా తమిళనాడులో చక్కని విజయాన్ని అందుకున్నా తెలుగులో మాస్ ఆడియెన్స్‌ను ఇది మెప్పించలేక పోయింది. అయితే ఇటీవల ఈ సినిమా రీ-రిలీజ్ అయినప్పుడు అద్భుతమైన ఆదరణ లభించింది. అలానే తెలుగు చిత్రం 'ఓయ్' మొదటిసారి విడుదలైనప్పుడు ఫ్లాప్ అయ్యింది. సిద్ధార్థ్ హీరోగా నటించిన ఈ సినిమాలో కథానాయికగా నటించిన షామిలీ పాత్ర కన్నుమూస్తుంది. దాంతో ఈ ట్రాజెడీ రొమాంటిక్ లవ్‌స్టోరీని జనం ఆదరించలేదు. కానీ రీ-రిలీజ్ లో ఈ సినిమాను బాగానే చూశారు. 'పెళ్లిచూపులు'తో దర్శకుడిగా పరిచయమైన తరుణ్ భాస్కర్‌తో సురేశ్ ప్రొడక్షన్స్ 'ఈ నగరానికి ఏమైంది' సినిమా నిర్మించగా ఫస్ట్ రిలీజ్ లో ఫ్లాప్ అయ్యింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రాన్ని యూత్ సైతం తిరస్కరించింది. కానీ ఇటీవల రీ-రిలీజ్ చేసినప్పుడు అదే యూత్ బాగా ఎంజాయ్ చేసింది. వాళ్ల స్పందన చూసి... 'ఇదే స్పందన ఫస్ట్ రిలీజ్ లో లభించి ఉంటే తన కెరీర్ మరో విధంగా ఉండేద'ని తరుణ్ భాస్కర్ కామెంట్ చేశాడు. నిన్న పరాజయాలు రేపటి విజయాలుగా మారే ఛాన్స్ ఉందని ఇలాంటి సినిమాలు కొన్ని నిరూపించాయి.

ఇక అగ్ర కథానాయకుల పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన సినిమాలకు వీకెండ్‌లో భారీ ఆదరణ లభిస్తోంది. మహేశ్ బాబు, ప్రభాస్, పవన్ కళ్యాణ్, ఎన్టీయార్ వంటి స్టార్స్ సినిమాలు యేడాది కాలంగా రెండు నెలలకు ఒకటి చొప్పున రీ-రిలీజ్ అవుతూనే ఉన్నాయి. మార్చి నెలలో రవితేజ 'కిక్', ఎన్టీయార్ 'సింహాద్రి', బాలకృష్ణ 'సమరసింహారెడ్డి', ఉదయ్ కిరణ్ 'నువ్వు - నేను', మారుతీ డైరెక్ట్ చేసిన తొలి చిత్రం 'ఈ రోజుల్లో' విడుదల అయ్యాయి. వాటికి మంచి స్పందన లభించింది.

బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో రికార్డులను తిరగరాసిన 'లెజెండ్' వెయ్యి రోజులు పైగా ఆడింది. పదేళ్ల క్రితం మార్చి 28న ఈ సినిమా విడుదలైన ఈ సినిమా 30వ తేదీ మరోసారి జనం ముందుకు వచ్చింది.

ఇదే ట్రెండ్ రాబోయే రోజుల్లోనూ కొనసాగనుంది. మూడు దశాబ్దాల క్రితం వచ్చిన 'ప్రేమికుడు' సినిమాను ఎవరూ అంత తేలికగా మర్చిపోలేరు. ప్రభుదేవా, నగ్మ జంటగా శంకర్ దర్శకత్వంలో కుంజుమోహన్ ఈ సినిమాను నిర్మించారు. అప్పట్లో తమిళంలోనే కాదు... తెలుగులోనూ ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అయ్యింది. పలు భాషల్లో ఇది డబ్ అయ్యి అక్కడా అఖండ విజయాన్ని అందుకుంది. సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ లో ప్రభుదేవా డాన్స్ చేస్తేనే మైమరచిపోయి ఫ్యాన్స్... సినిమాలోని అన్ని పాటల్లో అతనే డాన్స్ చేయడం, పైగా హీరోగా నటించడంతో ఖుషీ అయిపోయారు. దానికి తోడు ఓ చక్కటి ప్రేమకథను జత చేశారు. దాంతో ఈ సినిమా సినీ అభిమానుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంది. ఏప్రిల్‌లో 3న ప్రభుదేవా పుట్టినరోజును పురస్కరించుకుని మొదటి వారంలో 'ప్రేమికుడు' సినిమాను తెలుగులో రీ-రిలీజ్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'హ్యాపీడేస్' మూవీ 2007లో విడుదలై చక్కని విజయాన్ని అందుకుంది. ఇప్పుడీ సినిమా ఏప్రిల్ 12న రీ-రిలీజ్ కాబోతోంది. విశేషం ఏమంటే... ఇలా పాత చిత్రాలు రీ-రిలీజ్ కావడం వల్ల చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం లేదని కొందరు విమర్శిస్తుంటే.. థియేటర్ల ఫీడింగ్ కోసం ఇలా సినిమాలు రీ-రిలీజ్ కావడం మంచిదేనని ఎగ్జిబిటర్స్ అంటున్నారు. నిజం చెప్పాలంటే... ఇప్పుడు పండగ సీజన్‌లోనూ పెద్ద హీరోల సినిమాలు సరిగా విడుదల కావడం లేదు. దాంతో అభిమానులు ఇలా వస్తున్న రీ -రిలీజ్ మూవీస్ తోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ ట్రెండ్ ఎంతకాలం కొనసాగుతుందో చూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.360/-




వెల : ₹.90/-




వెల : ₹.200/-




వెల : ₹.100/-




వెల : ₹.150/-




వెల : ₹.999/-




వెల : ₹.395/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.599/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 21

